www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 165 మంగళవారం, మార్చి 10, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు

- కుట్ర బయటపడుతుందనే వెనుకడుగు
- దేశ ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది
- సంక్షోభంతో చమురు ధరల పెరుగే అవకాశం
- కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు డిమాండ్



**న్యూఢిల్లీ,మార్చి 9 :** భారత ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ఇష్టపడటం లేదని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చ జరిగితే ప్రధాని మోదీ అమెరికా, ఇజ్రాయెల్‌కు ఎలా

మిగతా2లో...

## ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

- సాయం కోసం ప్రజలు పోలీసుల వైపే చూస్తారు
- ప్రజలకు మీరున్నారనే ధైర్యం ఇందుకు కారణం
- నేరాల తీరు మారి..సైబర్ క్రైమ్ పెరిగింది
- నేరాల తీరుకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలి
- పోలీస్ ఆఫీసర్స్ రీట్రీట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,మార్చి 9 :**ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ అధికారులు చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మనం ఎక్కడున్నామోతెలిసుకోగలిగితే మనం ఎక్కడికి చేరుకోవాలో తెలుస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమిలో తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్-2026 కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ రిట్రీట్ కార్యక్రమం ద్వారా సమస్యలు, పరిష్కారాలపై

మిగతా2లో...



## తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభకు ఏకగ్రీవం

- ధృవీకరణ పత్రాలు అందచేత

**హైదరాబాద్,మార్చి 9 :** తెలంగాణ నుంచి నామినేషన్ దాఖలు చేసిన ఇద్దరు అభ్యర్థులు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి సోమవారం

మిగతా2లో...

## ఇరాన్ కొత్త సుప్రీంగా మొజ్తబా

- ఖమేనీ రెండో కుమారుడు మొజ్తబా
- దేశవ్యాప్తంగా ప్రజలు సంబరాలు



**లెబనాన్, మార్చి 9 :** ఇరాన్ తమ దేశ నూతన సుప్రీం లీడర్‌ను ఎన్నుకుంది. కొత్త సుప్రీం లీడర్‌గా అయతొల్లా ఖమేనీ తనయుడు మొజ్తాబా ఖమేనీని ఎన్నుకున్నట్లు ఇరాన్ అధికారి కంగా ప్రకటించింది. 56 ఏళ్ల అయతొల్లా సయ్యద్ మొజ్తాబా హొస్సేని ఖమేనీ అలియాస్ మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌కు మూడో సుప్రీం లీడర్‌గా ఎన్నికయ్యాడు. మొజ్తాబాను ఇరాన్

మిగతా2లో...

## అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

- ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు
- ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ
- క్రీడాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



2లో

## కవితకు మళ్లీ నోటీసులు!

- లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం..




2లో

## రైతుబంధు పథకం బంద్... రాహుల్ బంద్ స్టార్

- సిఎం రేవంత్‌పై కెటిఆర్ వ్యంగ్యాస్త్రాలు



**రాజన్నసిరిసిల్ల,మార్చి 9 :** రాష్ట్రంలో రైతు బంధు పథకాన్ని బంద్ చేసి.. కొత్తగా రాహుల్ బంధు పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ తీసుకు వచ్చారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఏడాదికి రూ. వెయ్యి కోట్లు పంపడమే రాహుల్ బంధు పథకమని ఆయన అభివర్ణించారు. సంవత్సరానికి రూ.1000 కోట్లు కప్పం కట్టి తన పదవిని సీఎం రేవంత్ రెడ్డి కాపాడుకొంటున్నారని ఆరోపించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఆయన ఘనంగా

మిగతా2లో...

## వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా

- ఖమ్మం జడ్పీ కూడలిలో ఆందోళన
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- కవితను అరెస్ట్ చేసిన పోలీసులు



**ఖమ్మం,మార్చి 9:** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో వెలుగుమట్ల బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకూ బాధితులకు ప్రభుత్వం అండగా లేదని విమర్శించారు. ప్రభుత్వం తరపున వారికి వైద్య సహాయం కూడా అందలేదన్నారు. అనంతరం ఖమ్మం జడ్పీ కూడలిలో కవిత ఆందోళనకు దిగారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలంటూ ధర్నా నిర్వహించారు. బాధితులతో కలిసి జడ్పీ కూడలిలో రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని సర్ది చెప్పడంతో ఆమె నిరసనను విరమించుకున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలోని జడ్పీ సెంటర్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెలుగుమట్ల భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి ఆందోళనకు తెలంగాణ

మిగతా2లో...

## తిరుమల లడ్డూకు నెయ్యి కొరత లేదు

- అందుబాటులో తయారీకి కావాల్సినంత నెయ్యి
- తప్పుడు ప్రచారాలను ఖండించిన టిటిడి



**తిరుమల,మార్చి 9 :** శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి అవసరమైన నెయ్యి నిల్వలు సరిపడా ఉన్నాయని తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి బోర్డు స్పష్టం చేసింది. తితిదే వద్ద నెయ్యి నిల్వలు సరిపడా లేవని, లడ్డూ ప్రసాదాల తయారీలో అంతరాయం ఏర్పడుతోందని ఇటీవల కొందరు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేయడంపై తితిదే స్పందించింది. ఇలా అసత్య ప్రచారం చేయడం సరికాదని తితిదే పేర్కొంది. లడ్డూల తయారీకి

మిగతా2లో...

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఘనంగా వీడ్కోలు



2లో

## అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు

(మొదటి పేజీ తరువాయి)

రాజీ పడ్డారో బయటపడుతుందని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులు దేశ ప్రజలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. అలాగే అక్కడి సంక్షోభం చమురు ధరల పెరుగుదలకు దారితీయవచ్చని అభిప్రాయపడ్డారు. "పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద నష్టాన్ని కలిగిస్తుంది. స్టాక్ మార్కెట్లలో ఏం జరుగుతుందో మీరు చూశారు. ప్రధాని మోదీ అమెరికా ట్రేడ్ డీల్‌పై సంతకం చేశారు. దీంతో దేశం దెబ్బ తినబోతోంది. అలాగే పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చించడంలో వారికి ఏ సమస్య ఉంది? ఆ తర్వాత మనం ఇతర అంశాలపై చర్చ జరపవచ్చు. పశ్చిమాసియా మన దేశానికి ముఖ్యం కాదా? ఇంధన ధరలు, ఆర్థిక విధ్వంసం మనకు ముఖ్యమైన చర్చనీయాంశాలు కావా? అవే మనకు ప్రజా సమస్యలు" అని రాహుల్ గాంధీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని తాము ముఖ్యమైనదిగా భావిస్తున్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకే ఆ అంశంపై చర్చను కోరుతున్నామని అన్నారు. "కానీ కేంద్ర సర్కార్ పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చ జరిపేందుకు ఇష్టపడడం లేదు. ఎందుకంటే ఆ అంశంపై చర్చ జరిపితే ఇతర విషయాలు బయటకు వస్తాయి. ప్రధాని మోదీ వైఖరి బయటపడుతుంది. మోదీ ఎలా రాజీ పడ్డారు? ఆయనను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారు? వంటి విషయాలు తెలుస్తాయి. అందుకే పార్లమెంట్‌లో పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు కేంద్రం ఇష్టపడడం లేదు. చర్చకు డిమాండ్ చేస్తున్న సమయంలో ప్రధాని మోదీ పార్లమెంట్ నుంచి ఎలా పారిపోయారో మీరు చూశారు. ఒకవేళ పశ్చిమాసియా సంక్షోభంపై చర్చ జరిగితే ప్రధాని మోదీ పార్లమెంట్‌కు రాలేరు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే వీబీ జీ రామ్ జీ అమలు నేపథ్యంలో కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ మండిపడింది. ఈ పథకం వివరాలు ఇంకా రూపొందుతున్నాయని, ఇది మోదీ ప్రభుత్వ వేగవంతమైన విధానానికి సరైన ఉదాహరణ అని పేర్కొంది. అలాగే పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులను వెనక్కి రప్పించేందుకు భారత్ అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని అన్నారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న సుమారు కోటి మంది భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. కాగా, పశ్చిమాసియా సంక్షోభం పార్లమెంట్ ఉభయ సభలను సోమవారం కుదిపేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు రాజ్యసభ, లోక్‌సభలో నిరసనలు చేపట్టాయి. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నాయని బీజేపీ ఎంపీలు ఆరోపించారు.

## ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

(మొదటి పేజీ తరువాయి)

విశ్లేషించుకున్నట్లు సిఎం తెలిపారు. ఛాలెంజ్ లు రెండు రకాలు.. ఒకటి టెక్నికల్ ఛాలెంజ్, రెండోది అడాప్టివ్ఛాలెంజ్ అన్నారు. రిసోర్సెస్, సమయాన్ని కేటాయిస్తే టెక్నికల్ ఛాలెంజ్ ను అధిగమించవచ్చున్నారు. కానీ అడాప్టివ్ఛాలెంజ్ విషయంలో ఎదురైన సమస్య లోతును అర్థంచేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు అదుపులో ఉండాలన్నారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండకూడదనే తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ ను ఆవిష్కరించుకున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడానికి ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న 2100కి.మీ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ గా పరిగణించుకుంటున్నాం అని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని అన్నారు. దేశంలో ఢిల్లీ అత్యంత కాలుష్య నగరంగా మారింది. ట్రాఫిక్ సమస్యలతో బెంగుళూరు నగరంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముంబై, చెన్నై నగరాలు వరదలతో సతమతమవుతున్నాయి. అలాంటి మెట్రోపాలిటన్ నగరాల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు మొట్టమొదట సహాయం కోసం ఎదురు చూసేది పోలీసుల కోసమేనని అన్నారు. ఒకప్పుడు తీవ్రవాదం ఒక సమస్యగా ఉండేది.. ఇందుకోసం ఆక్టోపస్, గ్రేహౌండ్స్ లాంటి వ్యవస్థలు తీసుకొచ్చారు. అవినీతిని నిరోధించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఫిజికల్ క్రైమ్ నిరోధించేందుకు ఇప్పటి వరకు వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాం. కానీ ఇప్పుడు నేర స్వరూపమే మారిపోయింది. సైబర్ క్రైమ్ పెరిగిపోతున్న ఈ రోజుల్లో మన సిస్టం ను అప్ గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవాల్సిన అవసరం ఉంది. ఉన్న సిబ్బంది, అధికారులను అప్ గ్రేడ్ చేసుకోకపోతే నేరాలను నిరోధించలేమని గుర్తు చేశారు. రిట్రీట్ కార్యక్రమం ద్వారా మీ సమస్యలను గుర్తించి విశ్లేషించుకున్నారు. సమస్య ఏమిటో గుర్తిస్తే 50 శాతం సమస్య పరిష్కారం అయినట్లే. సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్, ఇతర అంశాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి మీరు కొన్ని ప్రతిపాదనలు అందించారు. సమస్యల పరిష్కారానికి మీరు అందించిన ప్రతిపాదనలపై విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తాం.. మీ ప్రతిపాదనలపై కమిటీలో విశ్లేషించి చట్టం రూపంలో మా ముందుకు తీసుకు రండి. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వం దానిపై నిర్ణయం తీసుకుంటుంది. పోలీస్ శాఖలో సిబ్బంది రేషనలైజేషన్ చేసుకుని జనాభా ప్రాతిపదికన పోలిసింగ్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంది. మీ పనితీరు ఆధారంగానే పోస్టింగులు ఉంటాయి. ప్రతీ ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

## అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

**హైదరాబాద్,మార్చి 9 :** అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. వర్సిటీ నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించారు. దీనికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని సదుపాయాలతో స్పోర్ట్స్ వర్సిటీ నిర్మాణాలు ఉండాలి. ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా చర్యలు తీసుకోవాలి. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని ఆధునికీకరించాలి. అదేవిధంగా గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్రీడాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన, అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్చించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా రాష్ట్రంలో అన్ని సౌకర్యాలతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని సీఎం అన్నారు. గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియంను పునరుద్ధరించడం తో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించారు. డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసారు. ఒలంపిక్స్, కామన్ వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా, ఒలంపిక్స్ లో తెలంగాణ క్రీడాకారుల సత్తా చాటడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డి, శాప్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాస రాజు, శేషాద్రి, ఎండీ సోనీ బాలదేవి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కవితకు మళ్లీ నోటీసులు!

**న్యూఢిల్లీ,మార్చి 9 :** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కవిత సహా 23 మంది నిందితులకు ఢిల్లీ హైకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. రౌస్ అవెన్యూ కోర్టు నిందితులకు ఊరట కలిగిస్తూ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మోహతా వాదనలు వినిపించారు. ఇటీవల ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసులో నిందితులుగా ఉన్న ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కల్వకుంట్ల కవితతో పాటు మొత్తం 23 మందిపై సీబీఐ అభియోగాలను డిశ్చార్జ్ చేస్తూ వారికి ఊరట కలిగించడం తెలిసిందే. అయితే ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో నిందితులకు అనుకూలంగా రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కేసు విచారణలో భాగంగా నిందితులపై ఉన్న అభియోగాలను మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని, కింది కోర్టు నిర్ణయంపై స్టే ఇవ్వాలని సీబీఐ కోరింది. దీనిపై స్పందించిన ఢిల్లీ హైకోర్టు, నిందితులు విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. ఇటీవల రౌస్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కాం కేసులో కీలక వ్యాఖ్యలు చేసింది. దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లలోని కొన్ని అంశాలపై స్పష్టత లేదని, సాక్ష్యాధారాల సేకరణలో జాప్యం జరుగుతోందని కోర్టు అభిప్రా యపడింది. కొందరు నిందితులు తమపై ఉన్న కేసులను కొట్టివేయాలని (డిశ్చార్జ్) కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లపై రౌస్ అవెన్యూ కోర్టు సానుకూలంగా స్పందిం చింది. కేవలం ఆరోపణలతో కేసు దర్యాప్తు జరిగిందని, తగినన్ని ప్రాథమిక ఆధారాలు లేకుండా నిందితులను ఎక్కువ కాలం జైల్లో ఉంచడం లేదా విచారణను సాగదీయడం సరికాదని కోర్టు పేర్కొంది. ఈ క్రమంలోనే 23 మంది నిందితులపై ఉన్న అభియోగాలను కోర్టు కొట్టివేస్తూ వారి లిక్కర్ పాలసీ కేసు నుంచి విముక్తి కల్పించింది. సీబీఐ ఇప్పుడు ఈ అంశాలన్నింటినీ ఢిల్లీ హైకోర్టులో సవాలు చేస్తోం ది. ఆప్ ప్రభుత్వం హయాంలో జరిగిన లిక్కర్ పాలసీ స్కామ్‌లో భారీగా ముడు పులు చేతులు మారాయని, దీని వెనుక ఉన్న 'సౌత్ గ్రూప్', ఇతర రాజకీయ నేతల ప్రమేయాన్ని నిరూపించడానికి మరింత లోతుగా దర్యాప్తు జరగాలని సీబీఐ వాది స్తోంది. ఈ కేసు తదుపరి విచారణ మార్చి 16కు ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది.

## సీఈసీపై అభిశంసన.. తీర్మానానికి సిద్ధమవుతున్న విపక్షాలు

**• ఈ వారంలోనే నోటీసు ఇచ్చే అవకాశం**



**న్యూఢిల్లీ,మార్చి 9 :** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తొలగింపునకు పార్లమెంట్‌లో తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ తీర్మానానికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైందని, ఈ వారంలోనే నోటీసు ఇచ్చే అవకాశముందని తెలిసింది. ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా, ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నాయని టీఎంసీ సీనియర్ ఎంపీ వెల్లడించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానం ముసాయిదా సిద్ధమైందని అన్నారు. ఒకేసారి రెండు సభల్లో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఎన్నికల కమిషనర్ తన పదవిని పూర్తిగా దుర్వినియోగం చేశారని ఆ నాయకుడు ఆరోపించారు. ఇండియా కూటమిలోని ఇతర పార్టీలన్నీ ఈ అభిశంసన తీర్మానానికి అనుకూలంగా ఉన్నాయని, ముసాయిదా రూపకల్పనలో భాగస్వామ్యమైనాయని తెలిసింది. తీర్మానంపై అన్ని పార్టీల నాయకులు ఎంపీల సంతకాలను సేకరించనున్నారు. లోక్‌సభ నుంచి కనీసం 100, రాజ్యసభ నుంచి కనీసం 50 మంది సంతకాలు అవసరమని ఓ నాయకుడు తెలిపారు. పార్లమెంట్ ద్వారా హైకోర్టు లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించేందుకు అనుసరించే విధానమే సీఈసీ తొలగింపునకు కూడా వర్తిస్తుందని అన్నారు.

## ఇరాన్ కొత్త సుప్రీంగా మొజ్తబా

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ నిపుణుల బృందం ఎన్నుకుంది. ఇందులో 88 మంది ఇస్లాం మత గురువులు ఉంటారు. వీరందరూ కలిసి ఆదివారం సమావేశమై కొత్త సుప్రీం లీడర్ కోసం చర్చ జరిపారు. మెజారిటీ సభ్యులు మొజ్తాబా వైపు మొగ్గు చూపారు. కొందరు సభ్యులు వారసత్వ నాయకత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ.. మెజారిటీ ఉండటంతో మొజ్తాబానే ఎన్నుకున్నారు. ఒకవైపు ఇరాన్‌పై దాడులు కొనసాగుతున్నా, మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ కొత్త లీడర్ ఎంపికను ఇరాన్ పూర్తి చేసింది. అతడు, ఎప్పటినుంచి బాధ్యతలు స్వీకరిస్తారో తెలియరాలేదు. మొజ్తాబాకు విదేశాల్లో భారీగా ఆస్తులున్నాయి. అతడికి లండన్‌లో దాదాపు 2,500 కోట్లకుపైగా ఆస్తులున్నట్లు అంచనా. కెన్సింగ్‌టన్ ప్యాలెస్‌లో అతడికి ఖరీదైన అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. 2014 నుంచి లండన్‌లో ఆస్తులు కలిగి ఉన్నాడు. అక్రమ చమురు అమ్మకాల ద్వారా ఇదంతా సంపాదించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఇటీవలి పరిణామాల నేపథ్యంలో లండన్‌లోని అతడి ఆస్తులపై ఇజ్రాయెల్, అమెరికా నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. అతడి ఆస్తులకు భద్రతాపరమైన ముప్పు ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు మొజ్తాబా ఎంపికను అమెరికా, ఇజ్రాయెల్ అంగీకరించడం లేదు. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునేముందు తమ అనుమతి తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. అలాగే కొత్త లీడర్ ఎవరైనా సరే అంతం చేస్తామని ఇజ్రాయెల్ ఇదివరకే ప్రకటించింది.

## తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభకు ఏకగ్రీవం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున వేం నరేంద్ర రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు రాజ్యసభకు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అందుకు సంబంధించిన పత్రాలను వీరికి అందజేసినట్లు తెలిపారు. అభిషేక్ మను సింఘ్వీ తరఫున అడ్వకేట్ సుందర్ చౌహాన్ అందుకున్నారు. వేం నరేందర్ రెడ్డి అసెంబ్లీ కార్యాలయానికి వచ్చి ధృవీకరణ పత్రం స్వీకరించారు. రాజ్యసభలో పలువురి సభ్యుల పదవి కాలం ఏప్రిల్‌లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. గురువారంతో నామినేషన్ల ప్రకియ ముగిసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ తరఫున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన రాజ్యసభ ఎన్నికల కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఇక.. సాయి అనే వ్యక్తి సైతం ఈ రాజ్యసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అతడి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో.. శుక్రవారం ఆ నామినేషన్‌ను తిరస్కరించారు. అలాగే ఇతరులు ఎవ్వరూ నామినేషన్ల దాఖలు చేయలేదు. దీంతో కాంగ్రెస్ నుంచి నామినేషన్ల దాఖలు చేసిన అభిషేక్, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైంది.

## తిరుమల లడ్డూకు నెయ్యి కొరత లేదు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన నెయ్యి కొనుగోలు విధానం మూడంచెలుగా జరుగుతోంది. ఒకే సంస్థపై ఆధారపడకుండా మూడు వేర్వేరు సంస్థల ద్వారా నెయ్యి సరఫరా జరుగుతోంది. అందుకు తితిదే ముందుస్తు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం భక్తులకు పంపిణీ చేయడానికి సుమారు 7 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధంగా ఉన్నాయి. వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. తితిదే వద్ద నెయ్యి నిల్వలు లేవని, శ్రీవారి కైంకర్యాలు, లడ్డూ ప్రసాదాల తయారీకి ఆటంకం కలుగుతోందని వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దు' అని భక్తులకు విజ్ఞప్తి చేసింది.

## రైతుబంధు పథకం బంద్...రాహుల్ బంద్ స్టార్

(మొదటి పేజీ తరువాయి)

సన్మానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూలగొట్టడమేనా అని ప్రశ్నించారు. మూడో పంటకు రైతు బంధు వేయాలన్నారు. కానీ నేటికి మూడో నెల వచ్చిన రైతు బంధు వేయడం లేదని రేవంత్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక కష్టాలు ఉన్న మాట నిజమైతే రూ.లక్షన్నర కోట్లతో మూసి సుందరీకరణ ఎవరు చేయమన్నారంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. రైతు బంధు మీద దృష్టి పెట్టు.. అంతేకానీ రాహుల్ బంధు మీద కాదంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ చురకలంటించారు. ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వికలాంగుల ఇళ్లను సైతం నిర్దాక్షిణ్యంగా కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సొంత ఇల్లు, ఆయన సోదరుడి ఇల్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని.. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపై కేటీఆర్ వ్యంగ్య బాణాలు సంధించారు. వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులు కావస్తున్నా అతీగతీ లేదని విమర్శించారు. ఆడబిడ్డల పెళ్లికి తులం బంగారం, రైతులకు పంట బోనస్, మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఘనంగా వీడ్కోలు

**హైదరాబాద్,మార్చి 9 :** మహారాష్ట్ర గవర్నర్ గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ , కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఘనంగా వీడ్కోలు పలికింది. బేగంపేట ఎయిర్ పోర్ట్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చాను అందజేసి వీడ్కోలు పలికారు. వారితో కరచాలనం చేసి ఆత్మీయంగా పలకరించారు.

## వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

జాగృతి అధ్యక్షురాలు కవిత దిగారు. ఈ క్రమంలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కవితతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్, పలువురు ఆందోళనకారులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం నగరంలో వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి కవిత సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. అక్కడికి చేరుకున్న అనంతరం కవిత అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ ర్యాలీ అనంతరం నిర్వాసితులు ఖమ్మం జడ్పీ సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనలో భాగంగా కొంతమంది నిర్వాసితులు రాస్తారోకో నిర్వహించి వాహనాలను అడ్డుకున్నారు. దీంతో జడ్పీ సెంటర్ పరిసరాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్‌తో పాటు పలువురు నిర్వాసితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కవితను నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనల నేపథ్యంలో ఖమ్మం జడ్పీ సెంటర్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు.

# దివ్యాంగుల కొత్త పింఛన్ల నమోదు ప్రారంభం..!

**అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి**
**ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత**



**ఏటూరునాగారం ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 09( పీపుల్స్ న్యూస్)**ములుగు జిల్లా ఏటూరునాగారం గ్రామపంచాయతీ పరిధిలో అర్హులైన దివ్యాంగుల కోసం కొత్త పింఛన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు సర్పంచ్ కాకులమర్రి శ్రీలత తెలిపారు. గ్రామంలోని ప్రతి అర్హుడికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించేందుకు ఈ ప్రక్రియ చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీలత మాట్లాడుతూ గ్రామంలోని వార్డు సభ్యులు తమ తమ వార్డుల్లో ఉన్న దివ్యాంగులను గుర్తించి వారికి సమాచారం అందించాలని కోరారు. అర్హులైన వారిని అవసరమైన పత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయానికి తీసుకురావాలని సూచించారు. దరఖాస్తులు పూర్తి చేసిన అనంతరం వాటిని ఎంపీడీఓ కార్యాలయానికి పంపించి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. దరఖాస్తుకు సదరం సర్టిఫికేట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, ఫోటోలు అవసరమని పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సర్పంచ్ కాకులమర్రి శ్రీలత కోరారు.

# గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించడానికి గ్రామ ప్రజావాణి ఏర్పాటు

**సర్పంచ్ బానోతు నిర్మల వెంకన్న**






**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 09( పీపుల్స్ న్యూస్):**ములుగు జిల్లా గోవిందరావు పేట మండలం గాంధీనగర్ గ్రామంలో నేడు సర్పంచ్ బానోత్,నిర్మల వెంకన్న ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు ఇకనుండి ప్రతి సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని సర్పంచ్ అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి భారతి, ఉప సర్పంచ్ వల్లపు మహేష్, వార్డు సభ్యులు, మాలోత్ శంకర్, కూరాకుల సురేష్, లాకావత్ ఈర్య, లిక్కి కుమారస్వామి, తేజావత్, హుని భూక్య మంజుల, రామావత్ సంధ్యారాణి మరియు గ్రామ ప్రజలు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# షార్ట్ టర్మ్ కోర్సుల ప్రవేశాలకు ఆహ్వానం








**యాదాద్రి భువనగిరి జిల్లా , మార్చి 9 (పీపుల్స్ న్యూస్) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని ఉపాధి , శిక్షణ శాఖ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ , అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లో 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా షార్ట్ టర్మ్ కోర్సుల ప్రవేశాలను రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి,కాలేజీ ప్రిన్సిపల్ హరికృష్ణ ప్రైవేట్ కాలేజీల యాజమాన్యం,విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు...

# దత్తాత్రేయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్త కమిటీ ప్రమాణ స్వీకారం



**కూకట్ పల్లి, మార్చి 9 (పీపుల్స్ న్యూస్) :** దత్తాత్రేయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్త కమిటీని ఎన్నుకున్నారు. కాలనీ ప్రెసిడెంట్ బుక్క నాగభూషణం , వైస్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, జనరల్ సెక్రెటరీగా కుమ్మరి యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల కృపాకర్ గౌడ్ . పానెల్ సభ్యులు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ అండ్ మెంబర్స్.మా ఈ కొత్త కమిటీని ఎన్నుకున్న దత్తాత్రేయ కాలనీ వాసులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కాకర్యదత్తాత్రేయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ తరఫు నుంచి కాలనీ వాసుల కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. కాలనీవాసులు మా మీద పెట్టుకున్న నమ్మకానికి అంతే బాధ్యతతో మేము చెప్పిన ప్రతి పని కాలనీలో సీసీ కెమెరాలు పెట్టించడం కానీ, ఇంటి నెంబర్లతో కూడిన రోడ్డు నెంబర్ల పలకలు పెట్టించడం కానీ, దత్తాత్రేయ కాలనీ యజమానుల ఆడపడుచు పెళ్లికి సాయిబాబా ఫంక్షన్ హాల్ ఉచితంగా ఇవ్వడం కానీ, మహిళలకు కమ్యూనిటీ హాల్ కట్టించడం కానీ,అన్ని పనులు కూడా ఈ రెండు సంవత్సరాల్లో మీ అందరి సహాయ సహకారాలతో అలాగే గవర్నమెంట్ సహాయ సహకారాలతో అధికారులతో సమన్వయం చేసుకొని అన్ని పనులను పూర్తి చేయడానికి కృషి చేస్తామని తెలియజేస్తూ మీ మన దత్తాత్రేయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్.

# మార్చి 17న ఇందిరాపార్క్ వద్ద గీత కార్మికుల మహాధర్నా

**రాష్ట్ర బడ్జెట్ లో గీత కార్మికుల సంక్షేమానికి 5వేల కోట్లు కేటాయించాలి.**



**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 09 (పీపుల్స్ న్యూస్):**2026-27 రాష్ట్ర బడ్జెట్ లో గీత కార్మికుల సంక్షేమానికి 5000 కోట్లు కేటాయించాలని,గత బడ్జెట్ లో కేటాయించిన 70 కోట్లు ఈ మార్చి నెల లోనే ఖర్చు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 17న ఉదయం 10 గంటల నుండి ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాకు గీత కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేస్తుంది ఫిబ్రవరి 17న సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గం ఇందిరా పార్క్ వద్ద నిరాహార దీక్ష చేసినం. అనంతరం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిసినం. వృత్తికి సంబంధించిన కొన్ని సమస్యలు పరిష్కరించారు.వారికి మనందరి తరపున ధన్యవాదాలు. పెండింగ్ ఎక్స్‌గ్రేషియా 3 కోట్లు వెంటనే ఇచ్చారు.మిగతా 11 కోట్లు ఇస్తామన్నారు. నీరాకేఫ్ ని తెరిపిస్తామన్నారు. దీనికి సంబంధించి టెండర్ ప్రక్రియ ప్రారంభించారు. కాటమయ్య రక్షణ కవచం పంపిణీ చేస్తున్నారు. వృత్తి చేసే వాళ్లందరికీ ఇస్తామన్నారు.మిగతా సమస్యలు సభ్యులందరికీ జీవిత బీమా సౌకర్యం, కొత్త వారికి పెన్షన్, ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ 4 వేలకు, ఎక్స్‌గ్రేషియా 10 లక్షలకు పెంచుతామన్న వాగ్దానం అమలు కాలేదు.ఏజెన్సీ గీత కార్మికుల సమస్య పరిష్కారం కాలేదు. అందుకని మిగతా మన అన్ని సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ మన సోదర వృత్తి సంఘాలతో కలిసి ఈ మహాధర్నా చేస్తున్నాం. రాష్ట్రం లోని గీతకార్మికులు, శ్రేయోభిలాషులు వేలాదిగా తరలి రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అభివందనములతో యం.వి.రమణ, రాష్ట్ర అధ్యక్షులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.కల్లుగీత కార్మిక సంఘం. కె జి కె ఎస్

# సమయపాలన పాటించని ప్రభుత్వ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోండి ప్రజావాణి కార్యక్రమంలో ములుగు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం

**బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కోగిల మహేష్**

**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 09(పీపుల్స్ న్యూస్):** ములుగు జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ములుగు జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తమ ఉద్యోగాలకు సరైన సమయంలో రాకపోవడం వలన ప్రజలు బాధితులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని దయచేసి తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని అలాగే సంబంధిత శాఖ అధికారులకు వారు సమయపాలనకు వచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని



ములుగు జిల్లా కలెక్టర్ కు బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు బిఆర్ఎస్ నాయకులు ముంజాల బిక్షపతి వినతి

పత్రం అందజేశారు ఉదయం 10 గంటలకు రావాల్సినటువంటి అధికారులు సిబ్బంది 11 దాటిన కూడా రాకపోవడం శోచనీయమన్నారు.. ఈ విషయంపై కలెక్టర్ క్రమశిక్షణ చర్యలు చేపట్టి ఎవరైతే సమయానికి రాని ఉద్యోగులకు మెమోలు జారీ చేయాలని వారు సమయపాలను వచ్చి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు సమయానికి రాకుండా వచ్చిన తర్వాత ప్రజలపై, బాధితులపై కొంతమంది ఉద్యోగులు అసహనాన్ని ప్రదర్శిస్తున్నారని అది ఉద్యోగ ధర్మం కాదని కోగిల మహేష్ తెలిపారు.. సమయానికి వచ్చి ప్రజలకు మరియు బాధితులకు సక్రమంగా సేవలు అందించాలని లేనిపక్షంలో సదరు ఉద్యోగులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం చేస్తామని వారు తెలిపారు....

# పార్కు స్థలంలో బోర్డు పెట్టరా..?

**కబ్జారాయుళ్లకు అధికారుల సహకారమా..?**
**కంచె చేను మేస్తే కాచేదెవరు..?**


**జిన్నారం : మార్చి 9 (పీపుల్స్ న్యూస్):**జిన్నారం మండలం బొల్లారం గ్రామంలోని సర్వే నంబర్లు 242, 243లో ఉన్న ప్రభుత్వ స్థలం ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది. గతంలో ఈ భూమి ప్రభుత్వానికి చెందినదని తెలియజేస్తూ అధికారులు అక్కడ "ఇది ప్రభుత్వ స్థలం" అని బోర్డు ఏర్పాటు చేశారు. అయితే కొంతకాలం తర్వాత ఆ బోర్డు అక్కడి నుంచి మాయమైపోయినా ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.స్థానికుల సమాచారం ప్రకారం ఈ స్థలాన్ని పార్కు కోసం కేటాయించారని చెబుతున్నారు. అయినప్పటికీ ప్రస్తుతం అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడంతో కబ్జాలకు అవకాశం కలుగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన బాధ్యత ఉన్న రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.కొందరు అధికారులు కబ్జా రాయుళ్లతో కుమ్మక్కై పెద్ద మొత్తంలో వాటాలు తీసుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బోర్డు తొలగించబడిన తర్వాత కూడా అధికారులు దానిని తిరిగి ఏర్పాటు చేయకపోవడం, స్థలాన్ని పరిరక్షించే చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో సందేహాలను పెంచుతోంది.ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, వెంటనే అక్కడ బోర్డు ఏర్పాటు చేసి కంచె వేయించి భూమిని రక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి నిజానిజాలు బయటపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు శాఖల మధ్య బాధ్యతల తిప్పలు...

జూబ్లీహిల్స్ పరిధిలోని 242, 243 సర్వే నంబర్లలో ఉన్న భూమిపై వివాదం మరింత ముదురుతోంది. ఇటీవల ఈ భూమికి సంబంధించి రెవెన్యూ అధికారులు తమ బాధ్యతలను తప్పించుకునేందుకు జీహెచ్ఎంసీకి అప్పగిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.అయితే ఆ భూమిని జీహెచ్ఎంసీకి అప్పగించినప్పటికీ, అక్కడ ఇప్పటివరకు జీహెచ్ఎంసీ అధికారులు కనీసం సంబంధిత బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూమి అయితే వెంటనే గుర్తింపు బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అది జరగకపోవడం పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. స్థానికుల అభిప్రాయం ప్రకారం, ఈ వ్యవహారంలో రెవెన్యూ జీహెచ్ఎంసీ శాఖలు బాధ్యతలను ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇదే సమయంలో ఇప్పటికే కొందరికి ముడుపులు అందిన కారణంగానే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో సర్వే నంబర్లు








242, 243లో ఉన్న భూమి అసలు స్థితిగతులు ఏమిటి, ఆ భూమిపై అధికారికంగా ఏ శాఖకు బాధ్యత ఉందనే విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



అలాగే భూమిపై అక్రమాలు జరుగకుండా వెంటనే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# బాలానగర్ పోలీస్ స్టేషన్ లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు..!

**-- బాలానగర్ ఏసీపీ పింగళి నరేష్ రెడ్డి**







**బాలానగర్ మార్చి 9 (పీపుల్స్ న్యూస్)** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని బాలానగర్ పోలీస్ స్టేషన్లలో మహిళా దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మహిళా సాధికారత, భద్రత, సమాజంలో మహిళల పాత్రను గుర్తిస్తూ బాలానగర్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ నర్సింహా రాజు ఆధ్వర్యంలో మహిళా పోలీస్ అధికారులను బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం ఏసీపీ నరేష్ రెడ్డి మాట్లాడుతూ నేరాల నియంత్రణలో మహిళల పోలీసుల కృషిని, తెగింపును, నాయకత్వ లక్షణాలను, సమాజ రక్షణలో వారి నిబద్ధతను సామర్థ్యాన్ని అభినందిస్తూ ప్రశంసలు అందించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ నర్సింహా రాజు మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి రంగంలో మహిళలు ముందుకు రావడం ఆనంద దాయకమని తెలిపారు. మహిళలు ధైర్యంగా, ఆత్మ విశ్వాసం తో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఎస్ఐ సరితా రెడ్డి, సిబ్బంది శ్వేత, స్వాతి, నావనీత, అంజలి, మాధవి, అరుణ, శ్రీదేవి, చంద్రకళ, జీఎంఆర్ మహిళా సిబ్బంది ఆనందంగా పాల్గొని అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

# కూకట్‌పల్లి నల్లచెరువుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్



**హైదరాబాద్, మార్చి 9 :** కూకట్‌పల్లి నల్లచెరువుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిఫోకస్ పెట్టారు. ఈ చెరువును అన్ని రకాల సౌకర్యాలతో సిద్ధం చేశారు. (సోమవారం) సాయంత్రం 7 గంటలకు కూకట్‌పల్లి నల్ల చెరువును సీఎం ప్రారంభించనున్నారు. రూ.10 కోట్లతో నల్లచెరువు సుందరీకరణ పనులు చేపట్టారు. 30 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువు అభివృద్ధి పనులు జరిగాయి. హైడ్రా మొదటి దశలో అభివృద్ధి చేసిన ఆరు చెరువుల్లో ఇది ఒకటి. 2024 సెప్టెంబర్‌లో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన 16 వ్యాపార షెడ్లనూ తొలగించింది. చెరువులో వేసిన నిర్మాణ వ్యర్థాలు, దశాబ్దాలుగా పేరుకుపోయిన పూడికను తొలగించింది. 16 ఎకరాలకు కుంచించుకుపోయిన ఈ చెరువును.. మళ్లీ తిరిగి 30 ఎకరాలకు విస్తరించింది.బోటింగ్ సదుపా.యంనల్లచెరువులో బోటింగ్ సదుపాయాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కల్పించనుంది. హైడ్రా దీనిని అభివృద్ధి చేసిన తర్వాత ఆహ్లాదకరంగా నల్ల చెరువు పరిసరాలు మారాయి. 5 కిలోమీటర్ల దూరం నుంచి కూడా వాకింగ్, విశ్రాంతి కోసం సందర్శకులు తరలి వస్తున్నారు. పిల్లలు ఆడుకునేందుకు కిడ్స్ ప్లే ఏరియా ఏర్పాటు చేసింది. ఓపెన్ జిమ్‌తో పాటు 1.5 కిలోమీటరు మేర వాక్ వే ఏర్పాటు చేసింది. 7 ఇన్‌లెట్ల ద్వారా చెరువులోకి వరద నీరు చేరేలా చర్యలు చేపట్టింది. చెరువు నిండితే నీరు బయటకు వెళ్లేందుకు పాత ఔట్‌లెట్లను అభివృద్ధి చేసింది. మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంది. జీవ వైవిధ్యం కోసం చెరువులో ఐల్యాండ్స్ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

# బీసీ డిక్లరేషన్ హామీలు వెంటనే అమలు చేయాలి

### -- బడ్జెట్‌లో బీసీలకు 2026 - 27 రూ.55 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్



**బాలానగర్ మార్చి 9 (పీపుల్స్ న్యూస్) :**బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి సోమవారం డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో బీసీ హక్కుల సాధన సమితి మరియు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి మండలంలో జిల్లా కలెక్టర్ మరియు కూకట్‌పల్లి మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్వో)లకు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నేతలు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీల అభివృద్ధికి ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అదేవిధంగా వివిధ సామాజిక వర్గాలు,సాంప్రదా య చేతివృత్తులవారికి ఆర్థిక సహాయం అందించివారిజీవనోపాధి ని మెరుగు పరుస్తామని ప్రకటించినట్టు తెలిపారు. ఈమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి మరియు రెండో సంవత్సరాల బడ్జెట్‌లలో బీసీలకు వరుసగా రూ.9,200 కోట్లు మరియు రూ.11,400 కోట్లు మాత్రమే కేటాయించారని, అందులోనూ వాస్తవంగా రూ.6,000 కోట్లకు కూడా తక్కువగా ఖర్చు చేసినట్లు ప్రభుత్వ రికార్డులే వెల్లడిస్తున్నాయని నాయకులు విమర్శించారు. ఈ నేపథ్యంలో గత బడ్జెట్‌లలో చేసిన కేటాయింపులను సవరించి, రాబోయే 2026--27 రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం రూ.55,000 కోట్లను కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అదేవిధంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను నిజాయితీగా అమలు చేసి బీసీలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది.అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీ సమాజానికి ఇచ్చిన హామీల ను పూర్తిగా అమలు చేయాలని, బడ్జెట్‌లో కేటాయించిన నిధులను పారదర్శకంగా మరియు సమర్థంగా ఖర్చు చేయాలని కోరుతూ ఈ మెమోరాండం సమర్పించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. కృష్ణ, కూకట్‌పల్లి మండల అధ్యక్షులు కే. మనోజ్ చారి, మండల కార్యదర్శి కె. గంగయ్య, ఎం. దావీదు, జి. రాములు, జి. ఉమా రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఆ ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి.. కిషన్‌రెడ్డి లేఖ



**ఢిల్లీ, మార్చి 9 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి (సోమవారం) లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టుపై కీలక సూచనలు చేశారు. సెకండ్ ఫేజ్‌లో భాగంగా ఎన్టీపీసీ రామగుండంలో ఏర్పాటు చేయనున్న 3ꠂ800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టుతో తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పం చేసుకోవాలని సూచించారు. పూర్తి 5ꠂ800 మెగావాట్ల ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గును సమీకరిం చుకోవడంలో ఎన్టీపీసీకి తగిన స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు.మూడు ప్రాజెక్టుల కోసం ఎన్టీపీసీ చర్యలు..రామగుండంలో ఎన్టీపీసీ ఏర్పాటు చేయాల్సిన 4,000 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించి మొదటి ఫేజ్‌లో భాగంగా దాదాపు రూ.12,000 కోట్ల వ్యయంతో, అధునాతన అల్ట్రా సూపర్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన 2ꠂ800=1600 మెగావాట్ల రెండు థర్మల్ పవర్ ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023లో ప్రారంభించి జాతికి అంకితం చేసిన విషయం మీకు తెలిసిందేనని అన్నారు. అనంతరం సెకండ్ ఫేజ్‌లో భాగంగా 3ꠂ800=2,400 మెగావాట్ల సామర్థ్యంతో మిగిలిన మూడు పవర్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఎన్టీపీసీ చర్యలు చేపట్టిందని ప్రస్తావించారు. మొదటి ఫేజ్‌లో లాగే రెండవ ఫేజ్‌లో ఉత్పత్తి చేసే విద్యుత్‌లో 85శాతం విద్యుత్‌ను తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే సరఫరా చేయనుందని తెలిపారు. 3 మార్చి, 2026న తెలంగాణ రాష్ట్రంలో మునుపెన్నడూ లేనివిధంగా అత్యధికంగా 18,139 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైందని వివరించారు.థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని పెంచాలి..రానున్న రోజుల్లో ఈ డిమాండ్ మరింతగా పెరగనుందని కిషన్‌రెడ్డి తెలిపారు. తదనుగుణంగా తెలంగాణలో అవసరమైన విద్యుత్ ఉత్పత్తి వనరులను సమకూర్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టినట్లు తెలిసిందన్నారు. అందులో భాగంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఇటీవల విద్యుత్ రంగం మీద ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో 'జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా గ్రిడ్ స్థిరత్వాన్ని పరిరక్షించడానికి రాష్ట్రంలో 5000 నుంచి 6000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని పెంచాలి' అని తెలియజేశారని అన్నారు.లక్ష మెగావాట్ల విద్యుత్ డిమాండ్..అలాగే, 2047 నాటికి రాష్ట్రంలో లక్ష మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంటుందని కూడా ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారని కిషన్‌రెడ్డి అన్నారు. దీనికి అనుగుణంగా రాష్ట్రంలో 2,400 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయం కూడా తీసుకున్నట్లు తెలిసిందన్నారు. అతి తక్కువ ఖర్చుతో, అధునాతన అల్ట్రా సూపర్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానంతో థర్మల్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడంలో ఎన్టీపీసీకి దేశంలోనే విశేషమైన అనుభవం ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ రవాణాశాఖలో కొత్త పోస్టు. రేసులో సీనియర్ అధికారి



**హైదరాబాద్ :** తెలంగాణ రవాణాశాఖలో ప్రస్తుతం చాలా వరకు పోస్టులు ఖాళీగా ఉన్నా యి. రవాణాశాఖ కమిషనర్ తర్వాత జాయింట్ కమిషనర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పరిపాలన విధులు, పర్యవేక్షణ బాధ్య తలు పెరుగుతుండటం అధికారులపై ఒత్తిడి పెంచుతోంది. దానికి తోడు రోడ్డు ప్రమాదాలు తగ్గించాలంటూ సుప్రీం కోర్టు కమిటీ నివేదించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారిం చింది. ఈ మేరకు కొత్త పోస్టు ఏర్పాటు చేయాలని డిసైడ్ అయింది. కమిషనర్, జేటీసీల మధ్యలో అదనపు రవాణా కమిషనర్ పోస్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి రవాణాశాఖ ప్రతిపాదించింది. అందుకు సంబం ధించిన ఫైల్ ప్రస్తుతం న్యాయశాఖ పరిశీలనలో ఉంది. సర్వీసు రూల్స్‌లో సవరణ చేసిన తర్వాత అదనపు కమిషనర్ పోస్టు ఏర్పాటు కానున్నట్లు సమాచారం.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక ఇప్పటి వరకు రవా ణాశాఖలో అదనపు కమిషనర్ పోస్టు ఏర్పాటుపై సర్కార్ దృష్టి సారి ంచలేదు. పోస్టు ఆమోదం పొందితే సర్వీసు పరంగా సీనియర్ అధికారిగా ఉన్న హైదరాబాద్ జేటీసీ రమేష్‌కు అదనపు కమిషనర్ పోస్టు దక్కే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇవే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఏడు రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ఆర్టీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ సెక్రటరీ 1, మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్లు 13, అసిస్టెంట్ మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్లు 8, సీనియర్ అసిస్టెంట్లు 11, జూనియర్ అసిస్టెంట్లు 4, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయని రవాణాశాఖ ప్రభుత్వానికి వివరించింది. త్వరలోనే ఈ పోస్టులు కూడా భర్తీ చేయనన్నట్లు తెలిసింది.హైదరాబాద్ నగరంలో రోడ్డు యాక్సిడెంట్లు అరికట్టేందుకు, ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు నగర ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈనెల 1 నుంచి 7 వరకు నగర వ్యాప్తంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. తనిఖీల్లో భారీగా వాహనదారులు పట్టుబడ్డారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి మొత్తం 1940 కేసులు నమోదు చేశారు. మైనర్లకు, లైసెన్స్ లేని వ్యక్తులకు వాహనాలను ఇవ్వవద్దని ఈ సందర్భంగా పోలీసులు వాహన యజమానులకు విజ్ఞప్తి చేశారు.

# రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నిక: రిటర్నింగ్ అధికారి



**హైదరాబాద్, మార్చి 09:** తెలంగాణ నుంచి నామినేషన్ దాఖలు చేసిన ఇద్దరు అభ్యర్థులు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున వేం నరేంద్ర రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు రాజ్యసభకు ఎన్నికైనట్లు ఆయన వివరించారు. అందుకు సంబంధించిన పత్రాలను కాసేపట్లో వీరికి అందజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ పత్రాలను అందుకోవడానికి అభిషేక్ మను సింఘ్వీ తరఫున అడ్వకేట్ సుందర్ చౌహాన్ తెలంగాణ అసెంబ్లీలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. అలాగే వేం నరేందర్ రెడ్డి అసెంబ్లీ కార్యాలయానికి రానున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొనున్నారు.రాజ్యసభలో పలువురి సభ్యుల పదవి కాలం ఏప్రిల్‌లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. గురువారంతో నామినేషన్ల ప్రకియ ముగిసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ తరఫున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన రాజ్యసభ ఎన్నికల కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఇక.. సాయి అనే వ్యక్తి సైతం ఈ రాజ్యసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో.. శుక్రవారం ఆ నామినేషన్‌ను తిరస్కరించారు. అలాగే ఇతరులు ఎవ్వరూ నామినేషన్ల దాఖలు చేయలేదు. దీంతో కాంగ్రెస్ నుంచి నామినేషన్ల దాఖలు చేసిన అభిషేక్, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైంది.

# కల్తీ నూనెలు, గోధుమ పిండి తయారీ తండ్రీకొడుకుల అరెస్

**హైదరాబాద్, మార్చి 9:** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో కల్తీ నూనెలు, గోధుమ పిండి తయారీ ముఠా గుట్టు రట్టైంది. కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్న ముఠాను మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు. మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు నిర్వహించిన దాడుల్లో తండ్రీ, కొడుకులను అరెస్టు చేశారు. వట్టినగులపల్లి ఇందిరమ్మ కాలనీలోని శ్రీ జస్నాత్ ట్రేడర్స్ దుకాణంపై ఎస్వోటీ పోలీసులు (సోమవారం) దాడి చేశారు.గడువు ముగిసిన వివిధ కంపెనీల వంట నూనెలను సేకరించి, సోయాబీన్ నూనెతో కలిపి కల్తీ వంట నూనెను నిందితులు తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అలా తయారైన నూనెను వివిధ ప్రసిద్ధ బ్రాండ్ల పేర్లతో ప్యాక్ చేసి మార్కెట్‌లో అమ్ముతున్నట్లు దాడుల్లో బయటపడింది. అదే విధంగా గడువు తీరిన గోధుమ పిండిని వివిధ ప్రాంతాల నుంచి సేకరించి... 'జస్నాత్ గోల్డ్ చక్కి అట్టా' పేరుతో తిరిగి ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రైడ్‌లో సుమారు 10 లక్షల రూపాయల విలువైన 5,026 లీటర్ల కల్తీ వంట నూనె, 3 లక్షల రూపాయల విలువైన 5,192 కిలోల గోధుమ పిండిని స్వాధీనం చేసుకున్నారు.వెయిటింగ్ మెషిన్, ఆయిల్ ఫిల్టర్ మెషిన్, గోధుమ ఫిల్టర్ మెషిన్‌తో పాటు ఇతర సామాగ్రిని కూడా సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న మొత్తం వస్తువుల విలువ సుమారు 21 లక్షల రూపాయలుగా అంచనా వేశారు. ఈ కేసులో రాజస్థాన్‌కు చెందిన భన్వర్ రామ్ జాట్ (46), అతని కుమారుడు అశోక్ కుమార్‌లను అరెస్టు చేశారు. నిందితులను గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజాప్రతినిధి కక్షసాధింపు చర్యలకు జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారులు వంతపాడటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు

### మహిళా అధికారుల సమక్షంలోనే మహిళా నాయకురాళ్ల అరెస్టులు సిగ్గుచేటు!





**శేరిలింగంపల్లి, మార్చి 9 (పీపుల్స్ న్యూస్) :** ప్రజాప్రతినిధి కక్షసాధింపు చర్యలకు జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారులు వంతపాడటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని బీఆర్ ఎస్ నేత బొబ్బ నవత రెడ్డి అన్నారు. సోమవారం జరిగిన పరిణామాలపై ఆమె పత్రిక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ




బీఆర్‌ఎస్ గుర్తుపై గెలిచి, నైతికంగా దిగజారి పార్టీ ఫిరాయించిన ప్రజాప్రతినిధి అరాచకాలు శృతి మించుతున్నాయని మండి పడ్డారు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బీఆర్‌ఎస్ శ్రేణులు ఏర్పాటు చేసిన శుభాకాంక్షల ఫ్లెక్సీలను రాజకీయ కక్షతో తొలగించడం దారుణం అన్నారు. కనీసం మహిళా దినోత్సవం ముగిసేవరకైనా ఉంచాలని ప్రాధేయపడినా వినకుండా,అధికార పార్టీ కనుసన్నల్లో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. నియోజకవర్గంలో పేరుకుపోయిన ప్రజా సమస్యల పరిష్కారంపై లేని శ్రద్ధ, ఫ్లెక్సీలు పీకించడం మీద ఉండటం అధికారుల అహంకారానికి నిదర్శనం.

ప్రజావాణి రోజునే ప్రజాస్వామ్య ఖూనీ


సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ గోడు చెప్పుకోవడానికి వస్తే, అధికారులు వారికి అందుబాటులో ఉండాల్సింది పోయి.. అధికార పార్టీ కి భజన చేస్తూ గంటల తరబడి సమీక్షల పేరుతో కాలక్షేపం చేస్తున్నారన్నారు. ఈ అన్యాయంపై వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన మమ్మల్ని కనీసం లోపలికి రానివ్వకుండా పోలీసులను ఉసిగొల్పి దౌర్జన్యంగా అరెస్టు చేయించడం సిగ్గుచేటన్నారు.

మహిళా అధికారుల మౌనం – ఆత్మవంచన

జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ శశిరేఖ గారు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన గారు ఇద్దరూ బాధ్యతాయుతమైన మహిళా అధికారులే. తమ కళ్లముందే తోటి మహిళా నాయకురాళ్లపై పోలీసులు తోపులాటలకు దిగుతుంటే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వారి నైతికతకే వదిలేస్తున్నామన్నారు. అధికార పార్టీకి కొమ్ముకాస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కడం అధికారులకు శ్రేయస్కరం కాదన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన ఎమ్మెల్యే గాంధీకి, ఆయన అడుగులకు మడుగులొత్తుతున్న అధికారులకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. అక్రమ అరెస్టులతో మా పోరాటాన్ని ఆపలేరని బొబ్బ నవతారెడ్డి స్పష్టం చేశారు.ఈ ధర్నా కార్యక్రమశీ లో బొబ్బ నవత రెడ్డి తో పాటు కలిడింది రోజా, రాయల కార్తీక్,పొట్ట నరేందర్ యాదవ్,పర్నంది శ్రీకాంత్, పర్నంది శ్రీకాంత్,సంగా రెడ్డి,సంతోష్ రెడ్డి,తదితరులను వారు పోలీస్ లు అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌస్,ప్రకాశ్, ప్రమోద్,మల్లరెడ్డి,అల్లావుద్దీన్,రాజు BRSV,మజీద్,చందర్ రావు, అనంత రెడ్డి,గణేష్ రెడ్డి,జనార్దన్ గౌడ్, నగేష్ రెడ్డి, చందు,రాజశేఖర్, జెస్వంత్ ,గౌతమ్, జీతయ్య, శభనా, సునీత, మొదలగు మహిళలు,కార్యకర్తలు 200 మంది పాల్గొన్నారు.

# రైతు భూమిని కాజేస్తారా బుగ్గనపై సీఎం చంద్రబాబు ధ్వజం

**నంద్యాల, మార్చి 9 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు (సోమవారం) డోన్ నియోజకవర్గంలోని కొత్తబురుజులో పర్యటించారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హార్టికల్చర్ పంటల ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించారు. ఈ క్రమంలో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తన భూమిని ఆక్రమించారని సీఎం చంద్రబాబుకు ఓ రైతు ఫిర్యాదు చేశారు. విచారించి సమస్య పరిష్కారించాలని ఆర్డీవోను సీఎం ఆదేశించారు. భూ ఆక్రమణ వాస్తవమని తేలితే ఆక్రమణ దారులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఓ రైతు భూమిని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తన అనుచరుల పేరుతో చేయించడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. ఏపీలో మొత్తం 3.40 లక్షల ఎకరాలు ఉందని ప్రస్తావించారు.అందులో 1.95లక్షల ఎకరాలు 22ఏ కింద పెట్టారని తెలిపారు. జగన్ హయాంలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ కింద లక్షల ఎకరాలు అధికారులు ప్రమేయం లేకుండానే భూములను ఇష్టారాజ్యంగా తారుమారు చేశారని ఆరోపించారు. ఎన్నికల ముందు పాన్యంలో పాస్ బుక్‌ను చించేసి ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేస్తానని హామీ ఇచ్చానని గుర్తుచేశారు. తాము అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశానని తెలిపారు. గతంలో తాను రెవెన్యూ మంత్రిగా పని చేశానని.. రెవెన్యూ సమస్యలు, చట్టాలపై పూర్తిగా అవగాహన ఉందని



స్పష్టం చేశారు. భూములు ట్యాంపరింగ్ జరుగకుండా డిజిటల్ పాస్ బుక్‌లు ఇస్తున్నామని వెల్లడించారు. పట్టాదారు పాస్ పుస్తకాల ప్రింటింగ్‌కు అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. నూటికి నూరు శాతం డిసెంబర్ నాటికి భూ సమస్యల పరిష్కారిస్తామని మాటిచ్చారు. అనుభవంలో ఉన్న రైతులకు నెలలోపు పట్టాదారు పాస్ పుస్తకాలను ఇస్తామని చెప్పుకొచ్చారు. ఎవ్వరికీ డబ్బులు ఇవ్వకుండా అరగంటలో రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.రేషన్ పింఛన్ కోసం కుటుంబాలు విడిపోతున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో ఎక్కువ మంది ఉన్న కుటుంబానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆలోచిస్తున్నామని అన్నారు. పిల్లలు బాధ్యత భార్య భర్తలదేనని చెప్పుకొచ్చారు. ఆడవారితో పాటు మగవారికి రెండు నెలలు సెలవులు ఇస్తానని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ 50 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. నంద్యాల జిల్లాలో ఆర్ అండ్ బీ రోడ్లన్నీ గుంతలు లేకుండా చేశామన్నారు. పంచాయతీ రోడ్లపై పవన్ కల్యాణ్‌తో చర్చించానని తెలిపారు. ఓర్వకల్లు పారిశ్రామికవాడలో డ్రోన్ సిటీతో పాటు అనేక పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.పరిశ్రమల ద్వారా భారీగా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఐదేళ్లు కరెంట్ చార్జీలు పెంచనని స్పష్టం చేశారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నామని తెలిపారు. చదువు రాని వాళ్ల కోసం రానున్న రోజుల్లో మాట్లాడే మాటలను టెక్ట్స్‌గా కన్వర్ట్ చేసి సొల్యూషన్ చూపిస్తామని చెప్పుకొచ్చారు. గుజరాత్‌లో చాలా ఏళ్ల నుంచి ఒకే ప్రభుత్వం కొనసాగుతోందని.. ఇక్కడ కూడా అలాగే ఉండాలని అన్నారు. కొత్త వ్యక్తుల మాటలు నమ్మితే మళ్లీ మోసపోతారని అన్నారు. నాడు జన్మభూమి తెచ్చానని.. నేడు వీదీఖ 1020 తీసుకొచ్చానని తెలిపారు. ధనవంతులు ౹ా4 కింద పేదలను దత్తత తీసుకొని ఆర్థికంగా ఆదుకోవాలని పిలుపునిచ్చారు.కొత్త బురుజుకు సీఎం వరాల జల్లుకొత్త బురుజు గ్రామానికి సీఎం చంద్రబాబు వరాల జల్లు కురిపించారు. జేజేవైఎమ్ కింద కొత్త బురుజు గ్రామంలో ప్రతి ఇంటికి కొల్లాయిల ద్వారా మంచి నీరు అందిస్తామని తెలిపారు. కొత్త బురుజులో 50 మందికి ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చారు. డోన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా మారుస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు

# జగన్ హయాంలో కల్తీ పాలపై ఎలాంటి చర్యల్లేవ్ షర్మిల ధ్వజం



**రాజమండ్రి, మార్చి 9 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ పాల ఘటనపై ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ కల్తీ పాల బాధితులను ఎందుకు పరామర్శించలేదని నిలదీశారు. జగన్ కేవలం బల ప్రదర్శనలు మాత్రమే చేస్తారని.. తన సైతాన్ సైన్యం కోసమే యాత్రలు చేస్తారని ఎద్దేవా చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కల్తీ పాలపై ఎలాంటి చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. ఆయనకు పేదల కష్టాలు అవసరం లేదని అన్నారు. (సోమవారం) రాజమండ్రిలో కల్తీ పాల ఘటన బాధితులను షర్మిల పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.రూ.25 లక్షలు ఆర్థిక సహా యం ఇవ్వాలి.కల్తీ పాల ఘటనలో మృతులకు ఒక్కొక్కరికీ ఏపీ ప్రభుత్వం రూ.25 లక్షలు ఆర్థిక సహాయం ఇవ్వాలని షర్మిల డిమాండ్ చేశారు. ఈ ఘటనలో 11 మంది మృతి చెందారని తెలి పారు. లైసెన్స్ లేకుండా సదరు వ్యాపారి పాలు పోస్తున్నారన్నారు. 11 సంవత్సరాలుగా ఇలాంటి పాలను ప్రజలకు పోస్తున్న ప్రభుత్వాలు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. తూర్పు గోదావరి జిల్లాలో కేవలం ఒకే ఒక ఫుడ్ ఇన్స్పెక్టర్ ఉన్నారని.. సదరు అధికారి కూడా ఇక్కడ ఉండరని చెప్పుకొచ్చారు. ప్రజలకు ప్రభుత్వాలు ధైర్యం కల్పించాలని అన్నారు. కల్తీ పాల ఘటన బాధితులను ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఎందుకు పరామర్శించలేదని షర్మిల ప్రశ్నించారు.

## ఏపీ లిక్కర్ స్కామ్ ఆ ముగ్గురికి ఈడీ నోటీసులు



**అమరావతి, మార్చి 9:** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దూకుడు పెంచింది. మద్యం కుంభకోణంలో నిందితులుగా ఉన్న ధనుంజయరెడ్డి, వెంకటేష్ నాయుడు, చాణక్యలకు ఈడీ నోటీసులు జారీ చేసింది. బ్యాంక్ స్టేట్‌మెంట్లు, పాన్ కార్డులు, కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలతో పాటు సంబంధిత డాక్యుమెంట్లను తీసుకురావాలని నోటీసుల్లో స్పష్టంగా పేర్కొంది. (సోమవారం) విచారణకు హాజరుకావాలని ఈడీ ఆదేశించింది.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ మద్యం స్కామ్‌లో వేల కోట్ల రూపాయల కమీషన్లు, మనీలాండరింగ్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలే రూ.441 కోట్లకు పైగా ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సీఐడీ సిట్ ఇచ్చిన రిపోర్టుల ఆధారంగా కీలక నిందితులకు సంబంధించిన ఆస్తులను భారీ ఎత్తున జప్తు చేసింది. ప్రధాన నిందితులుగా ఉన్న రాజ్ కసిరెడ్డి, చాణక్య, వాసుదేవరెడ్డికి చెందిన రూ.441 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

## ఏపీలో సరికొత్త ఆలోచన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏఐ సేవలు, 18చోట్ల పరీక్షలు



**విశాఖపట్నం:** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏఐ సేవల్ని అందుబాటులోకి తీసుకురావాని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో 18 స్టార్టప్ సంస్థలతో కలిసి వైద్య పరీక్షలు, ఇతర సేవల్ని ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏఐ సేవలతో అతి తక్కువ సమయంలో వ్యాధి నిర్ధారణ, రోగులకు చికిత్స అందించే సమయం కూడా ఆదా అవుతుందంటున్నారు. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రులు.. పార్వతీపురం, రాజానగరం, సిద్ధార్థ మెడికల్ కాలేజీ, సత్తెనపల్లి ప్రాంతీయ ఆసుపత్రి, తెనాలిలోని జిల్లా ఆస్పత్రి, ఇతర చోట్ల పైలట్ ప్రాజెక్టు విధానంలో ఈ సేవల్ని ప్రారంభించారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ ద్వారా వీటి ఫలితాలను విశ్లేషించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదక ఇస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు.వ్యాధుల్ని ప్రాథమిక పరీక్షలతో గుర్తించి.. తక్కువ సమయంలో మెరుగైన వైద్యసేవలు అందించొచ్చు. డాక్టర్లు, పేషెంట్ల మధ్య సంభాషణ రికార్డు చేస్తారు ఏఐ అప్లికేషన్ల సాయంతో పరీక్షలు చేసి ప్రాథమిక దశలోనే సమస్యల్ని గుర్తిస్తున్నారు. ఆయా ఆస్పత్రుల్లో క్యాన్సర్ గుర్తింపు, క్షయను గుర్తించడానికి, షుగర్, కిడ్నీ, థైరాయిడ్, రక్తపరీక్షలు కూడా ఏఐ ఆధారిత పరికరాలతో చేస్తున్నారు. గుండె సమస్యలు, ఐసీయూలో ఉన్నవారికి బీపీ, పల్స్, టెంపరేచర్, ఆరోగ్య పరిస్థితి పర్యవేక్షణ లాంటి మరికొన్ని చోట్లో అందుబాటులో ఉన్నాయి. ఏఐ సాయంతో ఏపీ ప్రభుత్వం వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు మంత్రి సత్యకుమార్. రాష్ట్రంలో ఎంపి క చేసిన 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒకేసారి 40 పరికరాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు.విశాఖపట్నంలో 'పింక్ సఖి శారీ వాక్' నిర్వహించారు.. క్యాన్సర్‌పై అవగాహన కలిగించడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ వాక్‌ను రాహుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు బీచ్ రోడ్డులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ వాక్‌కు సినీ నటి, లైఫ్ ఎగైన్ సంస్థ వ్యవస్థాపకురాలు గౌతమి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఈ అవగాహన ర్యాలీలో నగరానికి చెందిన మహిళలు భారీగా పాల్గొన్నారు.

# లడ్డూ కల్తీపై తప్పుడు ప్రచారం రెచ్చగొడితే కఠిన చర్యలు తప్పవు

**నంద్యాల, మార్చి 9:** శ్రీవారికి అపచారం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని, మతవిద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. సోమవారం డోన్ నియోజకవర్గంలోని కొత్తబురుజు గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటించారు. రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పాస్‌పుస్తకాలు, సర్వే రాళ్లపై జగన్ ఫొటోలు ఉండటం ఏంటి అని ప్రశ్నించారు. ఇదేంటని అడిగితే బాధితులపైనే కేసులు పెట్టారని విమర్శించారు.తప్పు జరగకుండా చూస్తాం..వైసీపీ హయాంలో జరిగిన తప్పులను సరిచేస్తున్నామని చెప్పారు. రికార్డులు తారుమారు చేయకుండా పకడ్బంధీగా పాస్‌పుస్తకాలు ఇస్తున్నామని, క్యూఆర్ కోడ్‌తో పాస్ ఓపుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎవరు తప్పు చేసినా వెంటనే తెలుస్తుందన్నారు. ఒక్కపైసా కూడా అవినీతి లేకుండా పట్టా ఇప్పించే బాధ్యత తమదని స్పష్టం చేశారు. సమస్యలన్నీ పరిష్కరించాకే కొత్త పాక్ బుక్స్ ఇస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎక్కడా తప్పులు జరగకుండా చూస్తామని సీఎం అన్నారు.శ్రీవారి ప్రసాదాన్ని వదల్లేదు.గత ఐదేళ్లు దుర్మార్గ పాలన సాగిందని సీఎం విమర్శించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీవారి ప్రసాదాన్ని కూడా కల్తీ చేశారని సీఎం ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. సీబీఐ రిపోర్ట్ ఇచ్చినా లడ్డూ కల్తీపై తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తిరుమలపై దృష్టి పెట్టానని సీఎం తెలిపారు.ఇదే నా సంకల్పం.కల్తీ మద్యంతో చాలా మంది చనిపోయేలా చేశారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. హంద్రీనీవాతో తాగునీరు, కుప్పానికి కూడా నీళ్లు ఇచ్చామని చెప్పారు. రాయలసీమలో ప్రతి ఎకరానికి నీళ్లు ఇవ్వాలనేది తన సంకల్పమని పేర్కొన్నారు. మాజీ మంత్రి వివేకాను దారుణంగా చంపారని.. నాన్న లేరు చిన్నాన్న కూడా లేరంటూ డ్రామాలు ఆడారని సీఎం విమర్శించారు. నారాసుర రక్తచరిత్ర అంటూ తన చేతిలో కత్తి పెట్టారని ఆరోపించారు. జగన్ మాటలు నమ్మి 2019లో తనకు




ఓటు వేయలేదని చెప్పారు. తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఎదురుదాడి చేస్తున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు.రైతే రాజు కావాలి.డబ్బు మీద ఆశతో ఒక్కరి కంటే ఎక్కువ మందిని కనడం లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పుడు ఇద్దరి కంటే ఎక్కువ మందిని కనాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. పెద్ద కుటుంబానికి ఎక్కువ సహాయం చేసేలా పథకాలు తీసుకొస్తామన్నారు. రైతే రాజు కావాలని.. రైతు అప్పులపాలు కావడానికి వీల్లేదన్నారు. దీపం పథకం ద్వారా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. గత పాలనకు ఈ పాలనకు తేడా ఏంటో ప్రజలే గమనించాలన్నారు. ఇప్పుడు రాష్ట్రానికి పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్కొన్నారు.కాగా.. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హార్టికల్చర్ పంటల ఉత్పత్తుల స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఫ్రూట్ కవర్ల వాడకం వల్ల పండ్లకు మంచి ధర లభిస్తుందని హార్టికల్చర్ అధికారులు తెలిపారు. దీనిపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని సీఎం అధికారులకు ఆదేశించారు. కవర్ తొడిగిన పండ్ల నాణ్యతను, కవర్ లేని పండ్ల నాణ్యతను సీఎం స్వయంగా పరిశీలించారు. జిల్లాలో మంచి రేట్లు రావడానికి వివిధ వెరైటీల పంటలను ప్రోత్సహించాలని సూచించారు. భూగర్భ జలాల స్థాయిలు పెరిగేలా నీటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు కన్నుమూత..

**అమరావతి :** కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కావూరి సాం బశివరావు .. హైదరాబాద్?లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రోజు తుదిశ్వాస విడిచారు. కావూరి సాంబశివరావు ఆరోగ్య పరిస్థితి విషమించటంతో.. ఆయనకు వెంటిలేటర్ మీద చికిత్స అందించారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. కావూరు సాంబశివరావు 1943 అక్టోబర్ రెండో తేదీన జన్మించారు. రాజకీయ నాయకుడిగానే కాకుండా వ్యాపా రవేత్తగానూ పేరు కేంద్ర జౌళిశాఖ మంత్రిగా కావూరి పనిచేశారు. 1984,1989, 1998 ఎన్నికల్లో మచిలీపట్నం లోక్‌సభ నియె ాజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు కావూరి. ఆ తర్వాత 2004, 2009 ఎన్నికల్లో ఏలూరు లోక్ సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంలో జౌళిశాఖ మంత్రిగా పనిచేశారు.అయితే 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కావూరి రాజకీయ ప్రస్థానం మారిపోయింది. సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన



ఆయన.. 2014 తర్వాత బీజేపీ పార్టీలో చేరారు. ఆ తర్వాత క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యారు. కావూరి సాంబశివరావుకు ఒక కొడుకు, ముగ్గ్గురు కుమార్తెలు ఉన్నారు. సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చిన్నల్లుడు భరత్.. కావూరి సాంబశివరావు కుమార్తె తనయుడే. ఆ రకంగా కావూరి సాంబశివరావు కుటుంబానికి, నందమూరి, నారా కుటుంబాలకు మధ్య బంధుత్వం ఉంది. మంత్రి నారా లోకేష్ ఆదివారం కావూరి సాంబశివరావును ఆస్పత్రిలో పరామర్శించారు.కావూరి మరణంపై ప్రముఖుల దిగ్భ్రాంతి..మాజీ మంత్రి కావూరి సాంబశివరావు మరణంపై తెలుగు రాజకీయ ప్రముఖులు స్పందిస్తున్నారు. ఆయన మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని.. కావూరి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు.కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకులు కావూరి సాంబశివరావు గారి మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఐదు సార్లు ఎంపీగా మచిలీపట్నం, ఏలూరు నియోజకవర్గాల ప్రజలకు విశేష సేవలు అందించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను." అంటూ ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఎక్స్ వేదికగా నివాళులు అర్పించారు.

# ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో మరో కీలక పరిణామం




**అమరావతి, మార్చి 9 :** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుపై జగన్ హయాంలో ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసును సీబీఐకు బదలాయించాలని మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో (సోమవారం) విచారణ జరిగింది.ఈ కేసుని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం విచారణ చేసే అధికారం లేదంటూ.. ఎమ్మెల్యే ఎంపీ ప్రజాప్రతినిధుల కోర్టుకు ఈ కేసును బదిలీ చేయాలంటూ వేసిన మరో పిటిషన్‌పై కూడా విచారణ జరిగింది. ఈ రెండు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఆళ్ల రామకృష్ణారెడ్డి తరఫున న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు.సీఎం చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్ గీ హాజరయ్యారు. ఈ కేసు విచారణలో తమకు ప్రాథమిక అభ్యంతరాలు ఉన్నాయని విచారణ అర్హత మీద వాదనలు వినాలని న్యాయమూర్తిని సీనియర్ న్యాయవాది కోరారు. తమ వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని న్యాయస్థానాన్ని ముకుల్ రోహిత్ కోరారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్ అభ్యర్థన మేరకు 16వ తేదీన వాదనలు వింటామని హైకోర్టు ప్రకటించింది. ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన అన్ని కేసులను16వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు విచారిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది.

# మహిళల గురించి జగన్ మాట్లాడడం హాస్యాస్పదం

**పెనుకొండ, మార్చి 09:** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మరోసారి నిప్పులు చెరిగారు. సోమవారం శ్రీ సత్యసాయి జిల్లాలోని పెనుకొండలో మంత్రి సవిత విలేకర్లతో మాట్లాడుతూ.. వైఎస్ జగన్ మహిళల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిండు అసెంబ్లీలో తల్లి లాంటి నారా భువనేశ్వరిని అవమానించారంటూ మండిపడ్డారు. సొంత తల్లి, చెల్లికి, చిన్నాన్న కుమార్తెకు న్యాయం చేయని వ్యక్తి వైఎస్ జగన్ అని అభివర్ణించారు. ఇంట్లో వారిని బజారు పాలు చేశారంటూ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి, పులివెందులలో మహిళలపై జరిగిన అత్యాచారాలు, దారుణాలు అంతా చూశారన్నారు. మహిళా ద్రోహి సీఎం చంద్రబాబు అంటూ జగన్ మాట్లాడడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రశ్నిస్తే మహిళలపై కూడా కేసులు పెట్టారంటూ సీఎంగా జగన్ వ్యవహరించిన తీరును ఈ సందర్భంగా మంత్రి సవిత తూర్పారబట్టారు. హిందువులు, మహిళలు, బీసీల అభివృద్ధి అంటే సరిపోదంటూ జగన్‌కు చురకలంటించారు. మీ హయాంలో జరిగిన అరాచకాలపై నివేదిక తయారు చేసి గవర్నర్‌కు ఇప్పటికే




అందజేశామన్నారు.రాయలసీమ సాగునీటి గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదని కుండ బద్దలు కొట్టారు. వారు రాయలసీమ ద్రోహులున్నారు. ఏ రోజు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డైవర్షన్ పాలిటిక్స్ కోసం వైసీపీ నాయకులు సభలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. అయితే ప్రజలు, మహిళలు చాలా క్లారిటీగా ఉన్నారు. మహిళా సాధికారత గురించి ఆలోచించింది పూలే ఆ తర్వాత డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ అని మంత్రి సవిత తెలిపారు.ఇప్పుడు ఎన్టీఆర్ తర్వాత చంద్రబాబు మాత్రమే మహిళా సాధికారత కోసం పని చేస్తున్నారని స్పష్టం చేశారు. మహిళలకు అన్ని అంశాల్లో ప్రాధాన్యత కల్పించింది సీఎం చంద్రబాబేనని పేర్కొన్నారు. ప్రతి ఇంటా మహిళా ఎంటర్ ప్రెన్యూర్ రావాలన్నదే చంద్రబాబు లక్ష్యమని స్పష్టం చేశారు.

# నెయ్యి ట్యాంకర్ బోల్తా.. బిందెలతో ఎగబడ్డ జనం



**అమరావతి :** ఫ్రీగా వస్తే ఫినాయిల్‌నైనా ఎగబడి తీసుకునే జనం నెయ్యి కోసం నానా తంటలు పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. కడప జిల్లా కొండాపురం మండలం అనంతపురం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం ప్రమాదవశాత్తు నెయ్యి ట్యాంకర్ బోల్తా పడింది. ట్యాంకర్‌లో ఉన్న నెయ్యి నేలమట్టం అవుతుందని తెలుసుకున్న స్థానికులు ఇంట్లో ఉన్న బిందెలు, బకెట్లు, గిన్నెలు, ప్లాస్టిక్ జగ్గులు,చిన్న వస్తువులతో చేరుకున్నారు. ట్యాంకర్ నుంచి కారిపోతున్న నెయ్యి కోసం ఎగబడ్డారు.

# భవిష్యత్తులో సాయుధ దళాల్లో నారీమణుల సంఖ్య భారీగా పెరుగుతుంది : కేంద్రం

భారత సాయుధ దళాల్లో మహిళా అధికారుల సంఖ్యపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన విడుదల చేసింది. 2014 నాటికి దేశ సాయుధ దళాల్లో 3,000 మందే మహిళా ఆఫీసర్లు ఉండగా, ఇప్పుడీ సంఖ్య 11వేలు దాటిందని వెల్లడించింది. కేవలం సంఖ్యాపరంగానే కాకుండా, సంస్థాగతంగానూ మహిళలకు సాయుధ దళాల్లో ప్రాధాన్యత పెరిగిందని తెలిపింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల వేళ ఈ గణాంకాలతో ఒక ఫ్యాక్ట్ షీట్‌ను కేంద్ర ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) విడుదల చేసింది. ఆర్మీ, నేవీ, వాయుసేనలలో మహిళలు అందిస్తున్న సేవలతో ముడిపడిన సమాచారాన్ని తెలియజేసింది. ప్రస్తుతం జరుగుతున్న సంస్కరణల ఊతంతో భవిష్యత్తులో భారత సాయుధ దళాల్లో మహిళామణుల సంఖ్య భారీ స్థాయికి పెరుగుతుందని పేర్కొంది. నారీశక్తికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, లింగ సమానత్వ సాధనకు చేస్తున్న సంస్థాగత సంస్కరణలు ఈ దిశగా బాటలు వేస్తాయని తెలిపింది. పీఐబీ ఫ్యాక్ట్ షీట్‌లోని కీలక అంశాలివీనేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లోకి మహిళల ప్రవేశాలు గణనీయంగా పెరిగాయి. 2025 మేలో 17 మంది మహిళా కేడెట్లు, 2025 నవంబరులో 15 మంది మహిళా కేడెట్లు ఎన్‌డీఏ నుంచి పాసౌట్ అయ్యారు. భారత సాయుధ దళాల్లో సీనియర్ లీడర్‌షిప్, ఆపరేషనల్ కమాండ్ హోదాల్లో ఇప్పుడు మహిళా ఆఫీసర్లు ఉన్నారు. లెఫ్టినెంట్ జనరల్ ర్యాంక్, ఫైటర్ పైలట్లు, కీలక యూనిట్ల కమాండర్లు వంటి బాధ్యతలను మహిళలు నిర్వర్తిస్తున్నారు. సాయుధ దళాల్లో మహిళలకు అవకాశాలు పెరుగుతుండటంతో భారత రక్షణ విభాగం ప్రొఫెషనలిజానికి, అంకితభావానికి మారుపేరుగా నిలుస్తోంది. గత దశాబ్ద కాలంలో భారత సాయుధ దళాల మధ్య సమన్వయం బాగా పెరిగింది.



వాటిలో సంస్థాగత మార్పులు పెద్దఎత్తున జరిగాయి. గతంలో సాయుధ దళాల్లోని మెడికల్, నర్సింగ్ విభాగాల్లోనే మహిళలకు జాబ్స్ ఇచ్చేవారు. కేంద్ర ప్రభుత్వం విధానపరమైన మార్పులు చేయడంతో, వనితలు ఇప్పుడు సైనిక ఆఫీసర్లు కూడా అవుతున్నారు. మహిళలకు ప్రోత్సాహం, ప్రాధాన్యత, లింగ సమానత్వ సాధన, ఉద్యోగ అవకాశాల కల్పన వంటి వాటిపై కేంద్ర సర్కారు ఫోకస్ పెట్టింది. ఇందువల్లే ఈ మార్పు సాధ్యమైంది. భారత త్రివిధ దళాల్లోని కమాండింగ్ హోదాల్లో వ్యూహాత్మక వ్యవహారాలు, నిర్ణయాలను తీసుకునే బాధ్యతలను మహిళా ఆఫీసర్లు నిర్వర్తిస్తున్నారు. దీనివల్ల భారత రక్షణ దళాల సామర్థ్యాలు ఇనుమడించాయి. 1958లో తొలిసారిగా భారత ఆర్మీ మెడికల్ కార్ప్స్‌లో పురుషులతో సమానంగా మహిళలనూ భర్తీ చేసుకునే నిబంధనలను అమల్లోకి తెచ్చారు. 1992 నుంచి భారత సాయుధ దళాల్లో ఆఫీసర్ స్థాయుల్లో మహిళలకు ఉద్యోగాలు ఇవ్వడాన్ని మొదలుపెట్టారు. వుమెన్ స్పెషల్ ఎంట్రీ స్కీం అప్పటి నుంచే అమలవుతోంది. అయితే మహిళలను నాన్ – కంబాట్ విభాగాల్లో నియమించేవారు. కారుణ్య నియామకాల్లో భాగంగా ఈ స్కీం ద్వారా ఆర్మీలో చేరే అవకాశాన్ని, అమరులైన సైనికుల భార్యలకూ కల్పించారు. 1992లోనే తొలిసారిగా మహిళా ఆఫీసర్లను భారత నేవీ నియమించుకుంది. వాయుసేన సైతం షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా ఫ్లయింగ్, టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాల్లో మహిళలకు అవకాశాలు ఇవ్వడం ఆరంభించింది. 1992లో చేసిన ఈ సంస్కరణలు భారతదేశ రక్షణ విధానంలో విప్లవాత్మక మార్పులకు బాటలు వేశాయి. అన్ని సాయుధ దళాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే కసరత్తుకు పునాది వేసింది. దీర్ఘకాలిక కెరీర్ సుస్థిరత కోసం సాయుధ దళాల్లోని మహిళా ఆఫీసర్లకు ప్రస్తుతం 12 ఆర్మ్స్ అండ్ సర్వీసెస్‌లో పర్మినెంట్ కమిషనింగ్ మంజూరు చేస్తున్నారు. ఆర్మీ మెడికల్ కార్ప్స్, ఆర్మీ డెంటల్ కార్ప్స్, మిలిటరీ నర్సింగ్ సర్వీసు లోనూ వారికి పర్మినెంట్ కమిషనింగ్ ఇస్తున్నారు. ఇప్పుడు భారత యుద్ధ నౌకలపైనా మహిళా ఆఫీసర్లను మోహరిస్తున్నారు. నేవీలో సేవలను అందిస్తున్నారు. నేవీలోని ఒక్క జలాంతర్గాముల విభాగంలో తప్ప మిగతా అన్ని విభాగాల్లోనూ మహిళలకు ఆఫీసర్లుగా, అగ్నివీర్‌లుగా అవకాశాలు ఇస్తున్నారు. రిమోట్‌లీ పైలటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ విభాగంలోకి కూడా మహిళలు చేరుతున్నారు. 2021లో తొలిసారిగా ఈ విభాగంలోకి ఒక మహిళా ఆఫీసర్ చేరారు. 10ం2, బీటెక్ ఎంట్రీ స్కీం ద్వారా భారత నావల్ అకాడమీలో కేడెట్లుగా చేరేందుకు 2024 జనవరి నుంచి మహిళలకు అవకాశాన్ని ఇస్తున్నారు. భారత వాయుసేనలో కంబాట్ సపోర్ట్ హోదాల్లో మహిళా ఆఫీసర్లను నియమించే ప్రక్రియ తొలిసారి ప్రయోగాత్మకంగా 2015లో మొదలైంది. 2022 నుంచి ఈ నియామకాల ప్రక్రియను ఒక పర్మినెంట్ స్కీంగా మార్చారు. దీంతో కంబాట్ విభాగాల్లో పురుషులతో సమానంగా అవకాశాలను అందుకునేందుకు మహిళలకు మార్గం సుగమమైంది.

# లిక్కర్ పాలసీ కేసు.. సీబీఐ ప్రత్యేక కోర్టు వ్యాఖ్యలపై ఢిల్లీ హైకోర్టు స్టే



**న్యూఢిల్లీ, మార్చి 9:** ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఢిల్లీ హైకోర్టువాయిదా వేసింది. దర్యాప్తు సంస్థపై సీబీఐ ప్రత్యేక కోర్టు వ్యాఖ్యలపై హైకోర్టు స్టే విధించింది. సీబీఐ పిటిషన్‌పై ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. ఈడీ కేసు విచారణను కూడా వాయిదా వేయాలని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఢిల్లీ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్ ఇదని అన్నారు. ఎక్సైజ్ పాలసీని మార్చేందుకు లంచాలు ఇచ్చారని ఆరోపించారు. వాట్సాప్ చాట్స్ ద్వారా పాలసీ మార్పుకు ప్రయత్నాలు జరిగాయని.. ఈ కేసులో విజయ్ నాయర్, బుచ్చిబాబు వంటి వ్యక్తులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. లిక్కర్ కేసులో రూ.19 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు లంచాలు ఇచ్చినట్లు సొలిసిటర్ జనరల్ వాదనలు చేశారు. రూ.44.5 కోట్లు హవాలా ద్వారా బదిలీ చేశారని తెలిపారు. ఈ డబ్బును గోవా ఎన్నికల్లో వినియోగించారని మెహతా కోర్టుకు తెలిపారు. డిశ్చార్జ్ ఆర్డర్ ఈ దశలో ఇవ్వకూడదని.. సాక్ష్యాలను పూర్తిగా పట్టించుకోలేదని మెహతా ఆరోపించారు. ట్రయల్ దశలోనే సాక్షుల పరీక్ష అవసరమన్నారు. సమావేశాల్లో పాల్గొన్నవారు కోర్టుకు వస్తారన్నారు. ఈ కేసులో దినేశ్ అరోరా కీలక అప్రూవర్ అని తుషార్ మెహతా తెలిపారు. దినేశ్ అరోరా జరిగినదంతా తెలిపారని అన్నారు. వాట్సాప్ ద్వారా పాలసీ మార్పుపై చర్చలు జరిగాయని.. ఈ కేసులో బుచ్చి బాబు చాట్స్ కీలక ఆధారమని ఢిల్లీ హైకోర్టులో సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

# పార్లమెంట్‌లో చర్చలను ట్రంప్ ఎలా డిసైడ్ చేస్తారు.. కేంద్రంపై ఎంపీ చామల ధ్వజం


**ఢిల్లీ, మార్చి 9 :** పార్లమెంట్ రెండవ విడత బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయని.. ఈ సమావేశాల్లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం పెట్టామని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పార్టీల ఎంపీలను, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని మాట్లాడనీయకుండా స్పీకర్ అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ ఎంపీలు, ఎన్డీఏ ఎంపీలకు లోక్‌సభ స్పీకర్ ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. స్పీకర్ అనే వ్యక్తి లోక్‌సభలో ఉన్న సభ్యులు అందరికీ సమానంగా మాట్లాడే అవకాశం ఇవ్వాలని సూచించారు. ఈరోజు(సోమవారం) లోక్‌సభ మీడియా పాయింట్‌లో ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. 18వ లోక్‌సభలో ప్రతిపక్షాలకు ఎందుకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. తప్పుడు సంకేతాలు ఇచ్చేలా లోక్‌సభ తీరు..రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడే ప్రతిసారి డిస్ట్రబ్ చేస్తున్నారని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. సంకేతాలు ఇచ్చే విధంగా లోక్‌సభను నడుపుతున్నారని ప్రస్తావిం చారు. కాంగ్రెస్ మహిళా ఎంపీలు ప్రధానమంత్రి నరేంద్రమోదీపై దాడి చేయాలని చూశారని తప్పుడు స్టేట్‌మెంట్ ఇచ్చారని.. అందుకే లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాసం పెట్టామని అన్నారు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై లోక్‌సభలో చర్చించాలని డిమాండ్ చేశారు. నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా కాకుండా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తున్నారని ఆరోపించారు. ట్రంప్‌తో మోదీ



కాంప్రమైజ్..అమెరికా నుంచి దిగుమతులపై సుంకాలను వైట్ హౌస్ పార్లమెంట్‌లో చర్చించాల్సిన అంశాలను ట్రంప్ ఎలా డిసైడ్ చేస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎందుకు డిమాండ్ చేశారు. లోక్‌సభలో ఎనిమిది మంది ఎంపీలను సస్పెండ్ చేసిన అంశంపై చర్చించాలని పట్టుబట్టారు. లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాసం సందర్భంగా ఎనిమిది మంది ఎంపీలకు ఓటు వేసే అవకాశం ఇవ్వాలని సూచించారు. లోక్‌సభలోని 543 మంది ఎంపీలకు అవిశ్వాసంపై ఓటు వేసే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. గ్యాస్, క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెంచారని... ఈ విషయాలపై లోక్‌సభలో చర్చ జరగాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

# క్రూడ్ ఆయిల్ పరిస్థితిపై భారత ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది: జై శంకర్

**న్యూఢిల్లీ, మార్చి 9:** పశ్చిమాసియా దేశాల్లో పరిస్థితులపై కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జై శంకర్ సోమవారం రాజ్యసభలో కీలక ప్రకటన చేశారు. పశ్చిమాసియా దేశాల్లో పరిస్థితులను భారత ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని అన్నారు. గల్ఫ్ దేశాల్లోని భారతీయుల భద్రతకు కేంద్రం కట్టుబడి ఉందని తేల్చి చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. 'ప్రధాని మోదీ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. పశ్చిమాసియా దేశాల్లో ఉన్న భారతీయులను భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తోంది. గల్ఫ్ దేశాలు భారత్‌కి ముఖ్యమైన వాణిజ్య భాగస్వాములుగా ఉన్నాయి'..'గల్ఫ్ దేశాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయాలు భారతీయుల కోసం ఎప్పటికప్పుడు అడ్వైజరీలు జారీ చేస్తున్నాయి. క్రూడ్ ఆయిల్ పరిస్థితిపై భారత ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. భారతీయుల కోసం హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటు చేశాం. టెహ్రాన్‌లో ఉన్న భారత రాయబార కార్యాలయం పూర్తి స్థాయిలో పనిచేస్తుంది. గల్ఫ్ దేశాల ప్రభుత్వాలతో భారత ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. భారత విమానయాన సంస్థలు భారత ప్రజలను వెనక్కి తీసుకువస్తున్నాయి. భారత్ రావాలనుకునేవారికి విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. దోహా, జోర్డాన్‌లో ఉన్నవారికి సాయం అందజేస్తున్నాం ఇరాన్‌లో పరిస్థితులపై ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రితో మాట్లాడాను' అని అన్నారు. దేశ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యంక్రూడ్ ఆయిల్ విషయంలో జరుగుతున్న ప్రచారానికి కేంద్ర మంత్రి జై శంకర్



చెక్ పెట్టారు. క్రూడ్ ఆయిల్ కోసం దేశ, ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టబోమని స్పష్టం చేశారు. 'భారతీయుల ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. దేశ ప్రయోజనాలే ఎల్లప్పుడూ సర్వోన్నతంగా ఉంటాయి' అని అన్నారు. దేశంలోని చమురు నిల్వలపై ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో జై శంకర్ మాట్లాడుతూ.. విశాఖపట్నం, మంగళూరు, పడూర్ మొదలైన వ్యూహాత్మక కేంద్రాలతో పాటు పైప్‌లైన్లు, ట్యాంకులు, సముద్ర నౌకల్లో దాదాపు 4 వేల కోట్ల లీటర్ల చమురు నిల్వలున్నాయని వెల్లడించారు.

# సీఈసీ గోబ్యాక్ నినాదాలు, నల్లజెండాలతో నిరసనలు




**కోల్‌కతా:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు కోల్‌కతాలో నిరసనల సెగ తగిలింది. ప్రఖ్యాత కాళిఘాట్ ఆలయాన్ని సోమవారం ఉదయం దర్శించేందుకు వచ్చిన ఆయనకు పలువురు నల్లజెండాలతో నిరసనలు తెలిపారు. 'గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. అయితే పోలీసులు సకాలంలో పరిస్థితిని అదుపు చేశారు. అనంతరం ఆయన ఆలయాన్ని దర్శించుకున్నారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేసి తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన అనంతరం తొలిసారి సీఈసీ ఆదివారం రాత్రి కోల్‌కతా వచ్చారు. విమానాశ్రయం వద్ద కూడా ఆయనకు ఇదే తరహా నిరసనలు ఎదురయ్యాయి. విమానాశ్రయం నుంచి బయలుదేరుతుండగా టీఎంసీ కార్యకర్తలను ఆయనను టార్గెట్ చేసుకుని 'గో బ్యాక్' నినాదాలు చేశారు. ఆయన కాన్వాయ్ వెళ్తున్న దారిలో నల్లజెండాలతో నిరసనలు తెలిపారు. వామపక్ష పార్టీలు ఎయిర్‌పోర్ట్ బయట నిరసనలకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. అయితే పరిస్థితులు చేజారిపోకుండా పోలీసులు వెంటనే తగిన చర్యలు తీసుకున్నారు. ఎన్నికల సన్నద్ధత, ఏర్పాట్లను సమీక్షించేందుకు మూడ్రోజుల పర్యటనకు సీఈసీ కోల్‌కతా వచ్చారు. రాజకీయ పార్టీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, సీనియర్ ప్రభుత్వ అధికారులతో వరుస సమావేశాలను నిర్వహించనున్నారు. సీఈసీతో పాటు ఎన్నికల కమిషనర్లు ఎస్ఎస్ సంధు, వివేక్ జోషి కూడా ఎన్నికల సన్నద్ధతను సమీక్షించనున్నారు. శాంతి భద్రతల పరిస్థితి, చేయాల్సిన ఏర్పాట్లు, ఏజెన్సీల మధ్య సమన్వయం వంటి అంశాలను ప్రధానంగా సీఈసీ టీమ్ సమీక్షించనుంది. బూత్ స్థాయి అధికారులతోనూ సమావేశం కానుంది. పర్యటన చివర్లో మీడియా సమావేశం ఉంటుంది.

# 'బంగాల్‌లో 3దశలకు మించకుండా ఎన్నికలు నిర్వహించాలి' ఎలక్షన్ కమిషన్‌కు రాజకీయ పార్టీల వినతి

**బంగాల్:** అసెంబ్లీ ఎన్నికలను 3 దశలకు మించకుండా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరాయి రాజకీయ పార్టీలు. పూర్తిస్థాయి బెంచ్‌ను కలిసిన పలు పార్టీలకు చెందిన ప్రతినిధుల బృందాలు ఈ మేరకు విజ్ఞప్తి చేశాయి. ఎన్నికల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఈసీని కోరాయి పార్టీలు. ఇందులో టీఎంసీతో పాటు బీజేపీ, సీపీఐ (ఎం), కాంగ్రెస్, ఆప్, ఎన్‌పీపీ, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు ఉన్నాయి. "రాష్ట్రంలో ఎన్నికలకు సంబంధించిన అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాం. పలు పార్టీలు రాష్ట్రంలో ఒకటి లేదా రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని కోరాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఈసీకి సహకరిస్తామని తెలిపాయి. కేంద్ర సాయుధ బలగాలతో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలి. ఫలితంగా ఓటర్లు ఎలాంటి భయం లేకుండా వారి హక్కును వినియోగించుకుంటారని చెప్పారు" అని ఎన్నికల సంఘం వర్గాలు ప్రకటనలో పేర్కొన్నాయి. క్రూడ్ బాంబులు వినియోగించే అవకాశం ఉందని కొన్ని పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. అక్రమ ఆయుధాలతో పాటు నగదు రవాణను అరికట్టాలని విజ్ఞప్తి చేశాయి. ఈ క్రమంలోనే స్పందించి ఈసీ, ఎన్నికల చట్ట ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చింది. హింసాత్మక ఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు పూర్తి చేస్తామని తెలిపింది. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై స్పందించిన సీఈసీ, ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. ఇప్పటికీ ఓటర్ జాబితాలో నమోదు, తొలగింపునకు, సవరణల కోసం




దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. 16 పాయింట్లతో కూడిన వినతి పత్రాన్ని ఈసీకి సమర్పించిన బీజేపీఅంతకుముందు ఈసీని కలిసిన బీజేపీ బంగాల్ ప్రతినిధుల బృందం, అసెంబ్లీ ఎన్నికలకు ముందు బగాల్‌లో భద్రతా అంశాలపై ఆందోళనలను వ్యక్తం చేసింది. ఈ మేరకు అందుకు సంబంధించి 16 పాయింట్లతో కూడిన వినతి పత్రాన్ని ఈసీకి సమర్పించింది. ఎన్నికల నిర్వహణ 3 దశలకు మించకుండా చూడాలని విజ్ఞప్తి చేసింది. ఎటువంటి అల్లర్లకు తావులేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఈసీని కోరింది. అలాగే సున్నితమైన పోలింగ్ బూత్‌లను గుర్తించే ప్రమాణాలను పునర్నిర్వచించాలని ఈసీని అభ్యర్థించింది. సుమారు 400 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలను ఎన్నికల నిర్వహణకు ఉపయోగించాలని బీజేపీ ప్రతినిధుల బృందం ఈసీని కోరింది. అదే సమయంలో కేంద్ర బలగాలను రాష్ట్ర పోలీసు యంత్రాంగం ఉపయోగించుకుంటున్న తీరుపై అసంతృప్తిగా ఉన్నట్లు పేర్కొంది. ఓటర్లకు భరోసాను ఇవ్వడంలో పోలీసు యంత్రాంగం విఫలమవుతోందని విమర్శించింది. హింస లేని, భయంలేని వాతావరణం ఏర్పడాల ంటే ఓటర్లు తమ సొంత ఓట్లు వేయకుండా నిరోధించే పోలీసు లు, ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని బీజేపీ కోరింది. బంగాల్ ఎన్నికలు ఒకే దశలో నిర్వహి ంచాలని డిమాండ్ చేశాం. ఒకవేళ కాదనుకుంటే రెండు దశలకు మించకూడదని కోరాం. ఎన్నికలు స్వేచ్ఛాయుత, పారదర్శక పద్ధతిలో జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తర్వాత అర్హులైన ఓటర్లతో కూడిన జాబితాను ప్రచురించాలని డిమాండ్ చేశాం. --మహ్మద్ సలీం, సీపీఐ (ఎం) కార్యదర్శిఎస్ఐఆర్ ఆందోళనలను పట్టించుకోవడం లేదన్న టీఎంసీఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై నెలకొన్న ఆందోళనపై కేంద్ర ఎన్నికల సంఘం పట్టించుకోవడం లేదని టీఎంసీ ఆరోపించింది. ఈసీ పూర్తి స్థాయి బెంచ్‌ను కలిసిన అనంతరం మంత్రి చంద్రిమ భట్టాచార్య ఈ మేరకు ఆరోపించారు. కోల్?కతాలోని ఓ హోటల్?లో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్? జ్ఞానేశ్ కుమార్?తో పాటు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్, వివేక్ జోషి, బంగాల్? సీఈఓ మనోజ్ అగర్వాల్ రాష్ట్రంలోని రాజకీయ పార్టీలతో సమావేశమయ్యారు.

# టీవీకే, ఎన్డీయే పొత్తుపై నైనార్ నాగేంద్రన్ కార్లిటీ

**చెన్నై:** తమిళనాడులో రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలపై బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ కీలక వ్యాఖ్యలు చేశారు. (సోమవారం) తంజావూరులో పర్యటించి, పలు కార్యక్రమాల్లో నైనార్ నాగేంద్రన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తమిళగ వెట్రి కళగం పార్టీతో, ఎన్డీయే కూటమి గురించి ఎలాంటి చర్చలు జరగలేదని స్పష్టం చేశారు. సినీ నటుడు, టీవీకే అధినేత విజయ్‌ను ఎన్డీయేలోకి తీసుకురావడానికి చర్చలు జరుగుతున్నాయని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని నైనార్ నాగేంద్రన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం టీవీకే పార్టీతో బీజేపీ, ఎన్డీయే స్థాయిలో ఎలాంటి చర్చలు జరగడం లేదని తేల్చిచెప్పారు. ఇటీవల విజయ్ ఎన్డీయే కూటమిలో చేరబోతున్నారని సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తంజావూరు ప్రెస్‌మీట్‌లో నైనార్ నాగేంద్రన్ చేసిన ఈ వ్యాఖ్యలతో తమిళనాడు రాజకీయాల్లో సాగుతున్న ఊహాగానాలకు కొంత వరకు తెరపడినట్లైంది.

# ఇరాన్ కొత్త సుప్రీంగా ఖమేనీ రెండో కుమారుడు మొజ్తబా ఎన్నిక

**ఇరాన్ :** ఇజ్రాయెల్, అమెరికాతో యుద్ధం భీకరంగా సాగుతున్న వేళ ఇరాన్ తన కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకుంది. అమెరికా హెచ్చరికలను భేఖాతరు చేస్తూ ఖమేనీ రెండో కుమారుడు మొజబా ఖమేనీని కొత్త నేతగా ప్రకటించింది. మరోవైపు ఇరాన్‌తోపాటు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై అమెరికా, ఇరాన్ దాడులు మరింత తీవ్రమయ్యాయి. ఇరాన్‌లోని చమురు నిల్వ కేంద్రాలపై దాడుల కారణంగా వెలువడుతున్న పొగలు పర్యావరణానికి పెను ముప్పు అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఎంపిక కొలిక్కివచ్చింది. ఇరాన్‌లోని 88మంది మతగురువులతో కూడిన 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్' కొత్త సుప్రీం లీడర్‌గా ఖమేనీ కుమారుడు మొజ్తబాను ఎన్నుకుంది. ఇస్లామిక్ రిపబ్లిక్‌లో అత్యంత రహస్య వ్యక్తిగా పేరొందిన మొజ్తబా ఖమేనీ, ఇరాన్ యుద్ధ వ్యూహంలో ఇప్పుడు కీలక పాత్ర పోషించనున్నారు. శక్తిమంతమైన రివల్యూషనరీ గార్డ్స్ ఆయన ఆదేశాల



మేరకు పనిచేస్తాయి. మొజ్తబా ఇప్పటివరకు ఎన్నడూ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఏ ప్రభుత్వ పదవినీ చేపట్టలేదు. దేశవ్యాప్తంగా సంబరాలుఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తబా ఖమేనీ ఎన్నిక కావడం పట్ల ఆ దేశ వ్యాప్తంగా సంబరాలు చేసుకున్నారు. అనేక మంది మద్దతుదారులు వీధుల్లోకి వచ్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. 1969లో మషాద్ నగరంలో జన్మించిన మొజ్తబా, చిన్నతనం నుంచే తన తండ్రి షా పాలనను చూస్తూ పెరిగారు. ఇరాన్-ఇరాక్ యుద్ధంలో రివల్యూషనరీ గార్డ్స్ తరపున పోరాడారు. 1989లో తన తండ్రి అయాతుల్లా ఖమేనీ సుప్రీం లీడర్ అయిన తర్వాత, మొజ్తబా క్రమంగా తన పట్టును పెంచుకున్నారు. 2008 నాటి వికీలీక్స్ పత్రాలు ఆయన్ను తెర వెనుక అసలు అధికారిగా అభివర్ణించాయి. 2005, 2009 ఎన్నికల్లో అహ్మదీ నెజాద్ గెలుపులో మొజ్తబా కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఏం జరుగుతుందో చూద్దామన్న ట్రంప్మరోవైపు ఇరాన్ నాయకత్వంపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఏం జరుగుతుందో చూద్దామని వ్యాఖ్యానించారు. అంతకు ముందు ఇరాన్ కొత్త నాయకుడు ఎవరైనా తమ ఆమోదం ఉండాలని, లేకపోతే వారు ఎక్కువ కాలం కొనసాగలేరని ట్రంప్ హెచ్చరించారు.

# ఇరాన్‌తో ఎలాంటి డీల్ ఉండదు




## • ప్రపంచం నెత్తిన చమురు సంక్షోభం !

చమురు ధరలు దారుణంగా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. ఇరాన్‌పై యుద్ధం కారణంగా భారత్ సహా అనేక దేశాలు ఇంధన సమస్యలు ఎదుర్కోబోతున్నాయి. ఇప్పటికే గ్యాస్ ధరలు పెంచేశారు. సిలిండర్‌పై 80 రూపాయాలు పెరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కేవలం గృహవినయోగ సిలిండర్లనే సరఫరా చేయాలని నిర్ణయించారు. కమర్షియల్ సిలిండర్లపై ఆంక్షలు విధించారు. కేవలం గృహావసరాలకే సరఫరా చేయాలని దేశాలు ఇచ్చారు. ఇకపోతే విదేశాల్లో సైతం కార్ల ఇంధన ధరలు పెరిగాయి. అమెరికాలోనూ గ్యాస్ ధరలతో అక్కడి వారు గగ్గోలు పెడుతున్నారు. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం కొనసాగుతున్నది. పది రోజులుగా వరుస దాడులు జరుగుతున్నాయి. ఇది ఇంకెంత కాలం సాగుతుందో చెప్పలేం. మర్ముజ్ జలసంధి మూసివేత కారణంగా చమురు నౌకలు కదిలే పరిస్థితి లేదు. అందుకే యుద్ధంతో భారత్ చమురు దిగుమతులకు ముప్పు ఏర్పడే ప్రమాదం కనిపిస్తున్నది. యూరప్‌లో చమురు ధరలు బ్యారెల్‌కు 20 డాలర్లు పెరిగి 80 డాలర్లకు చేరింది. హోర్మోజ్ జలసంధి కూడా మూతపడితే 100 డాలర్లకు కూడా చేరే ప్రమాదం పొంచి ఉన్నదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సూయీజ్ కాలువ, ఎర్ర సముద్రం నౌకాయానా నికి తీవ్ర అంతరాయం కలుగుతున్నది. దీంతో ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం పడుతున్నది. ఈ మార్గాల్లో భారత్ రోజుకు 26 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంటుంది. ఒకవేళ బ్యారెల్‌కు 10 డాలర్ల చొప్పున పెరిగితే, మొత్తం 15 బిలియన్ డాలర్ల అధిక వ్యయం అవుతుంది. పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ ఒపెక్ ఉత్పత్తిని పెంచవచ్చు. కానీ దీర్ఘకాలిక యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించే ప్రమాదం ఉన్నది. అంతేకాకుండా గల్ఫ్ దేశాలకు ఆర్థిక నష్టాలు, అమెరికా ప్రతిష్ఠకు విఘాతం కలిగే పరిస్థితులు నెలకొన్నాయి. యుద్ధ వాతావరణంతో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌తోపాటు పశ్చిమాసియాలోని ఆర్థిక వ్యవస్థలు, ప్రజల రోజువారీ జీవితాలను సంక్షోభం లోకి నెట్టేలా కనిపిస్తున్నది. ట్రంప్ మూర్ఖపు నిర్ణయం కారణంగా ప్రపంచం మొత్తం ఆర్థిక చక్రబంధంలో ఇరుక్కోవాలసి వస్తోంది. చమురు సరఫరా మార్గాల్లో అంతరాయల వల్ల వాటి ధరలు విపరీతంగా పెరిగి, దీర్ఘకాలికంగా ప్రతికూల ప్రభావం పడుతుంది.చమురు ధరలు పెరగడంతో వాల్‌స్ట్రీట్ 800 పాయింట్లు పడిపోయింది. పెట్రోల్, ఆహారం సహా అన్నింటి ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులు చమురు కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టవచ్చు. కానీ ప్రజలకు ఇబ్బందులు తప్పవు. అమెరికాకు దేశీయంగా చమురు ఉత్పత్తి ఎక్కువగా ఉండటం కొంత ఉపశమనం కావొచ్చు. కానీ ఇరాన్ బలాన్ని పట్టించుకోకపోతే ఇది ఇరాక్ యుద్ధంలా పెద్ద తప్పుగా మారే ప్రమాదం ఉన్నదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. ఈ యుద్ధంలో అణ్వాయుధాల వినియోగం జరిగినా, రష్యా, చైనా ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగినా అత్యంత ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. ఈ యుద్ధం వల్ల జపాన్ వంటి ఆసియా దేశాలు అమెరికాపై నమ్మకం కోల్పోయి డాలర్‌కు దూరమయ్యే ప్రమాదం కూడా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. అమెరికా– ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను తిప్పి కొట్టేందుకు ఇరాన్ చేస్తున్న ప్రతిదాడుల కారణంగానే ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేలా లేవు. ఇరాన్ తలొగ్గేది లేదని, లొంగిపోయేది లేదని తేల్చి చెప్పింది. ఇరాన్‌ను ధ్వంసం చేసే వరకు ట్రంప్ నిద్రపోయేలా కనిపించడం లేదు. ఇప్పటికే టర్కీ నుంచి దుబాయి వరకు అమెరికాకు చెందిన సైనిక స్థావరాలు, పోర్టులు, చమురు శుద్ధి కేంద్రాలు, విమానాశ్రయాలు ఇలా 27 ప్రాంతాలపై ఇరాను విరుచుకుపడింది. ఇవన్నీ కూడా తక్కువ ఖర్చుతో కూడిన డ్రోన్‌ల ద్వారానే జరిపినట్టు తెలిసింది. రవాణా మార్గాలపై ఈ దాడులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దుబాయి, సౌదీ అరేబియా కూడా తీవ్రమైన కష్టాల్లో కూరుకుపోయాయి. ఇరాన్ వినియోగిస్తున్న ఆధునిక ఆయుధాలను దుబాయి, సౌదీ అరేబియా బలహీనమైన రక్షణ వ్యవస్థలు దీటుగా ఎదుర్కోలేకపోతున్నాయి. పెద్ద కంపెనీలు కార్యకలాపాలు నిలిపివేశాయి. దుబాయిలోని 50 లక్షల మంది భారతీయులపైనా ప్రభావం పడుతున్నది. ప్రస్తుత యుద్ధం కారణంగా బ్రిటన్, ఫ్రాన్స్ కాలంలో రూపొందిం చిన పాత సరిహద్దులు కూడా మారిపోయే అవకాశం ఉన్నది. సంక్షోభంగా కారణంగా గల్ఫ్ రాజ్యాల్లో నిరుద్యోగం పెరిగితే ప్రజల్లో అసంతృప్తి వెల్లువెత్తుతుంది. అమెరికా సైన్యం వెనక్కి వెళ్లిపోవాలని ఇరాక్‌లో డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. అమెరికా సైనిక స్థావరాలపై జరిగిన దాడుల పట్ల టర్కీ సంతోషం గానే ఉన్నదని కొందరు భావిస్తున్నారు. యుద్ధ వాతావరణంలో యూరప్ మాటలకే పరిమితమైందని విమర్శలు ఎదుర్కొంటున్నది. భారత్ చౌకైన రష్యా చమురుపై ఆధారపడుతున్నది. చైనా తన వాణిజ్య మార్గాలను, నౌకాశ్రయాలను రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నది. దాడుల కారణంగా ఇరాన్ ప్రజలు తమ అత్యున్నత నాయకుడిని కోల్పోయారు. ఇరాన్ సైనిక కేంద్రాలపై అమెరికా 1,700 దాడులు చేసింది. ఇరాన్ వ్యూహాత్మకంగా ప్రతిస్పందిస్తున్నది. పర్షియన్ నాగరికతకు చెందిన దీర్ఘ చరిత్ర కారణంగా ప్రజలు ఐక్యంగా నిలుస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ఆ దేశంలో పెద్దగా కల్లోలం కనిపించడంలేదు. రష్యా, చైనా మద్దతుతో యుద్ధం నిలువగలిగితే ప్రపంచానికి అది విజయం అవుతుంది.

---

# వెలుగులోకి సింథటిక్ డ్రగ్స్



## • ఈగిల్ ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి సంచలన విషయాలు

**హైదరాబాద్,మార్చి9:** తెలంగాణలో భారీ సింథటిక్ డ్రగ్స్ రాకెట్‌ను పోలీసులు వెలుగులోకి తెచ్చారు. షాద్‌నగర్‌లో రహస్యంగా మెఫెడ్రోన్ డ్రగ్ తయారీ చేస్తున్న గ్యాంగ్ కార్యకలాపాలను ఈగిల్ ఫోర్స్ దర్యాప్తులో గుర్తించారు. ఈ కేసులో సంచలన విషయాలు బయటపడటంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. దర్యాప్తులో భాగంగా ఎస్సార్ ఇన్నోవేషన్స్ అనే సంస్థ ద్వారా డ్రగ్స్ తయారీలో ఉపయోగించే నిషేధిత రసాయనాలను సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. ముఖ్యంగా మెఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 2 బ్రోమో–4 మెథైల్ ప్రోపియోఫీనోన్ అనే రసాయనంతో పాటు, క్లోఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 3 క్లోరో–1 ఫెనైల్–1 ప్రోపనోన్ అనే కెమికల్స్‌ను సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఎస్సార్ ఇన్నోవేషన్స్ డైరెక్టర్ షేక్ రఫీ కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఇండియా మార్ట్ ద్వారా రాజస్థాన్‌కు చెందిన నిందితులకు ఈ రసాయనాలను సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌కు చెందిన గ్యాంగ్ మూడు విడతల్లో దాదాపు 300 కిలోల రసాయనాలను కొనుగోలు చేసినట్లు సమాచారం. నిందితులు తప్పుడు కంపెనీ పేర్లతో కెమికల్స్ కొనుగోలు చేసి షాద్‌నగర్‌లో అ÷–దదె గదిని తీసుకుని అక్కడే డ్రగ్స్ తయారీ చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తయారు చేసిన డ్రగ్స్‌ను తిరిగి రాజస్థాన్‌కు తరలించి విక్రయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ గ్యాంగ్‌కు రాజస్థాన్‌కు చెందిన గిరీష్ థాపర్ అలియాస్ వీరేంద్ర స్వామి నాయకత్వం వహిస్తున్నాడు. నకిలీ పేర్లతో వ్యవహరిస్తూ డ్రగ్స్ తయారీకి అవసరమైన ముడి సరుకును సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. గ్యాంగ్‌లో మనీష్ బిష్ణోయి, మనోజ్ మాథూర్, శిశుపాల్, సుమిత్, రాజు కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఈ కెమికల్స్ సరఫరాకు సంబంధించి లక్షల రూ.ల లావాదేవీలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈగిల్ పోలీసుల సమాచారంతో రాజస్థాన్ పోలీసులు వీరేంద్ర స్వామి, మనీష్ బిష్ణోయిని అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో షాద్‌నగర్‌లో నడుస్తున్న డ్రగ్ ల్యాబ్ విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కేసు నమోదు చేశారు. పోలీసులు మరికొంత మంది నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

---

# తిరుపతి జిల్లాలో విషాద ఘటన



## కరెంట్ తీగలకు రెండు ఏనుగులు బలి

**తిరుపతి,మార్చి9:** జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎర్రావారి పాలెం మండలంలోని నెరబైలు అడవికి సమీపంలో వేటగాళ్లు వేసిన కరెంట్ ఉచ్చులో చిక్కి రెండు ఏనుగులు మృతిచెందాయి. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి రావడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం, ఎర్రావారి పాలెం మండలం నెరబైలు అడవికి సమీపంలోని సాయిబులపల్లె ప్రాంతంలో వేటగాళ్లు అక్రమంగా కరెంట్ ఉచ్చులు వేశారు. అడవిలో నుంచి మేత కోసం పొలాల వైపు వచ్చిన రెండు గజరాజులు ఆ కరెంట్ ఉచ్చులో చిక్కి తీవ్ర షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వేటగాళ్లు ఉద్దేశపూర్వకంగా కరెంట్ ఉచ్చు పెట్టడం వల్లనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని అటవీ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ ఘటనకు కారణమైన వేటగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

---

# ఆర్థిక సంక్షభంతో తగ్గుతున్న పసిడిధరలు

## బంగారం, వెండిపై స్వల్పంగా తగ్గుదల

**న్యూఢిల్లీ,మార్చి9:** గత కొద్ది రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు సోమవారం మరింత కిందకు వచ్చాయి. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ బంగారం, వెండి ధరలు మాత్రం పడిపోతుండడం నిపుణులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. సోమవారం వెండి కేజీకి రూ.5 వేల మేర తగ్గింది. మరోవైపు బంగారం ధర కూడా భారీగా తగ్గింది. సోమవారంఉదయం 10:30 గంటల సమయంలో హైదారాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,61,680కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే దాదాపు రూ.1960 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,200 దగ్గర ఉంది. ముందటి రోజు ధరతో పోల్చుకుంటే రూ.1800 మేర తగ్గింది. మరోవైపు వెండి కూడా భారీ తగ్గుదల నమోదు చేసింది. బుధవారం కిలోకు రూ.5 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.80 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.90 లక్షలుగా ఉంది. గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.




---

# చమురు ధరలతో మార్కెట్ల కుదేలు




## • రూపాయి విలువ పడడంతె దేశీయ మార్కెట్లపై ప్రభావం

**న్యూఢిల్లీ,మార్చి9:** పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర వంద డాలర్లు దాటింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు అయిన భారత్‌పై తీవ్ర ప్రభావం పడుతుందనే అంచనాలు మదుపర్లను కలవరపెడుతున్నాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లు తీవ్ర ఒత్తిడిలో ఉండడం, డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి భారీగా పతనమవడం దేశీయ సూచీలపై నెగిటివ్ ప్రభావం చూపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాల్లో కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (78,918)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 2000 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత పతనమైంది. మరో ఆరు వందల పాయింట్లు కిందకు వెళ్లింది. చాలా రోజుల తర్వాత సెన్సెక్స్ 70,000 పాయింట్ల దిగువకు పడిపోయింది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 2037 పాయింట్ల నష్టంతో 76,881 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా భారీగా నష్టపోయింది. 2.5 శాతానికి పైగా పడిపోయింది. ప్రస్తుతం 624 పాయింట్ల నష్టంతో 23,826 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో ఎమ్‌సీఎక్స్ ఇండియా, కోల్ ఇండియా మొదలైన షేర్లు మాత్రమే స్వల్ప లాభాల్లో ఉన్నాయి . ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, యూనో మిండా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్బీఐ, హిందుస్థాన్ పెట్రో మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1587 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 2280 పాయింట్ల నష్టంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 92.32గా ఉంది.

# వేసవి కంటే ముందే భగ్గుమన్న భాగ్యనగరం - రెండు నెలల్లో 100కు పైగా అగ్నిప్రమాదాలు

భవనాల్లో చెలరేగుతున్న మంటలు! ఎగిసి పడుతున్న అగ్నికీలలు! ప్రాణాలు కోల్పోతున్న చిన్నారులు, మహిళలు! భయాందోళనకు గురవుతున్న జనాలు! వరుస అగ్ని ప్రమాదాలతో ప్రస్తుతం హైదరాబాద్‌లో నెలకొన్ని పరిస్థితి. నగరంలో ఫైర్ యాక్సిడెంట్లు తరచూ సంభవించడం ఇప్పుడు సాధారణ విషయంగా మారింది. ఈ ప్రమాదాలతో ప్రజల ప్రాణాలు కోల్పోవడమే కాదు, కోట్ల రూపాయల ఆస్తి నష్టం సంభవిస్తోంది. ఇందుకు చాలా ఉదాహరణలే ఉన్నాయి. వీటిని నివారించడానికి ప్రభుత్వాలు, అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం శూన్యం.బూడిద అవుతున్న సంతోషాలు : హైదరాబాద్ నగరంలో నిత్యం ఏదో ఒక చోట అగ్గి రాజుకోవడం సాధారణ విషయంగా మారింది. భారీ అగ్ని ప్రమాదాలు జరిగితే పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆందోళనకర అంశంగా మారింది. సాధారణంగా ఏడాది పొడవునా అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. ఐతే వస్తున్నది ఎండాకాలం. మిగతా సమయాలతో పోలిస్తే వేసవిలో ప్రమాదాలు మరింత ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం ఫిబ్రవరి నెల నడుస్తోంది. ఎండలు ఇప్పుడిప్పుడే ప్రారంభం అవుతున్నాయి. కానీ, హైదరాబాద్‌లో వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలు బట్టి చూస్తే రాబోయే వేసవిలో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అనే ఆందోళన వ్యక్తం అవుతోంది.రెండు నెలల్లో వరుస ప్రమాదాలు : 2026 ప్రారంభంలో అంటే రెండు నెలలు గడవకముందే వరస అగ్నిప్రమాదాలు నగర వాసుల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు, రాజకీయ నాయకులు స్పందించడం, విచారణ జరిపి బాధ్యులను శిక్షిస్తామని చెప్పడం షరామామూలే అయిపోయింది. ఈ మధ్య కాలంలో జరిగిన అగ్ని ప్రమాదాలను పరిశీలిస్తే జనవరి 24న అబిడ్స్‌లోని బచ్చాస్ ఫర్నిచర్ దుకాణంలోని సెల్లార్‌లో మంటలు చెలరేగాయి. అక్కడ చిక్కుకున్న ఇద్దరు పిల్లల విచారణ జరిపి బాధ్యులను శిక్షిస్తామని ను కాపాడేందుకు ముగ్గురు వ్యక్తులు వెళ్లారు. మంటలు అధికం కావడంతో బయటికి రాలేక ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు మృతి చెందారు. 2023 నవంబర్‌లో నాంపల్లి బజార్‌ఘాట్‌లోని ఓ అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 9 మంది మృతి చెందగా, 16 మంది గాయపడ్డారు. సెల్లార్‌లో భవన యజమాని అక్రమంగా రసాయనాలు నిల్వ చేయడమే ప్రమాదానికి కారణవేసవి కంటే ముందే మంటలు : వేసవి రాకముందే హైదరాబాద్‌లో ప్రమాదాలు ప్రారంభం అయ్యాయి. ఫిబ్రవరి 5న చిక్కడపల్లి గాంధీనగర్‌లోని సుధామ మహిళల పీజీ వసతి గృహంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో 15 మంది యువతులు, మహిళలు అందులోనే ఉన్నారు. మంటలు చూసి వెంటనే బయటికి పరిగెత్తారు. లోపల చిక్కుకున్న ఇద్దరిని అగ్నిమాపక సిబ్బంది నిచ్చెన ద్వారా కాపాడారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. అలాగే, 8వ తేదీన మలక్‌పేట్‌లోని అక్బర్‌బాగ్ కాలనీలోని



ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుకున్న భవనంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఫైర్ సిబ్బంది లోపలున్న తల్లి, కుమారుడితో పాటు 2 కుక్కలను కాపాడారు."అగ్ని ప్రమాదం జరిగినప్పుడు దుకాణాల కింద సెల్లార్ ఉన్న వారు అక్కడ సిలిండర్? వంటి మండే వస్తువులు పెట్టడం వలన అది ఎన్నో ప్రమాదాలకు దారి తీస్తుంది. అలాగే అపార్టమెంట్స్?లో ఉండే కొందరు మెట్ల మార్గాన్ని వివిధ వస్తువులతో మూసి వేస్తారు. అలాంటి సమయంలో భవనంలో మంటలు వ్యాపిస్తే, లిఫ్ట్?లు పనిచేయవు. అప్పుడు మెట్ల మార్గం ఒకటే ఉంటుంది. అలాంటి చోట జరిగే ప్రమాదాల్లో మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. అది గమనించి, మేం జీహెచ్ఎంసీ, ఎలక్ట్రిసిటీ వారితో కలిసి నిబంధనలు పాటించని దుకాణాలను సీజ్? చేశాం. తర్వాత వ్యాపార సంఘాల వారు అందరూ వచ్చి రిక్వెస్ట్? చేయడంతో వాళ్లకి ఒక నెల పాటు సమయం ఇచ్చి ప్రతి రోజు వారితో డ్రిల్ చేపిస్తున్నాం.?" - రంగనాథ్, హైడ్రా కమిషనర్‌కార్? షోరూంలో చెలరేగిన మంటలు : రాజేంద్రనగర్ అత్తాపూర్‌లోని ఓ కార్ షోరూంలో 9 తేదీన అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు భయాందోళనలకు గురై బయటకు పరుగులు తీశారు. దాదాం ఆరుగురు ప్రాణాలు వదిలారు. ఇలా చెప్పుకుంటూ పోతే నగరంలో జరిగిన అగ్నిప్రమాదాలు లెక్కకు మిక్కిలి ఉన్నాయి."అందరు బట్టలు, ఫర్నీచర్? దుకాణాల్లోని సెల్లార్లను తమ గోడౌన్?లా వాడుకుంటున్నారు. అక్కడ దుస్తులు లేదా ఫర్నిచర్?కు అవసరమయ్యే చెక్కలు స్టోర్? చేయడం వలన అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో చాలా వేగంగా మంటలు వ్యాపిస్తాయి. ఇలా స్టోరేజ్? చేయడం వలన అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి." - స్వాతిక గుప్తా, ఫైర్ సేఫ్టీ నిపుణురాలు

# దంపతుల మధ్య కోపతాపాలు తగ్గాలంటే! - ఈ టిప్స్ పాటించాలంటున్న నిపుణులు!



వైవాహిక జీవితంలో కోపతాపాలు, అలకలు సహజం. అయితే, ఇవి టీకప్పులో తుపానులా సమసిపోతేనే బాగుంటుంది. హద్దు దాటితే మాత్రం బంధానికే ముప్పు వాటిల్లో ప్రమాదం ఉంటుంది. అందుకే, నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. భాగస్వామి కోపంతో ఉన్నప్పుడు వాళ్ల దగ్గర కొన్ని విషయాలను అస్సలు ప్రస్తావించకూడదని సూచిస్తున్నారు. ఈ టిప్స్ పాటిస్తే దాంపత్య బంధం ఆనందంగా సాగుతుందని చెబుతున్నారు. మరి, ఆ విషయాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం!నీ వల్ల కాదు : గొడవ జరిగినప్పుడు భార్యాభర్తలిద్దరూ ఒకరిపై ఒకరు పీకల్లోతు కోపంతో ఉంటారు. ఇలాంటప్పుడు ఎదుటివారిలో ఉండే ప్రతికూలతలు, లోపాలన్నీ గుర్తుకొస్తుంటాయి. ఒక రకమైన అసహనానికి లోనవుతుంటారు. 'నీ వల్ల ఏదీ కాదు', 'నువ్వెప్పుడూ నన్ను సంతోషంగా ఉంచలేదు', 'నీకు స్వార్థం ఎక్కువ' ఇలాంటి మాటలు మన ప్రమేయం లేకుండానే దొర్లుతుంటాయి. కానీ, ఇలాంటి మాటలు అవతలి వారి కోపాన్ని మరింతగా పెంచే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తద్వారా గొడవ పెద్దదవడం తప్ప మరే ప్రయోజనమూ ఉండదని చెబుతున్నారు. దీంతో ఇద్దరి మధ్యా ఒక్క రోజులో ముగిసిపోయే కోపతాపాలు, రోజుల తరబడి కొనసాగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకే, కోపంతో ఉన్న భాగస్వామి దగ్గర ఎంత సంయమనం పాటిస్తే అంత మంచిదని సూచిస్తున్నారు. ఈ క్రమంలో తప్పైనా, ఒప్పైనా అవతలి వారి కోపం తగ్గే దాకా కామ్‌గా ఉండడం మేలని సలహా ఇస్తున్నారు. ఇక కూల్ అయ్యాక అన్ని విషయాలూ కూర్చొని మాట్లాడుకుంటే సరిపోతందని తెలియజేస్తున్నారు." డబ్బులు ఊరికే రావు" ఇలా చేశారంటే మీ టూర్ ప్లాన్ సక్సెస్ - నిపుణులు సూచిస్తున్న చిట్కాలివే!వాళ్ల ప్రస్తావన వద్దు : దంపతుల మధ్య జరిగే గొడవల్లో ఎక్కువ శాతం మూడో వ్యక్తి ప్రస్తావన వల్లే జరుగుతుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఎలాగంటే, భార్యాభర్తలు తమ గొడవల మధ్యలో అత్తింటి వారి ప్రస్తావన తీసుకురావడం, వారిని విమర్శించడం చేస్తుంటారు. దీని వల్ల భాగస్వామి కోపం కట్టలు తెంచుకునే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఇది దంపతుల మధ్య భేదాభిప్రాయాల్ని మరింతగా పెంచచ్చని అంటున్నారు. కాబట్టి, ఆలుమగలు మధ్య గొడవలుంటే వారే పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారు. అంతేకానీ, అన్నింటికీ కారణం మూడో వ్యక్తే అని నిందించడం వల్ల దంపతుల మధ్య అనుబంధం దెబ్బతింటుందని పేర్కొంటున్నారు.రెచ్చగొడుతున్నారా? : అసలే గొడవై భార్యాభర్తల మధ్య దూరం పెరిగినప్పుడు.. దాన్ని పరిష్కరించకుండా, కొంతమంది అవతలి వారిని మరింత రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుంటారు. మాటలు, చేతలతో వాళ్ల సహనాన్ని పరీక్షిస్తుంటారు. ఈ క్రమంలో వాళ్లకు నచ్చని పనులు చేయడం, నచ్చని వ్యక్తులతో మాట్లాడడం లాంటివి చేస్తుంటారు. నిజానికి, ఇది గొడవకు పరిష్కారం చూపడమేమోగానీ, ఇద్దరి మధ్య దూరం మరింత పెరిగేలా చేస్తుందంటున్నారు నిపుణులు. కాబట్టి, కోపంలో ఉన్న భాగస్వామిని శాంతపరిచేందుకు ప్రయత్నించాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఓ మెట్టు దిగాలని చెబుతున్నారు.

# ఊరూరు తిరుగుతూ తన కల్యాణానికి తానే పిలుపునిచ్చే నరసింహ స్వామి- అహోబిలం బ్రహ్మోత్సవాల విశేషాలివే!



కృత యుగంలో హిరణ్యకశ్యపుని సంహారం కోసం శ్రీ మహావిష్ణువు ఉగ్ర నరసింహ అవతారం దాల్చిన సంగతి తెలిసిందే! రాక్షస సంహారం తర్వాత నరసింహ స్వామి కొలువైన క్షేత్రం అహోబిలం నవ నారసింహ క్షేత్రాలలో ఒకటైన పవిత్ర పుణ్యక్షేత్రంగా భాసిల్లుతోంది. అహోబిలం నల్లమల్ల అడవి ప్రాంతంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కొలువై ఉన్న దివ్య ధామం. ఫిబ్రవరి 20 నుంచి అహోబిలం నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ క్రతువులో జరిగే కల్యాణానికి స్వామి వారు ఊరూరు తిరుగుతూ తన పెళ్ళికి తానే పెళ్ళిపిలుపు అందించనున్నారు. బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఉత్సవాలైన పార్వేట ఉత్సవం, అహోబిలం స్వామి వారి కళ్యాణం విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.అహోబిలం క్షేత్ర విశిష్టతనవ నారసింహ క్షేత్రాలలో ఒకటిగా ప్రాశస్త్యం పొందిన అహోబిలం 108 దివ్యదేశాలలో ఒకటిగా విరాజిల్లుతోంది. పురాణాల ప్రకారం శ్రీ మహావిష్ణువు రాక్షస రాజైన హిరణ్యకశ్యపుని సంహరించేందుకు సగం మనిషిగా ఇంకో సగం సింహం రూపంలో అవతరించడంతో స్వామి ఉగ్ర రూపాన్ని చూసి దేవతలు అహో! ఏమి బలం!, అహోబలం! అని ఆశ్చర్యంతో పొగిడారంట! అందుకే ఈ క్షేత్రానికి అహోబిలం నరసింహ స్వామి దేవాలయంగా పేరు వచ్చింది అని చెబుతారు. ప్రతీ సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పంచమి నుంచి పౌర్ణమి వరకు నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ సందర్భంగా నరసింహుని పార్వేట ఉత్సవం 45 రోజుల పాటు కన్నుల పండుగగా జరుగుతుంది.

పార్వేట ఉత్సవం చరిత్ర'పరి' అంటే గుర్రం. స్వామి వారు క్రూరమృగాల్ని వేటాడడానికి గుర్రంపై అరణ్యాలకు బయల్దేరడాన్ని 'పారువేట' అంటారు. మరోవిధంగా, దుష్టశిక్షణ, శిష్టరక్షణకు దేవదేవుడు సాగించే పర్యటననే పార్వేట ఉత్సవం అని అంటారు. పూర్వం అహోబిలం మఠం ప్రథమ పీఠాధిపతితో స్వామి వారు "నన్ను గ్రామ గ్రామానికి తీసుకెళ్లండి. భక్తులకు నా పాదాలు ఆశ్రయించే అవకాశం కల్పించండి' అని ఆదేశించారని, అలాగే నా పెళ్లికి నా భక్తుల్ని నేనే స్వయంగా ఆహ్వానిస్తానని" కూడా చెప్పినట్లుగా అహోబిలం క్షేత్ర మహత్యంలో వివరించి ఉంది. స్వామివారి ఆదేశం మేరకు అహోబిలం మఠం ప్రథమ పీఠాధిపతి శఠగోపం యతీంద్ర మహాదేశికన్ ఈ బృహత్కార్యానికి శ్రీకారం చుట్టాడు. ఆనాటి నుంచి నేటి వరకు పార్వేట ఉత్సవాలు 45 రోజుల పాటు 35 గ్రామాల్లో వైభవంగా జరుగుతాయి. పార్వేటోత్సవాలకు కొనసాగింపుగా బ్రహ్మోత్సవాలు చివరగా జరిగే గరుడోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

పార్వేటోత్సవాల వెనుక ఇతిహాస గాథ

హిరణ్యకశ్యపుని సంహారం తరువాత నరసింహ స్వామి వీరావేశంతో నల్లమల అటవీ ప్రాంతంలో సంచరిస్తుంటాడు. ఎంతకూ ఆయన ఉగ్రత తగ్గదు. ఆ సమయంలో నరహరికి చెంచులక్ష్మి తారసపడింది. ఆమెను చూడగానే స్వామి ప్రసన్నుడవుతాడు. ఆమెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకుంటాడు. అయితే చెంచులు తమ ఆడబిడ్డను వివాహం చేసుకోవాలంటే 'ఓలి'గా అంటే కట్నంగా ఏమి సమర్పిస్తావని స్వామిని అడుగుతారు. అప్పుడు స్వామి పారువేటు ఉత్సవాల్లో భక్తులు సమర్పించే ధాన్యాన్ని కట్నంగా ఇస్తానని హామీ ఇచ్చి చెంచులక్ష్మిని వివాహమాడతాడు. అలా చెంచులక్ష్మిని వివాహం చేసుకోవడానికి స్వామి గుర్రమెక్కి పార్వేటోత్సవాలలో గ్రామాలు తిరిగి భక్తులు సమర్పించే ధాన్యాన్ని స్వీకరించడం ఆనవాయితీగా వచ్చింది. ఆ సంప్రదాయం నేటికీ కొనసాగుతుండడం విశేషం. అలా ఓలి కోసం స్వామి గ్రామాలు తిరుగుతూ తన పెళ్లికి గ్రామస్థులను స్వయంగా ఆహ్వానించడం కూడా ఈ పార్వేటు ఉత్సవంలో భాగం.పారువేటోత్సవాల శోభస్వామి పారువేటోత్సవాలకు వచ్చే గ్రామాలలో తెలుపుకు ప్రాధాన్యం ఉంటుంది. గ్రామాల్లో ఈ 45 రోజులు ఎటు చూసినా శ్వేత వర్ణం దర్శనమిస్తుంది. పారువేట ఉత్సవాలలో భాగంగా స్వామివారి పల్లకి ఎగువ అహోబిలం నుంచి కిందకు దిగుతుంది. బాచేపల్లిలో ప్రారంభమయ్యే ఈ ఉత్సవం రుద్రవరం గ్రామానికి చేరడంతో ముగుస్తుంది. స్వామి పారువేట వేడుకలు జరిగే 45 రోజులు గ్రామాల్లో పండుగ వాతావరణం సంతరించుకుంటుంది. స్వామి తమ ఊరికి వచ్చాడని గ్రామ ప్రజల్లో పట్టరాని ఆనందం అవధులు దాటుతుంది. దాదాపు 600 సంవత్సరాలుగా ఈ ఉత్సవం నిరాటంకంగా కొనసాగడం స్వామి మహిమే అని స్థానిక ప్రజలు భక్తిపారవశ్యంతో చెబుతారు. ఈ సందర్భంగా స్వామి పల్లకి మోయడానికి భక్తులు పోటీపడతారు. ఎంత పెద్ద ఉన్నతాధికారైనా సరే నిమిషం కాలమైనా స్వామి పల్లకి మోయాలని తహతహలాడుతారు.రానున్న అహోబిలం నరసింహుని పార్వేట ఉత్సవాల్లో పాల్గొనడానికి మనం కూడా తరలి వెళ్దాం. స్వామివారి కల్యాణాన్ని కన్నులారా వీక్షిద్దాం.ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# తరిగొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు- పూర్తి వివరాలు మీ కోసం!





ఫాల్గుణ మాసంలో ప్రతి నరసింహ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఒకటి రెండు రోజుల తేడాతో దాదాపు అన్ని నరసింహ క్షేత్రాల్లో ఇదే మాసంలో బ్రహ్మోత్సవాలు జరగడం విశేషం. ఇప్పటికే ఇటు యాదగిరి గుట్ట, అటు అహోబిలంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తరిగొండ నరసింహ స్వామి క్షేత్రంలో కూడా బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరగనున్న ఈ బ్రహ్మోత్సవాలు ఎప్పటి నుంచి ప్రారంభం కానున్నాయి? ఏ రోజు ఏ ఉత్సవం జరగనుంది తెలుసుకునే ముందు తరిగొండ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ విశేషాలు కూడా ఈ కథనంలో తెలుసుకుందాం.పెరుగు కుండలో దర్శనమిచ్చిన నరసింహుడు

ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లాలో శ్రీ తరిగొండ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం వెలసి ఉంది. పూర్వం తరిగొండ ప్రాంతాన్ని 'తరికుండ' అని పిలిచేవారు. ద్రవిడ భాషలో 'తైర్' అంటే పెరుగు అని అర్థం. పూర్వం ఈ గ్రామంలోని ఓ స్త్రీ పెరుగు చిలుకుతున్నప్పుడు పెరుగు కుండలో సాలగ్రామ రూపంలో లక్ష్మి నరసింహ స్వామి దర్శనమిచ్చాడంట! అదే సమయంలో ఆ గ్రామంలో నివసించే ఒక భక్తునికి స్వామి కలలో సాక్షాత్కారమిచ్చి తనకు ఆలయం నిర్మించి పెరుగు కుండలో దొరికిన తన సాలగ్రామాన్ని ప్రతిష్ఠించమని చెప్పాడంట! స్వామి ఆదేశం మేరకు నిర్మితమైన ఈ ఆలయంలో శ్రీలక్ష్మి నరసింహ స్వామి స్వయంభువుగా పూజలందుకుంటున్నాడు. 'తరికుండ' కాలక్రమేణా తరిగొండ గా మారింది.సత్యపీఠంతరిగొండ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో దుర్వాస మహర్షి సత్య పీఠాన్ని ఏర్పాటు చేసాడని ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. నరసింహ స్వామి ఆలయం వెలుపల స్వామికి ఎదురుగా ఉన్న ఈ బలిపీఠం వద్ద ఎంత ఘోరమైన నేరాలు చేసిన వారైనా సరే తమ తప్పును ఒప్పుకొని తీరాల్సిందే! అందుకే తప్పు చేసినవారు ఇక్కడ ప్రమాణాలు చేయడానికి భయపడతారు. కాణిపాకంలో వలే తరిగొండ క్షేత్రం కూడ సత్య ప్రమాణాలకు నెలవుగా మారింది.

బ్రహ్మోత్సవాలుతరిగొండలో ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాసం శుద్ధ సప్తమి నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 23, సోమవారం నుంచి మార్చి 4, బుధవారం వరకు ఈ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఏ రోజు ఏ ఉత్సవం జరగనుందో తెలుసుకుందాం.

బ్రహ్మోత్సవాల పూర్తి షెడ్యూల్

23 ఫిబ్రవరి సోమవారం అంకురార్పణ కార్యక్రమం జరుగుతుంది.

24, ఫిబ్రవరి మంగళవారం ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతుంది, రాత్రి హంస వాహన సేవ జరుగనుంది.

25, ఫిబ్రవరి బుధవారం ఉదయం ముత్యపుపందిరి వాహనం, రాత్రి హనుమంత వాహన సేవలు జరగనున్నాయి.

26, ఫిబ్రవరి గురువారం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సింహ వాహన సేవలు జరగనున్నాయి.

27, ఫిబ్రవరి శుక్రవారం ఉదయం బంగారు తిరుచ్చి ఉత్సవం, రాత్రి పెద్దశేష వాహనసేవలు జరగనున్నాయి.

28, ఫిబ్రవరి శనివారం ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి గరుడ వాహన సేవలు జరగనున్నాయి.

మార్చి 1, ఆదివారం ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం జరుగుతుంది. తిరిగి సాయంత్రం కల్యాణోత్సవం జరుగుతుంది.

మార్చి 2, సోమవారం ఉదయం రథోత్సవం, రాత్రి ధూళి ఉత్సవం జరుగుతుంది.

మార్చి 3, మంగళవారం ఉదయం రథోత్సవం జరుగుతుంది. ఈ రోజు రాత్రి చంద్ర గ్రహణం కారణంగా ఉత్సవ నిర్వహణ జరగకపోవచ్చు.

మార్చి 4, బుధవారం ఉదయం వసంతోత్సవం అనంతరం చక్రస్నానం జరుగుతాయి. అదే రోజు రాత్రి జరిగే ధ్వజావరోహణం కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

తరిగొండ శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలకు మనం కూడా తరలి వెళ్దాం. బ్రహ్మోత్సవ వైభవాన్ని కళ్లారా వీక్షిద్దాం.ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాలలో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# ప్రభుత్వ కార్యాలయం - ప్రభుత్వ బిల్డింగ్ లోనే నిర్వహించాలి



**సూర్యాపేట జిల్లా :** సూర్యాపేట సబ్ – రిజిస్టర్ కార్యాలయం ఎన్నో ఏళ్ల తరబడి అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు, ఇటీవల భవన యజమాని ఖాళీ చేయమని సంబంధిత అధికారులకు తెలియ జేసినట్లు సమాచారం ప్రభుత్వం ప్రభుత్వ కార్యకలాపాలు ప్రైవేట్ బిల్డింగుల్లో నిర్వహించకూడదని జీవో జారీ చేశారు, అయినా సూర్యాపేట సబ్ రిజిస్టర్ కార్యాలయం మార్పునకు నోచుకోలేక పోతుంది, సూర్యాపేట వినియోగదారుల సంఘము అధ్యక్షులు చెరుకు శ్రీనివాస్ జిల్లా కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు, కలెక్టర్ స్పందిస్తూ ఇంటిగ్రేటెడ్ మార్కెట్లోకి మార్చుకోవాలని గతంలోనే సూచించారు, రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని మార్చటానికి ముహూర్తం ఖరారు కావట్లేదు, ఏదో ఒక అడ్డంకి సర్పంచ్ ఎలక్షన్లు తర్వాత మున్సిపల్ ఎలక్షన్లు ఇలా కాలయాపన జరుగుతుంది, ఇట్టి వినతి పత్రంపై దస్తావేజు రైటర్లు వర్షం వ్యక్తం చేశారు. డిస్టిక్ రిజిస్టర్, సూర్యపేట సబ్ – రిజిస్టార్ ఎప్పుడు స్పందిస్తారో ఏంటో మరి వేచి చూడాలి మరి....

# గ్రామ స్థాయి పాలనలో వార్డు సభ్యుల పాత్ర కీలకం.

**పేట ఎంపీడీవో క్రాంతి కుమార్.**






**నారాయణఖేడ్ డివిజన్ రిపోర్టర్ ,పెద్ద శంకరంపేట..** గ్రామస్థాయి పాలనలో వార్డు సభ్యుల పాత్ర ఎంతో కీలకమని పెద్ద శంకరంపేట ఎంపీడీవో క్రాంతి కుమార్ పేర్కొన్నారు. సోమవారం పెద్ద శంకరంపేట లోని రైతు వేదికలో నిర్వహించిన నూతన వాడు సభ్యుల శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. వార్డు సభ్యులందరూ ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను గ్రామాల అభివృద్ధిలో పాటుపడేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ షాకిర్ అలీ. సూపర్ ట్రైనర్లు లింగప్ప ప్రవీణ్ భాష ఆయా గ్రామాల నుండి వచ్చిన వాడు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పేటలో సంబరాలు.



**నారాయణఖే డివిజన్ రిపోర్టర్ పెద్ద శంకరంపేట.** భారత్ టి20 వరల్డ్ కప్ గెలుపొం దడంతో పెద్ద శంకరపేటలో ఆదివారం అర్ధరాత్రి అభిమానులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.. మూడోసారి భారత్ 20 వరల్డ్ కప్ గెలుపొంద పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో యువకులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



**నారాయణఖేడ్ డివిజన్ రిపోర్ట్ ,పెద్ద శంకరంపేట.** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐకెపి సిఆర్పిలు సుజాత రాధికలు పేర్కొన్నారు. సోమవారం పెద్ద శంకర్పేటలోని శ్రీ శక్తి భవనంలో నిర్వహించిన మహిళా సమైక్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మహిళలు స్వయం సహాయ సంఘాల ద్వారా వదిన రుణాలు సద్వినియోగం చేసుకోవాలని. అనంతరం బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఈపీఎం శకుంతల సీసీలు వీరాచారి స్వరూప అనసూయ మహిళా సంఘాల బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దృఢమైన యువత -- బలమైన భారత్ లక్ష్యంతో "ప్రధాన్ మంత్రి సంసద్ ఖేలో

## క్రీడా పోటీల పోస్టర్ ఆవిష్కరణ, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

**షాద్ నగర్ :** పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ గారి నేతృత్వంలో నిర్వహించనున్న "ప్రధాన్ మంత్రి సంసద్ ఖేలో" క్రీడా పోటీల పోస్టర్ ఆవిష్కరణతో పాటు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం షాద్‌నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వంశీకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆలోచనలతో ప్రారంభమైన "సంసద్ ఖేలో" కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సాహం అందించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. క్రీడల ద్వారా



యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందించి బలమైన భారత దేశ నిర్మాణానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. పాలమూరు పార్లమెంట్ పరిధిలో నిర్వహించనున్న ఈ క్రీడా పోటీలలో కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో వంటి క్రీడలు నిర్వహించబడనున్నాయని తెలిపారు. 16 సంవత్సరాలు పైబడిన యువకులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మార్చి 9 నుండి 24వ తేదీ వరకు జట్ల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ జరుగుతుందని, అలాగే ఏప్రిల్ 9 నుండి 24వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహించ బడనున్నాయని తెలిపారు. కాబట్టి యువకులు మరియు క్రీడాకారులు పెద్ద ఎత్తున ఆన్‌లైన్ ద్వారా జట్లు నమోదు చేసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అశోక్ గౌడ్, మురళి, మల్చం ఇస్నత్, శ్రీనివాస్, శ్రీనివాస్ చారి, మోహన్ సింగ్, లక్ష్మీకాంత్ రెడ్డి, ప్యాట అశోక్, లష్కర్ నాయక్, మహేందర్ రెడ్డి, రాజు, వడ్ల అరవింద్, మఠం ఋషి కేష్, సుధాకర్ అప్పా, క్యామ మహేష్, రాజేశ్వరి, సందీప్ యాదవ్, వినోద్ నాయక్, మహేష్, రఘు గౌడ్, రామకృష్ణ యాదవ్, అనిల్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, గజ్జల ప్రవీణ్, బల్ రెడ్డి, భాస్కర్ పటేల్, కొత్త సతీష్ తదితరులు పాల్గొన్నారు..

# రామడుగు రైతు వేదికలో సమగ్ర వ్యవసాయం,రికగ్నిషన్ ప్రయర్ లర్నింగ్ (ఆర్. పి. ఎల్ )శిక్షణ కార్యక్రమం :

**హాలియా 10/03/26:** 1.సమగ్ర వ్యవసాయం2 నానో ఎరువుల వాడకం పై అవగాహన,3.అనుకూలమైన విత్తన వంగడాలు,4. నూనె జాతి పంటలపై అవగాహన కార్యక్రమలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు ఎమ్.సరిత గారు మాట్లాడుతూ, యూరియా సరైన సమయంలో అందుబాటులో లేకపోతే నానో యూరియా స్ప్రే చేసుకోవడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చని రైతులకు వివరించారు. అధిక మోతాదులో యూరియా వినియోగం వలన పురుగులు, తెగుళ్ల పెరగడంతో పాటు నేల, నీరు మరియు వాతావరణం కాలుష్యం అవుతుందని, దాని ప్రభావం మనుషుల ఆరోగ్యంపై కూడా పడే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల రైతులు నానో ఎరువులను స్ప్రే చేసుకోవాలని సూచించారు. నానో ఎరువుల వినియోగం వలన రైతుల ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుందని చెప్పారు.. అదేవిధంగా ఆర్ . సుకేష్, అసిస్టెంట్



మేనేజర్( ఏ.ఇ.పి.ఇ.డి. ఏ )గారు మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులు విదేశాలలో ఉన్నటువంటి డిమాండ్ ను రైతులకు వివరించడం జరిగింది. అదేవిధంగా మండల



వ్యవసాయ అధికారి ఎమ్.వెంకన్న గారు మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. అనంతరం భుసార పరీక్షలు చేసిన రైతులకు సాయిల్ హెల్త్ కార్డ్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మజ్జిగపు నర్సిరెడ్డి,చింతగూడెం సర్పంచ్ తగుళ్ల అంజయ్య ఉపసర్పంచ్ జి . నాగమణి గారు, వ్యవసాయ విస్తరణ అధికారి వి .దుర్గాభవాని పంచాయతీ కార్యదర్శి గిరి మరియు గ్రామ రైతులుడ మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.


# నర్మదా హోండా దందాపై 'ఆర్టీవో' ఉక్కుపాదం: షోరూం లైసెన్స్ రద్దుకు రంగం సిద్ధం!

**'సంతకం పెట్టాలంటే 700 ఇవ్వాల్సిందే' అన్న షోరూం మేనేజర్.. ఆర్టీవో సీరియస్!**
**బ్రోకర్ మాఫియాకు అడ్డుకట్ట పడేది ఎప్పుడు?**
**'వార్త' కథనానికి అదిరిపోయే స్పందన.. అధికారుల ముందు బాధితుడి ఫిర్యాదు!**

**షాద్ నగర్ షాద్‌నగర్, మార్చి 10:** షాద్‌నగర్ పట్టణంలోని నర్మదా హోండా షోరూం కేంద్రంగా సాగుతున్న అక్రమ వసూళ్ల దందాపై 'వార్త' పత్రికలో ప్రచురితమైన కథనం అధికార యంత్రాంగంలో ప్రకంపనలు సృష్టించింది. సామాన్య వాహనదారుల నుండి రిజిస్ట్రేషన్ పేరుతో సాగుతున్న దోపిడీని, అధికారుల పేరు చెప్పి చేస్తున్న వసూళ్లను ఎండగట్టిన తీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీవో సంతకం కావాలంటే లంచం ఇవ్వాల్సిందేనా? బాధితుడు రవితేజ ఈరోజు ఆర్టీవో అధికారులను కలిసి షోరూం మేనేజర్ తనను ఏ విధంగా బెదిరించాడో పూసగుచ్చినట్లు వివరించారు. రిజిస్ట్రేషన్ కోసం అదనంగా రూ. 700 ఎందుకు ఇవ్వాలని రవితేజ ప్రశ్నించగా, షోరూం మేనేజర్ అత్యంత దురుసుగా సమాధానం చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. "ఆర్టీవో అధికారి సంతకం పెట్టాలంటే ఈ 700 రూపాయలు ఇవ్వాల్సిందే.. నువ్వు డబ్బులు ఇవ్వకపోతే ఆయన సంతకం పెట్టడు, రిజిస్ట్రేషన్ కాదు.. ఏం చేసుకుంటావో చేసుకో" అంటూ మేనేజర్ తనను భయభ్రాంతులకు గురిచేసినట్లు బాధితుడు అధికారులకు వివరించారు. నా పేరు వాడుకుంటారా? – అగ్గిమీద గుగ్గిలమైన అధికారి! తమ పేరు చెప్పి షోరూం నిర్వాహకులు వసూళ్లకు పాల్పడుతున్నారని తెలుసుకున్న ఆర్టీవో అధికారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయం గౌరవానికి భంగం కలిగించేలా, అధికారులపై తప్పుడు నిందలు వేస్తూ డబ్బులు వసూలు చేయడం క్షమించరాని నేరమని ఆయన మండిపడ్డారు. ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపి, సదరు మేనేజర్‌పై



మరియు షోరూం యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. "మా పేరు చెప్పి ప్రజలను దోచుకుంటే ఊరుకోం. నర్మదా హోండా షోరూం అక్రమాలపై పూర్తి స్థాయి రిపోర్ట్ సిద్ధం చేస్తున్నాం. బాధితుడికి న్యాయం చేయడంతో పాటు, దోపిడీకి పాల్పడిన వారి ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసే దిశగా చర్యలు తీసుకుంటాం" అని ఆర్టీవో స్పష్టం చేశారు. వణికిపోతున్న షోరూం మాఫియా మరియు బ్రోకరు 'వార్త' పత్రిక కథనంతో అక్రమాలకు పాల్పడుతున్న ఇతర షోరూం నిర్వాహకుల్లో కూడా వణుకు మొదలైంది. ఆర్టీవో అధికారులు స్వయంగా రంగంలోకి దిగడంతో ఇన్నాళ్లూ గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న 'కమీషన్ల పర్వం'కు అడ్డుకట్ట పడినట్లయింది. ప్రజలెవరూ అదనపు సొమ్ము చెల్లించవద్దని, ఎవరైనా అధికారుల పేరు చెప్పి డబ్బులు అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. బ్రోకర్ మాఫియాకు అడ్డుకట్ట పడేది ఎప్పుడు? ప్రభుత్వ సేవలను సామాన్యులకు చేరువ చేయడంలో పారదర్శకత ఉండాలని నిబంధనలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం 'బ్రోకర్ మాఫియా' రాజ్యమేలుతోంది. షోరూంల నుండి ఆర్టీవో కార్యాలయాల వరకు సాగుతున్న ఈ అక్రమ వసూళ్ల గొలుసును







తెంచేది ఎప్పుడు? అనే ప్రశ్న వినిపిస్తోంది. ఒక సాధారణ వాహనదారుడు తన కష్టార్జితంతో కొనుక్కున్న బండికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే, ఇలాంటి దళారులకు తలవొంచి అదనపు సొమ్ము చెల్లించాల్సి రావడం సిగ్గుచేటు. అధికారుల పేర్లు చెప్పి సామాన్యులను భయపెడుతున్న ఇలాంటి 'షోరూం దళారుల'పై కేవలం విచారణలు మాత్రమే కాకుండా, కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటేనే ఈ మాఫియాకు అడ్డుకట్ట పడుతుంది. అప్పుడే సామాన్యుడికి నిజమైన న్యాయం జరుగుతుంది.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రజలకు సూచించారు

**సూర్యాపేట జిల్లా మార్చి 09:** ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డుల్లో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పారిశుధ్య కార్మికులతో కలిసి చెత్త తొలగింపు కార్యక్రమంలో పాల్గొని శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు క్రమం తప్పకుండా ఇవ్వాలని ప్రజలకు సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఆయన



సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వార్డుల్లో పర్యటించి కాలనీల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రపరచడం, రోడ్లను శుభ్రంగా ఉంచడం వంటి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా మరియు



అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు మరియు ప్రజలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నోరూరించే ఊర్లు

స్వీట్ షాపులో తయారయ్యే..
తియ్యటి కరకరలాడే 'మైసూరు పాక్'
బజారు సందుల్లో దొరికే..
రుచికరమైన 'బాంబే రవ్వా' వంటకాలు
మనోళ్లు గరిటె తిప్పి తయారు చేసే..
నోరూరించే 'కశ్మీరీ కలాకంద్?' రుచులు
మన పెనంలో ఉప్పొంగే గుండ్రటి..
అల్పాహార 'మైసూరు బొండాలు'
మనోళ్లు తయారు చేసే..
తియ్యతియ్యటి 'కాకినాడ కాజాలు'
సిల్వర్‌ను పోలిన పేపర్ స్వీట్లు..
'ఆత్రేయపురం పూతరేకుల' తియ్యదనాలు
మన లంగర్‌లో వండే..
మజా మజా 'హైదరాబాద్ బిర్యానీ'
మసాలా దిట్టంగా పట్టించి వండే..
'మలబార్ కోడి కూర' ఘాటులు
వీధి వీధుల్లో ఘుమఘుమల..
రుచికరమైన 'అంకాపూర్ చికెన్'
మన చౌరస్తా మూలన వెలసిన..
'ఉడిపి హోటల్' ఇడ్లీ సాంబారు
ఏడు కొండల వెంకన్న పంచిన..
'తిరుపతి లడ్డూ' ప్రసాదాలు
పేరు ప్రఖ్యాతులు గాంచిన..
నోరూరించే 'బందరు లడ్డు'
గల్లీ హోటల్‌లో దొరికే..
'ఇరానీ చాయ్' ఘుమఘుమలు
ఇరానీ చాయ్‌లో ముంచి తినే..
నోరూరించే 'ఉస్మానియా బిస్కెట్లు' !

మధుపాళీ

# శ్రమజీవుల పని ప్రదేశంలో భద్రత మన కనీస కర్తవ్యం

### (04-10 మార్చి "జాతీయ భద్రత వారోత్సవాలు" సందర్భంగా)

మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎస్ఎల్‌బిసి సొరంగం పనుల్లో నిమగ్నమై ప్రమాదం జరగడంతో ఎనిమిది మంది విగత జీవులు అయ్యారనే వార్త విని అందరం షాక్‌కు గురి అయ్యాం. భద్రీనాథ్ సమీపాన మంచును తొలగించే పనిలో నిమగ్నమైన 55 మంది సిబ్బంది గ్రేసియర్ విరిగిపడిన ఘటనలో 55 మంది మంచులో చిక్కుకున్నట్లు, అందులో 50 మందిని కాపాడినట్లు, నలుగురు మరణించి ఉంటారని, మరో ఐదుగురి ఆచూకీ దొరకలేదని తెలిసి విచారం వ్యక్తం చేశాం. ఈ విధమైన దుర్ఘటనలు తరుచుగా జరగడం సర్వసాధారణం కావడం సోచనీయం. ఇలా పని ప్రదేశాల్లో లేదా పరిశ్రమల్లో పని చేస్తున్న శ్రామికులు భద్రత కొరవడిన కారణంగా పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురి కావడం లేదా ప్రాణాలు సహితం కోల్పోవడం జరుగుతున్నది.

జాతీయ భద్రత వారోత్సవాలు-2026 ఇతివృత్తం :

పని ప్రదేశాల్లో ఇలాంటి ప్రాణాపాయ సంఘటనలను నివారించడానికి వృత్తిపరమైన భద్రత అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని భావించి 04 మార్చి 1966న "నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా" ఏర్పడటానికి గుర్తుగా 1972 నుంచి ప్రతి ఏట "జాతీయ భద్రత వారోత్సవం" లేదా "నేషనల్ సేఫ్టీ వీక్"ను 04 నుంచి 10 మార్చి వరకు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 2026 జాతీయ భద్రత వారోత్సవాల ఇతివృత్తంగా "భద్రత పెంపొందించడానికి అవగాహన, సాధికారత కల్పన, భద్రతలో నిమగ్నం చేద్దాం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. వృత్తిపరంగా పని చేసే పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగకుండా, ప్రమాదాలు జరిగినపుడు స్వల్ప నష్టాలు కూడా నమోదు కాకుండా ఉండడానికి కార్మికులకు అవసరమైన భద్రత పట్ల అవగాహన కల్పించడం, భద్రతా చర్యలను పెంచడం, ఉద్యోగులు, పౌర సమాజానికి కనీస అవగాహన కల్పించడమే లక్ష్యంగా జాతీయ భద్రత దినోత్సవం జరుపుకోవడం కొనసాగుతున్నది. జాతీయ భద్రత వీరోత్సవంతో పాటు "జాతీయ భద్రత దినోత్సవం"(నేషనల్ సేఫ్టీ డే)"ను కూడా 04 మార్చి రోజున నిర్వహిస్తున్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలను సుసాధ్యం చేయడానికి వృత్తిపరమైన భద్రత కనీస అవసరం అని తెలుసుకుందాం. వృత్తిపరమైన భద్రత చర్యలు, ప్రమాదాల నివారణ జాగ్రత్తలు, సంబంధిత వర్గాలకు అవగాహనతో పాటు అవసర శిక్షణ కార్యక్రమాలను చర్చించడానికి జాతీయ భద్రత వారోత్సవాల వేదికలు గత 55 ఏండ్లుగా ఉపయోగపడుతున్నాయి. నేటి డిజిటల్ యుగంలో పని ప్రదేశాలను సురక్షిత కేంద్రాలుగా మార్చడానికి నడుం బిగిద్దాం, స్వల్ప గాయాలు కూడా నమోదు కాని పరిస్థితులను కల్పిద్దాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# రెడ్డి కార్పొరేషన్ కు వెంటనే నిధులు కేటాయించాలి

### ఏప్రిల్ లో కరీంనగర్ రెడ్డి బహిరంగ సభ
### రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతిరెడ్డి



కరీంనగర్ : పేద రెడ్డి యువత కు ఉపాధి అవకా శాలు కల్పించాలని రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించకుండా, పాలకవర్గాన్ని ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వెంటనే రెడ్డి కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు . ఈ మేరకు తిరుపతి రెడ్డి మీడియాకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. నెల రోజులలో కార్పొరేషన్ ఏర్పాటు చేయక పోతే ఎప్రిల్ నెల చివరి వారంలో కరీంనగర్ లో రెడ్డి ఐక్య వేదిక ఆధ్వర్యంలో అన్ని రెడ్డి సంఘాలను కలుపుకొని రెడ్ల రణ భేరి పేర బహిరంగ సభ నిర్వహిస్తామని, ప్రభుత్వానికి తమ శక్తి చాటి చెప్తామన్నారు..కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారం లోకి వచ్చిన వెంటనే రెడ్డి కార్పొరేషన్ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడం జరిగింది. కానీ రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు నిధులు కేటాయించకుండా, పాలకవర్గాన్ని ఏర్పాటు చేయలేదని, వెంటనే పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి రూ.2000 కోట్లతో ప్రత్యేక నిధిని కేటాయించాలని ఆయన కోరారు. కార్పొరేషన్ పై ప్రభుత్వం స్పందించకపోతే కార్పొరేషన్ నిధుల సాధన లక్ష్యంగా ఏప్రిల్ మాసంలో భారీ బహిరంగ సభకు సన్నద్ధం మవుతున్నట్లు తెలిపారు .

# తీరప్రాంతాల భద్రతతో సుసంపన్న భారతం

### (10 మార్చి "సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం" సందర్భంగా)

10 మార్చి 1969న "కేంద్రీయ పారిశ్రామిక భద్రత దళం" లేదా "సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)" చట్టం ద్వారా ఏర్పడడంతో ప్రతి ఏట 10 మార్చిన "సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. కేంద్ర ప్రభుత్వ ప్రధాన సంస్థలైన విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, పవర్ ప్లాంట్లు, మెట్రో వర్క్స్, పారిశ్రామిక మౌళిక వనరులు, చమురు రిఫైనరీలు, స్టీల్ల ప్లాంట్లు, తీవ్రవాద అదుపు, సైబర్ భద్రత, అత్యవసర సేవలు, విప్పి భద్రత, ప్రభుత్వ సంస్థలు లాంటి పలు ప్రధాన భద్రతా విధులను నిర్వహిస్తున్న సిఐఎస్ఎఫ్ సేవలు అనిర్వచనీయం. ప్రారంభంలో 2,800 మంది సిబ్బందితో మొదలైన సిఐఎస్ఎఫ్ నేడు 1,48,371 మందితో అమూల్య భద్రత సేవలను విస్తరిస్తున్నారు. సిఐఎస్ఎఫ్ సిబ్బంది అంకితభావం, ధైర్య సాహసాలు, త్యాగాలను సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం వేదికగా గుర్తించడం జరుగుతుంది.

57వ సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం :

ప్రభుత్వరంగ సంస్థలతో పాటు ముఖ్య పరిశ్రమలకు నిరంతరం భద్రతను కల్పిస్తున్న సిబ్బంది నిస్వార్థ సేవలను ప్రస్తుతించడం మన కనీస కర్తవ్యం అని సదా భావించాలి. నేడు నిర్వహిస్తున్న 57వ సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం-2026 ఇతివృత్తంగా "తీర ప్రాంత భద్రత, సుసంపన్న భారతం (సెఫ్ కోస్ట్: ప్రాస్పరస్ భారత్)" అనబడే అంశం తీసుకొని ప్రచారం చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా గుజరాత్, పశ్చిమ బెంగాల్‌ల నుంచి రెండు జట్లుగా 125 మంది సైక్లిస్టులు 6,553 కిమీ సైరిల్ ర్యాలీని 07 మార్చి నుంచి 31 మార్చి వరకు నిర్వహించి చివరకు కన్యాకుమారి చేరనున్నారు.సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం వేదికగా వీరులకు సన్మానాలు, అవార్డుల వితరణలు, పెరెడ్లు, ప్రసంగాలు, కార్యశాలలు, అవగాహన కార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. ఇదే వేదికగా యువతను భద్రతా సేవల వైపు ఆకర్షించడంతో పాటు ఆయా రంగాల్లో దాగిన ప్రమాదాలను కూడా అవగాహన చేసుకోవాలని ప్రచారం చేస్తారు. దేశ పౌరులు ఏ బాధ్యతాయుత విధులు నిర్వహించినా వారికి తగిన గుర్తింపుతో పాటు దేశాభివృద్ధి జరుగుతుందని గమనించాలి. సిఐఎస్ఎఫ్ సంస్థ సిబ్బంది సేవలను గుర్తిస్తూ, వారికి మన సంఘీభావాన్ని తెలియజేద్దాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# గండి పోచమ్మ అమ్మవారి ఆలయానికి యధావిధిగా రాకపోకలు........

**దేవీపట్నం :** పోలవరం జిల్లా దేవీపట్నం మండలం లో దండింగి నుండి రావిలంక, నాగళ్ళపల్లి గ్రామాలు మీదుగా గండి పోచమ్మ తల్లి అమ్మవారి ఆలయానికి వాహనాలు రాకపోకలు యధావిధిగా జరుగుతున్నా యి. గోదావరి నదిలో నీటిమట్టం పెరిగితే దండింగి వద్ద రోడ్డు మునిగిపోతుంది. వాహనాలు వెళ్ళవు. ప్రస్తుతం నదిలో నీటిమట్టం భారీగా తగ్గడంతో నీరు తగ్గి, వాహనాలు ప్రయాణించేందుకు అనుకూలంగా ఉంది.



# లక్ష్మీపురం గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించాలి ఏపీ ఆదివాసీ జేఏసీ డిమాండ్

### వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు తక్షణమే స్పందించి మంచినీటి సౌకర్యం కల్పించాలి. లక్ష్మీపురం గ్రామానికి మౌలిక వసతులు తక్షణమే కల్పించాలి.

**దేవీపట్నం :**ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం,దేవీపట్నం మండలం, వి. రామన్నపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామం లో సుమారు 89 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్ళు అవుతున్నప్పటికీ ఈ గ్రామానికి మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయన్నారు.ఈ గ్రామంలో మూడు చేతి పంపులు



ఉన్నప్పటికీ పనిచేయటం లేదన్నారు.గత ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా వాటర్ ట్యాంకు నిర్మించి 45 కుటుంబాలకు ఇంటింటికీ కుళాయిలు వేసినప్పటికీ నేటికీ ప్రారంభించలేదన్నారు.అలాగే గ్రామంలో వీధి లైట్లు ఉన్న వెలగడం లేదన్నారు.ఈ గ్రామంలో వీధి వీధికి సిసి రోడ్లు లేవన్నారు.గుంపెనపల్లి వెలగపల్లి గ్రామాల మధ్యలో ఉన్న కాలువకు బ్రిడ్జి నిర్మించి బీటీ రోడ్డు సౌకర్యం లక్ష్మి పురం గ్రామం నుండి కన్నారం గ్రామం వరకు కల్పించి అంబులెన్స్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.వర్షాకాలం వస్తే ఈ ప్రజలు హాస్పిటల్ కి వెళ్లాలంటే ఏడు సముద్రాలు దాటి వెళ్ళినంత పని అవుతుందన్నారు.కావున కాలువకు తక్షణమే బ్రిడ్జి నిర్మించాలని మరియు ప్రస్తుతం లక్ష్మీపురం గ్రామ ప్రజలు 3 మంచినీటి బోర్లు పనిచేయకపోవడంతో మంచినీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతు అల్లాడుతున్నరన్నారు.ఈ గ్రామానికి జిల్లా కలెక్టర్,ఏపీ ఎస్టి కమిషన్ చైర్మన్ వారు సందర్శించి తక్షణమే మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు గ్రామానికి మౌలిక వసతులు తక్షణమే కల్పించేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు.

# ఉత్తమ ఫలితాలు సాధనే ఏపీ ఆదివాసీ జేఏసీ,ఏ.టి.ఏ లక్ష్యం





**దేవీపట్నం :**మండల పరిధిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర నాయకులు తెల్లం శేఖర్,కారం రామన్న దొర,ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏ.టి.ఏ) మండల నాయకులు చిచ్చడి శేషారావు,సోడే కన్నం రాజు పరీక్ష కిట్టు అందజేశారు.ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ... పోలవరం జిల్లా,రంపచోడవరం నియోజకవర్గం,దేవీపట్నం మండలం, ఇందుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల పదో తరగతి చదువుతున్న 18 మంది విద్యార్థులకు పరీక్ష కిట్టు అందజేశావ న్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్ మాట్లాడుతూ...పదో తరగతి విద్యార్థులు దేవీపట్నం మండలాన్ని రాష్ట్రస్థాయిలో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ (ఏ.టి.ఏ) మండల నాయకులు చిచ్చడి శేషరావు,సోడే కన్నం రాజు మాట్లాడుతూ...విద్యార్థులు మీ యొక్క సమయాన్ని సద్వినియోగం చేసుకొని పాఠశాలకు మరియు మీ యొక్క తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు.

# పార్టీ కోసం అహర్నిశలు... పదవుల కోసం కాదు

### -జనసేన రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య





**సిద్ధవటం,మార్చి 9 :**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పదవులు,ప్రాధాన్యతల కోసం పోటీ పడే నాయకులు చాలామంది కనిపిస్తుంటారు. అయితే కొంతమంది నాయకులు మాత్రం పార్టీ సిద్ధాంతాలకే ప్రాధాన్యత ఇస్తూ, నిస్వార్థంగా సేవ చేస్తూ ప్రత్యేకంగా నిలుస్తారు. అలాంటి నాయకుల్లో జనసేన పార్టీ సీనియర్ నాయకుడు రాటాల రామయ్య ఒకరు. పార్టీ ఆవిర్భావం జరిగిన రోజునుంచి ఇప్పటివరకు ఆయన ఒక సాధారణ కార్యకర్తగా, పార్టీ సైనికుడిగా పనిచేస్తూ జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.ఆవిర్భావం నుంచే పార్టీతో ప్రయాణం జనసేన పార్టీ స్థాపన జరిగిన తొలి రోజుల నుంచే రాటాల రామయ్య పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. పార్టీ ప్రారంభ దశలోనే ఎన్నో సవాళ్లు ఎదురైనా ఆయన వెనుదిరగలేదు. గ్రామస్థాయి నుంచి ప్రజల్లోకి వెళ్లి పార్టీ లక్ష్యాలను వివరించడం, యువతను ఆకర్షించడం, సామాన్య ప్రజల్లో విశ్వాసం కల్పించడం వంటి కార్యక్రమాల్లో ముందుండి పనిచేశారు.ఇంటింటి పవన్ అన్న ప్రజాబాటలో 185 రోజుల పర్యటన జనసేన పార్టీ నిర్వహించిన "ఇంటింటి పవన్ అన్న –– ప్రజాబాట" కార్యక్రమంలో రాటాల రామయ్య కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమం భాగంగా ఆయన ఆరు మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ 185 రోజుల పాటు ప్రజలతో మమేకమయ్యారు.గ్రామాల నుంచి పట్టణాల వరకు ఇంటింటికీ వెళ్లి పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజలకు వివరించారు. సాధారణ ప్రజల సమస్యలను వినిపించి పార్టీ నాయకత్వానికి తెలియజేయడంలో ఆయన చురుకుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమం ద్వారా జనసేన పార్టీని ఇంటింటికీ చేర్చడంలో తనవంతు పాత్రను సమర్థంగా పోషించారు.పార్టీ పట్ల ఉన్న నిబద్ధతతో ఆయనను జనసేన నాయకత్వం గుర్తించి బాధ్యతలు అప్పగించింది.రాష్ట్ర స్థాయి బాధ్యతలు ప్రస్తుతం రాటాల రామయ్య జనసేన పార్టీ రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. చేనేత కార్మికుల సమస్యలు, వారి ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం దృష్టి సారించాలనే ఉద్దేశంతో పార్టీ తరఫున అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చేనేత రంగానికి ప్రోత్సాహం లభించాలనే లక్ష్యంతో పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.పదవుల కోసం కాకుండా పార్టీ కోసంరాజకీయాల్లో సాధారణంగా పదవుల కోసం పోటీ పడటం సహజమే. కానీ రాటాల రామయ్య మాత్రం పదవుల కంటే పార్టీని ముందుగా ఉంచే నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం జనసేన పార్టీ కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ, ఆయన ఎటువంటి పదవులు ఆశించలేదు. పార్టీ బలోపేతమే తన లక్ష్యమని స్పష్టంగా చెబుతుంటారు. "పదవులు వచ్చి పోతాయి... పార్టీ బలపడటం ముఖ్యము" అనే భావనతో ఆయన తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికలో విధేయత ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల సమయంలో రాటాల రామయ్య నామినేషన్ దాఖలు చేశారు. అయితే పార్టీ ఉన్నత నాయకత్వం ఇచ్చిన ఆదేశాలను గౌరవిస్తూ తన నామినేషన్‌ను ఉపసంహరించుకు న్నారు.ఈ నిర్ణయం ద్వారా పార్టీ పట్ల తన విధేయతను స్పష్టంగా చూపించారు. వ్యక్తిగత ఆశయాల కంటే పార్టీ నిర్ణయాలకే ప్రాధాన్యం ఇవ్వడం ఆయన రాజకీయ ధోరణికి నిదర్శనం. సభ్యత్వ నమోదులో కీలక పాత్ర జనసేన పార్టీ సభ్యత్వ నమోదులో కూడా రాటాల రామయ్య కీలక పాత్ర పోషించారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు తిరుగుతూ వేలాది మందిని పార్టీ సభ్యత్వంలో చేర్పించారు. ప్రత్యేకంగా యువతను పార్టీ వైపు ఆకర్షించడంలో ఆయన చేసిన కృషి పార్టీ నాయకత్వం ప్రశంసలు అందుకుంది.అసంతృప్తి లేని నాయకుడు రాజకీయాల్లో కొత్తగా పార్టీలో చేరినవారికి పదవులు లభించడం సాధారణమే. అలాంటి సందర్భాల్లో అనేక మంది పాత నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తుంటారు.కానీ రాటాల రామయ్య మాత్రం అలాంటి భావనలకు తావు ఇవ్వలేదు. "పార్టీ ముఖ్యం... వ్యక్తులు కాదు" అనే సిద్ధాంతంతో ఆయన పార్టీ పట్ల సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని ఆయన ఎప్పటికప్పుడు పిలుపునిస్తున్నారు.పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావడం లక్ష్యం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పట్ల రాటాల రామయ్యకు అపారమైన అభిమానంతో పాటు విశ్వాసం ఉంది. పవన్



కల్యాణ్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చూడటమే తన జీవితాశయమని ఆయన తరచూ చెబుతుంటారు. ఆ లక్ష్యం నెరవేర్చడానికి పార్టీ బలోపేతం కోసం తన శక్తి వంచన లేకుండా పనిచేస్తానని అంటున్నారు.నిస్వార్థ సేవే ప్రత్యేకత పార్టీ సిద్ధాంతాల కోసం అహర్నిశలు కష్టపడే నాయకులు రాజకీయాల్లో అరుదుగా కనిపిస్తారు. అలాంటి అరుదైన నాయకుల్లో రాటాల రామయ్య ఒకరు.వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా పార్టీ కోసం పనిచేస్తూ, కార్యకర్తల మధ్య ఆదర్శంగా నిలుస్తున్నారు. జనసేన పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు, చూపుతున్న విధేయత పార్టీ కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. రాజకీయాల్లో నిస్వార్థ సేవ, పార్టీ పట్ల విధేయత, నాయకత్వంపై అపారమైన విశ్వాసం కలిగిన నాయకుడిగా రాటాల రామయ్య ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ఆయన తన రాజకీయ ప్రయాణాన్ని అంకితభావంతో కొనసాగిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో పార్టీ కోసం పనిచేస్తూ జనసేన బలోపేతానికి కృషి చేస్తానని రాటాల రామయ్య స్పష్టం చేస్తున్నారు.

# కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు మృతి పట్ల టిడిపి జిల్లా అధ్యక్షులు బడేటి చంటి సంతాపం..

**ఏలూరు, మార్చి 9.** కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు మృతి పట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సంతాపం తెలిపారు. ఐదుసార్లు ఎంపీగా పనిచేసిన కావూరి సాంబశివరావు రెండుసార్లు ఏలూరు ఎంపీగా విజయం సాధించి కేంద్ర మంత్రిగా కూడా పనిచేసి విశేష సేవలు అందించారని ఆయన పేర్కొన్నారు. ఆయన మృతి తనకు దిగ్భ్రాంతి కలిగించిందని టిడిపి అధ్యక్షులు బడేటి చంటి ఒక ప్రకటనలో పేర్కొంటూ కావూరి సాంబశివరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# తిలక్ వర్మకు తెలంగాణ సర్కార్ బంపర్ ఆఫర్!



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా విజేతగా నిలిచింది. అద్వితీయమైన ప్రదర్శనతో సరికొత్త చరిత్రను లిఖించింది. డిఫెండ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకోవడంతో పాటు సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టుగా చరిత్రకెక్కింది. అహ్మదాబాద్ వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్ పోరులో బ్యాట్‌తో పరుగుల వరద పారించి, బంతితో అలవోకగా న్యూజిలాండ్‌ను పడగొట్టేసిన సూర్యకుమార్ బృందం విశ్వవిజేతగా నిలిచింది. ఈ విజయం నేపథ్యంలో భారత ఆటగాళ్లపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) కూడా మరికాసేపట్లో భారీ నజరానాను ప్రకటించనుంది. ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, క్రికెట్ అసోసియేషన్స్ కూడా తమ ఆటగాళ్లపై కనకవర్షం కురిపించనున్నాయి. ఈ క్రమంలోనే తెలంగాణకు చెందిన స్టార్ బ్యాటర్ తిలక్ వర్మకు కూడా కాంగ్రెస్ సర్కార్ నుంచి భారీ బహుమతి లభించనున్నట్లు క్రీడా వర్గాల్లో వార్తలు షికారు చేస్తున్నాయి. హైదరాబాద్ నుంచి టీ20 ప్రపంచకప్ విజయంలో భాగమైన తిలక్ వర్మ, సిరాజ్‌లను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా సన్మానించనున్నట్లు తెలుస్తోంది. సిరాజ్‌కు గతంలోనే భారీ రివార్డ్ ప్రకటించిన నేపథ్యంలో తిలక్ వర్మకు ఈ సారి భారీ నజరానాతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి ఈ విషయాలు అధికారికంగా వెల్లడి కాకపోయినా.. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రపంచకప్ గెలిచిన తిలక్ వర్మ, సిరాజ్ ప్రస్తుతం జట్టుతో అహ్మదాబాద్‌లోనే ఉన్నారు. ప్రధాని నరేంద్ర మోదీని భారత జట్టు కలిసే అవకాశం ఉంది. ఆ తర్వాత బీసీసీఐ నిర్వహించే విజయోత్సవ వేడుకల్లో జట్టు పాల్గొననుంది. బుధవారం లేదా గురువారం తిలక్ వర్మ, సిరాజ్ హైదరాబాద్ చేరుకునే అవకాశం ఉంది. ఈ ఇద్దరి ఛాంపియన్స్‌ను ఘనంగా స్వాగతం పలికేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, తెలంగాణ సర్కార్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించేందుకు హెచ్‌సీఏ సిద్ధమైంది. అసాధారణ ప్రదర్శనతో తెలంగాణ గర్వపడేలా చేసిన తిలక్ వర్మ, మహమ్మద్ సిరాజ్‌లను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సన్మానించే అవకాశం ఉంది. ఈ సందర్భంగానే తిలక్‌కు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు క్యాష్ ప్రైజ్, ఇంటి స్థలంను బహుమతిగా అందజేయనున్నారని టాక్ వినిపిస్తోంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన భారత జట్టులో భాగంగా ఉన్న సిరాజ్‌కు తెలంగాణ సర్కార్ డీఎస్పీ ఉద్యోగంతో పాటు జూబ్లీహిల్స్‌లో 600 గజాల నివాస స్థలాన్ని బహుమతిగా అందజేసింది.తిలక్ వర్మకు కూడా గ్రూప్-1 ఉద్యోగంతో పాటు ఇంటి స్థలం బహుమతిగా అందజేయవచ్చని స్పోర్ట్స్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే.. భారత విజయాన్ని కొనియాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

# గంభీర్ అన్‌స్టాపబుల్..



టీమ్‌ఇండియాను విజేత నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఇలా రెండు విభిన్న పాత్రల్లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడం క్రికెట్‌లో ఇదే తొలిసారి. దీనికి తోడు 2011 వన్డే వరల్డ్ కప్ విజేత జట్టులో కూడా గంభీర్ సభ్యుడిగా కీలకపాత్ర పోషించాడు. భారత సీనియర్ పురుషుల జట్టు కోచ్‌లలో ఇంతవరకు ఎవరికీ సాధ్యం కాని రికార్డును గంభీర్ అందుకున్నాడు. కేవలం రెండేళ్లలోపే రెండు ఐసీసీ ట్రోఫీలు (2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2026 టీ20 వరల్డ్ కప్) గెలిపించిన ఏకైక కోచ్‌గా నిలిచాడు. గతేడాది దుబాయ్‌లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో కివీస్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించిన భారత్, ఇప్పుడు అహ్మదాబాద్‌లో అదే కివీస్‌ను 96 పరుగుల తేడాతో చిత్తు చేసి వరుస విజయాలను అందుకుంది. ఈ రెండు భారీ విజయాల వెనుక గంభీర్ మాస్టర్ మైండ్ ఉందనడంలో సందేహం లేదు. గౌతమ్ గంభీర్ తన దూకుడు

భారత క్రికెట్‌లో గౌతమ్ గంభీర్ పేరు మరోసారి మార్మోగిపోతోంది. టీమ్‌ఇండియా ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే అతను అద్భుతాలు సృష్టిస్తున్నాడు. అయితే మధ్యమధ్యలో తనపై అనేక విమర్శలు వచ్చినా అవేమి పట్టించుకోకుండా ముందుకు సాగాడు. తాజాగా అహ్మదాబాద్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో భారత్ ఘనవిజయం సాధించడంతో గంభీర్ ఖాతాలో ఒక అరుదైన ప్రపంచ రికార్డు చేరింది. రెండు విధాలుగా టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలి క్రికెటర్‌గా అతడు అరుదైన ఘనత సాధించాడు. గౌతమ్ గంభీర్ ప్రయాణం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 2007లో జరిగిన మొట్టమొదటి టీ20 వరల్డ్ కప్ ఫైనల్ నెగ్గిన భారత జట్టులో అతడు సభ్యుడు. ఆ టోర్నీలో ప్లేయర్‌గా అద్భుత ఇన్నింగ్స్ ఆడి భారత్‌కు కప్పు అందించడంలో కీలక పాత్ర పోషించాడు. సరిగ్గా 19 ఏళ్ల తర్వాత, 2026లో అదే టోర్నీలో మళ్లీ టీ20 వరల్డ్‌కప్‌ను అందుకున్నాడు. అయితే ఈసారి కోచ్‌గా ఆ ఘనత సాధించాడు. జట్టుకు కోచ్‌గా ఉంటు తన వ్యూహాలతో

స్వభావంతో జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపాడు. సీనియర్లు, జూనియర్ల మధ్య సమన్వయం కుదురుస్తూ తీసుకున్న నిర్ణయాలు నేడు భారత్‌కు మరో కప్పు తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా సంజు శాంసన్, అభిషేక్ శర్మ వంటి ఆటగాళ్లపై ఉంచిన నమ్మకం ఫైనల్ మ్యాచ్‌లో సరైన ఫలితాన్ని ఇచ్చింది. వరుసగా రెండు ఐసీసీ ట్రోఫీలు గెలిచిన గంభీర్, భవిష్యత్తులో మరిన్ని విజయాలను టీమ్‌ఇండియాకు అందిస్తారని అభిమానులు ఆశిస్తున్నారు. కోచ్‌గా గంభీర్ ప్రయాణం అంత సాఫీగా ఏమీ సాగలేదు. ముఖ్యంగా టెస్టు ఫార్మాట్‌లో టీమ్‌ఇండియా వరుసగా ఎదుర్కొన్న కొన్ని వైఫల్యాలు విమర్శల వర్షం కురిపించాయి. సంప్రదాయ క్రికెట్‌లో కూడా అగ్రెసివ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని గంభీర్ చేసిన ప్రయోగాలు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవడంతో, కోచింగ్ శైలిపై నెగిటివ్ కామెంట్స్ గట్టిగానే వచ్చాయి. సీనియర్ ఆటగాళ్లను పక్కన పెట్టి కుర్రాళ్లకు అవకాశం ఇవ్వడం వంటి కఠిన నిర్ణయాలు తీసుకున్నప్పుడు, అది జట్టు బలాన్ని దెబ్బతీస్తోందనే వాదనలు కూడా గట్టిగా వినిపించాయి.

# విషాదాన్ని అధిగమించి.. ఇషాన్ కిషన్ కీలక ఇన్నింగ్స్

ఒకానొక సమయంలో ఇండియా నేషనల్ టీంకు దూరమైన ఇషాన్ కిషన్, తన కష్టంతో తలరాతను మార్చుకున్నాడు. డొమెస్టిక్ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన తర్వాత అతనికి జాతీయ జట్టులో చోటు దక్కింది. ఇప్పుడు అతను పొట్టి ప్రపంచ కప్ విజేతగా నిలిచిన జట్టులో సభ్యుడు. న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో ఇషాన్ 25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో హాఫ్ సెంచరీ (54 పరుగుల) ఇన్నింగ్స్ ఆడాడు. ఫైనల్ మ్యాచ్‌కు కేవలం ర2 రోజుల ముందే ఇషాన్ కుటుంబంలో ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. మీడియా నివేదికల ప్రకారం, ఫైనల్‌కు రెండు రోజుల ముందు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇషాన్ కిషన్ సోదరి (కజిన్), బావ మతిచెందారు. కుటుంబంలో ఇంతటి భారీ విషాదం నెలకొన్నప్పటికీ, ఇషాన్ కిషన్ దేశానికే ప్రియారిటీ ఇస్తూ ఫైనల్లో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. తాను ఇంతటి బాధలో ఉన్నాననే విషయాన్ని అస్సలు తెలియనివ్వలేదు. ఇటీవల రింకూ సింగ్ తండ్రి కన్నుమూశారు. అక్కడ కార్యక్రమం నిర్వహించిన వెంటనే రింకూ వెంటనే జాతీయ జట్టు కోసం తిరిగి వచ్చి దేశానికి తొలి ప్రాధాన్యం ఇచ్చాడు. ఇషాన్ కిషన్ తండ్రి ప్రణవ్ పాండే మాట్లాడుతూ.. "మేం చాలా కష్టంలో ఉన్నాం. ఇషాన్‌కు కూడా ఇంటివి రావాలి అనిపించింది. కానీ ప్రపంచ కప్‌లో జాతీయ జట్టుకు ఆడాల్సి ఉన్న కారణంగా రాలేకపోయాడు. అతను తన బాధను దిగమింగుతూ జట్టు కోసం మంచి ఇన్నింగ్స్ ఆడాడు' అని తెలిపారు. ఈ విషాదం కారణంగానే ఇషాన్ కిషన్ తండ్రి ఫైనల్ మ్యాచ్‌ను చూసేందుకు అహ్మదాబాద్ రాలేదు. టీ20 ప్రపంచకప్‌లో ఇషాన్ బ్యాట్ ఝుళిపించి సత్తా చాటాడు. టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో అతను 4వ స్థానంలో నిలిచాడు. ఇషాన్ 9 మ్యాచ్‌ల్లోని 9 ఇన్నింగ్స్‌ల్లో 35.22 సగటుతో, 193.29 మెరుపు స్ట్రైక్ రేట్‌తో 317 పరుగులు సాధించాడు. టోర్నీలో ఇషాన్ కిషన్ 3 అర్ధ శతకాలు చేశాడు. షాన్ ఇప్పటివరకు తన టీ20 అంతర్జాతీయ కెరీర్‌లో 45 మ్యాచ్‌లు ఆడాడు. ఈ మ్యాచ్‌ల్లోని 45 ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్ చేస్తూ 1328 పరుగులు చేశాడు. అతడు ఒక్క సెంచరీ, 10 అర్ధ సెంచరీలు నమోదు చేశాడు.ఫస్ట్ బ్యాటింగ్ చేసిన భారత్ ఓపెనర్లు సంజూ శాంసన్ (89), అభిషేక్ శర్మ (52) తో పాటు వన్ డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్ హాఫ్ సెంచరీలతో 5 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 19 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌట్ అయింది.





# టీమిండియాకు ఐసీసీ భారీ క్యాష్ ప్రైజ్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో టీమిండియా విజేగా నిలిచింది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌ను 96 పరుగుల తేడాతో చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 255 పరుగుల భారీ స్కోర్ చేయగా.. న్యూజిలాండ్ 159 పరుగులకు ఆలౌటైంది. ఈ గెలుపుతో డిఫెండింగ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకోవడంతో పాటు సొంతగడ్డపై ప్రపంచకప్ గెలిచిన టీమ్‌గా సరికొత్త చరిత్ర సృష్టించింది. టీమిండియాకు ఇది మూడో టీ20 ప్రపంచకప్ కావడం విశేషం. విశ్వవిజేతగా నిలిచిన టీమిండియాకు ఐసీసీ భారీ క్యాష్ ప్రైజ్ అందజేయనుంది. ఈ టోర్నీ కోసం ఐసీసీ మొత్తం 13.5 మిలియన్ డాలర్ల(రూ.120 కోట్ల) ప్రైజ్‌మనీ ప్రకటించింది. ఈ ప్రైజ్‌మనీని టోర్నీలో పాల్గొన్న జట్ల స్థానాల ఆధారంగా పంపిణీ చేయనున్నారు. ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టుకు ప్రైజ్‌మనీగా 3 మిలియన్ డాలర్లు(రూ.27.48 కోట్లు) దక్కనుంది. ఫైనల్లో రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ జట్టుకు 1.6( రూ.14.65 కోట్లు) మిలియన్ డాలర్లు దక్కనుండగా.. సెమీ ఫైనల్‌లో ఓడిన జట్లకు 7,90,000 డాలర్ల(రూ.7.24 కోట్లు) ప్రైజ్‌మనీ లభించనుంది. సూపర్-8 చేరిన జట్లకు 380,000(రూ.3.48 కోట్లు) డాటర్లు, గ్రూప్ స్టేజ్‌లో జట్లకు 250,000(రూ.2.29 కోట్లు) ప్రైజ్‌మనీ దక్కనుంది. ఈ ప్రైజ్‌మనీ మొత్తం ఆటగాళ్లకు కాకుండా ఆయా దేశాల క్రికెట్ బోర్డుకు ఐసీసీ అందజేయనుంది. అయితే బీసీసీఐ ఈ ప్రైజ్‌మనీతో కలిపి విజేతగా నిలిచిన భారత జట్టుకు భారీ నజరానా ప్రకటించే అవకాశం ఉంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024లో విజేతగా నిలిచిన భారత జట్టుకు బీసీసీఐ ఏకంగా రూ. 125 కోట్ల భారీ క్యాష్ ప్రైజ్‌ను ప్రకటించింది. ఇందులో ఆటగాళ్లకు ఒక్కొక్కరికి రూ.5 కోట్లు ఇవ్వగా.. రిజర్వ్ ప్లేయర్స్‌కు రూ. కోటి నజరానా అందజేశారు.

# గంభీర్ నవ్వుపై చమత్కరిస్తూ ధోనీ అభినందన

భారత క్రికెట్ అభిమానులకు ఇది డబుల్ ధమాకా. ఆదివారం జరిగిన టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి టీమిండియా విశ్వవిజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ చారిత్రాత్మక గెలుపు ఒక ఎత్తైతే.. టీమిండియా ఇద్దరు దిగ్గజాలు, మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ మధ్య జరిగిన ఒక ఆసక్తికరమైన సంభాషణ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. వీరిద్దరి మధ్య పడదని, మనస్పర్థలు ఉన్నాయని గత కొన్నేళ్లుగా వస్తున్న వార్తలకు ఈ ఒక్క ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ చెక్ పెట్టింది. భారత్ వరల్డ్ కప్ గెలవగానే ఎంఎస్ ధోనీ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా టీమిండియాకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక పోస్ట్ పెట్టాడు. అందులో ధోనీ టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ గురించి చాలా ప్రత్యేకంగా ప్రస్తావించాడు. నేరుగా పేరు చెప్పనప్పటికీ.. "కోచ్ సాబ్.. మీ ముఖం మీద నవ్వు చాలా బాగుంది. ఆ చిరునవ్వుతో కూడిన గాంభీర్యం కలయిక అద్భుతం!" అంటూ ధోనీ చమత్కరించాడు. గంభీర్ సాధారణంగా సీరియస్‌గా ఉంటాడనే విషయాన్ని ధోనీ తనదైన శైలిలో గుర్తు చేస్తూ అభినందించడం అభిమానులను ఖుషీ చేసింది. ధోనీ పెట్టిన ఈ పోస్ట్‌కు గౌతమ్ గంభీర్ వెంటనే స్పందించాడు. "నవ్వడానికి ఇంతకంటే మంచి



కారణం ఏముంటుంది మిమ్మల్ని చూడటం చాలా ఆనందంగా ఉంది!" అంటూ గంభీర్ రిప్లై ఇచ్చాడు. గంభీర్ చేసిన ఈ కామెంట్ కేవలం 3 గంటల్లోనే 60 వేలకు పైగా లైకులను సొంతం చేసుకుంది. వీరిద్దరి మధ్య ఉన్న ఈ స్వీట్ మూమెంట్ చూసి ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. "మేము చూడాల్సింది ఇదే.. వరల్డ్ కప్ గెలుపు మాకు ఈ అద్భుతమైన క్షణాన్ని బహుమతిగా ఇచ్చింది" అంటూ నెటిజన్లు కామెంట్లతో ముంచె త్తుతున్నారు. భారత జట్టు హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతోంది. వైట్ బాల్ క్రికెట్‌లో గంభీర్ కోచింగ్ టీమిండియాకు బాగా అ కలిసి వచ్చింది. గంభీర్ సారథ్యంలో భారత్ ఇప్పటికే 2025 ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది. ఇప్పుడు తాజాగా 2026 టీ20 వరల్డ్ కప్ టైటిల్‌ను కూడా కైవసం చేసుకుని గంభీర్ తన కోచింగ్ పవర్‌ను నిరూపించుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ, గంభీర్ వ్యూహాలు వెరసి భారత్ ప్రపంచ క్రికెట్‌లో తిరుగులేని శక్తిగా వెలుగొందుతోంది.

# అమెరికాలో 'ఉస్తాద్' ఫీవర్..


## విడుదలకు ముందే రికార్డు వసూళ్లు!



పవర్ స్టార్ పవన్ కల్యాణ్, మాస్ డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ అంచనాలకు తగ్గట్టే సినిమా విడుదలకు ముందే ఓవర్సీస్ మార్కెట్‌లో తన సత్తా చాటుతోంది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ఈ సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. అక్కడ ప్రీమియర్ షోల బుకింగ్స్ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే 50 వేల డాలర్లకు (భారత కరెన్సీలో సుమారు రూ. 41 లక్షలు) పైగా గ్రాస్ వసూలు చేసి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో బుకింగ్స్ మరింత పుంజుకుంటాయని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. పవన్ కల్యాణ్‌కు విదేశాల్లో ఉన్న బలమైన ఫ్యాన్ బేస్, అలాగే హరీశ్ శంకర్‌తో ఆయన కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా ఉండటంతో ఈ క్రేజ్ ఏర్పడింది. సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే, నార్త్ అమెరికా మార్కెట్‌లో కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని భావిస్తున్నారు. ఈ జోరు చూస్తుంటే ప్రీమియర్లతోనే భారీ వసూళ్లు రాబట్టే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఇద్దరు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్లు దేవి శ్రీ ప్రసాద్, థమన్ సంగీతం అందిస్తుండటం విశేషం. వీరిద్దరి సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. పవన్ ఇమేజ్‌కు తగ్గట్టుగా హరీశ్ శంకర్ ఈ సినిమాను పవర్-ప్యాక్డ్ యాక్షన్ సీక్వెన్స్‌లతో తీర్చిదిద్దుతున్నారు. 'ఓజీ' వంటి భారీ చిత్రం తర్వాత పవన్ కల్యాణ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. 'ఉస్తాద్ భగత్ సింగ్' ఈ నెల 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదలకు పది రోజుల ముందే ఓవర్సీస్‌లో ఈ స్థాయిలో బిజినెస్ జరగడం చూసి, సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనాలు సృష్టిస్తుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఆ నిర్మాత వల్ల నెల రోజులు ఖాళీగా ఉన్నా...

బాలీవుడ్ నటి ఆదా శర్మ సినీ ఇండస్ట్రీలో తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని అభిమానులతో పంచుకున్నారు. డేట్స్ సర్దుబాటు చేసే క్రమంలో ఓ నిర్మాత తన మేనేజర్‌ను బూతులు తిట్టారని, ఆ నిర్మాత తీరు వల్ల తాను నెల రోజుల పాటు ఎలాంటి పని లేకుండా ఇంటికే పరిమితమవ్వాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను పోస్ట్ చేశారు.
తాను ఒకే సమయంలో మూడు సినిమాలకు అంగీకరించానని, అయితే మొదటి సినిమా డేట్స్ పదే పదే మారడంతో మిగతా రెండు ప్రాజెక్టుల షెడ్యూల్స్‌కు ఇబ్బంది వచ్చిందని ఆదా తెలిపారు. అయినా సరే మొదటి సినిమా నిర్మాత తనకు ఆ పలానా తేదీలే కావాలని పట్టుబట్టారని, ఈ క్రమంలో తన మేనేజర్‌ను అసభ్య పదజాలంతో దూషించారని ఆమె వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న మిగతా ఇద్దరు దర్శకులు చాలా హుందాగా వ్యవహరించి తమ షూటింగ్ తేదీలను మార్చుకున్నారని ఆదా వివరించారు. మూడో సినిమా నిర్మాత అయితే తనకోసం ఏకంగా ఇతర నటీనటుల డేట్స్ కూడా అడ్జస్ట్ చేశారన్నారు. "ఇండస్ట్రీలో చెడ్డవాళ్లే కాదు, మంచివాళ్లు కూడా ఉన్నారని చెప్పడానికే ఈ విషయం చెబుతున్నా" అని ఆమె అన్నారు. అయితే, అందరూ సర్దుబాటు చేసుకున్నాక, మొదటి సినిమా నిర్మాత మాత్రం తనకు ఇప్పుడు ఆ డేట్స్ వద్దని చెప్పడంతో తాను మానసికంగా, ఆర్థికంగా దెబ్బతిన్నానని ఆదా వాపోయారు. ఇదే సమయంలో 'ది కేరళ స్టోరీ' సీక్వెల్‌లో తాను ఎందుకు నటించడం లేదన్న దానిపై కూడా ఆదా శర్మ స్పందించారు. తాను భాగం కాని సినిమా గురించి వార్తల్లో నిలవడం కోసం మాట్లాడటం సరికాదన్నారు. తనకు సీక్వెల్‌లో అవకాశం వచ్చిందా లేదా అనేది మేకర్స్, తన మధ్య ఉండాల్సిన విషయమని స్పష్టం చేశారు. మొదటి భాగం ఆఫ్ఘనిస్తాన్‌లోని ఐసిస్ క్యాంపుల నేపథ్యంలో సాగితే, రెండో భాగం పూర్తిగా భిన్నమైన కథ అని ఆమె తెలిపారు.





# మైక్ దొరికితే తెలివి పెరగదు..

## పార్థిబన్‌కు త్రిష స్ట్రాంగ్ కౌంటర్!

ప్రముఖ నటుడు ఆర్. పార్థిబన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్ ఘాటుగా స్పందించారు. మైక్రోఫోన్ చేతికి దొరికినంత మాత్రాన మాట్లాడే మాటల్లో తెలివి ఉండదని, అది మూర్ఖత్వాన్ని మరింత గట్టిగా వినిపిస్తుందని ఆమె చురకలంటించారు. ఇటీవల ఒక అవార్డుల కార్యక్రమంలో త్రిషను ఉద్దేశించి పార్థిబన్ చేసిన వ్యాఖ్యలు కోలీవుడ్‌లో దుమారం రేపాయి.



### అసలేం జరిగింది?

ఇటీవల జరిగిన గలాటా అవార్డ్స్ కార్యక్రమంలో గతంలో తను కలిసి పనిచేసిన నటీనటులపై అభిప్రాయం చెప్పాలని పార్థిబన్‌ను కోరారు. ఈ క్రమంలో తెరపై త్రిష ఫొటో కనిపించగానే, ఆయన ఆమె పేరును నేరుగా ప్రస్తావించకుండా పరోక్ష వ్యాఖ్యలు చేశారు. "ఈ కుందవైని కొన్ని రోజులు ఇంట్లోనే ఉంచాలి. బయటకు రాకుండా చూసుకోవాలి. అదే మంచిది" అని అన్నారు. ఇటీవల నటుడు, రాజకీయ నాయకుడు విజయ్‌తో కలిసి త్రిష ఒక వివాహ వేడుకలో కనిపించిన నేపథ్యంలో పార్థిబన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

### ఘాటుగా స్పందించిన త్రిష

ఈ వివాదంపై త్రిష తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా గట్టిగా బదులిచ్చారు. "ఇటీవల జరిగిన ఒక ఈవెంట్‌లో ఒక వ్యక్తి తన అసిస్టెంట్ ద్వారా చెప్పించి చివరి నిమిషంలో నా పేరు, ఫొటో చేర్చారని ఆర్గనైజర్లు నాకు తెలిపారు" అని ఆమె వెల్లడించారు. "చేతిలో మైక్ ఉన్నంత మాత్రాన మాట్లాడే మాటలు తెలివైనవిగా లేదా హాస్యంగా ఉండవు. అది మూర్ఖత్వాన్ని మరింత గట్టిగా వినిపిస్తుంది. అవగాహన లేకుండా మాట్లాడే అసభ్యకరమైన మాటలు ఎవరిని ఉద్దేశించి అన్నారో వారి కంటే, మాట్లాడిన వ్యక్తి గురించే ఎక్కువ చెబుతాయి" అని ఆమె పోస్ట్ చేశారు. త్రిష స్పందనకు నెటిజన్ల నుంచి మద్దతు లభించింది.

### క్షమాపణ చెప్పిన పార్థిబన్

తన వ్యాఖ్యలపై వివాదం ముదరడంతో నటుడు పార్థిబన్ దిగివచ్చారు. ఈ నెల 8న తన ఎక్స్ ఖాతా ద్వారా క్షమాపణలు తెలిపారు. త్రిషను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నానని పేర్కొన్నారు. దీంతో ఈ వివాదం ప్రస్తుతానికి సద్దుమణిగింది. అయితే, సహనటిపై సీనియర్ నటుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



# ఫన్ ర్యాప్ సాంగ్

డిఫరెంట్ ఎంటర్‌టైఎనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్- డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి 'గాయపడ్డ సింహం'తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని సప్తస్వ మీడియా వర్క్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ నిర్మిస్తున్నాయి. పవన్ సాదినేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇటివల విడుదలైన ఫన్ ఫిల్ ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా సినిమాకు సంబంధించిన ఫన్ ప్రమోషనల్ ర్యాప్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాట సినిమా సటైరికల్ టోన్‌ను అద్భుతంగా చూపిస్తోంది. ఈ చిత్రంలో మానస చౌదరి, ఫరియా అబ్దుల్లా కథానాయికలు కాగా, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం2026 వేసవిలో థియేటర్లలో విడుదల కానుంది. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ.. 'కశ్యప్ శ్రీనివాస్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. అసలైన హీరో ఈ సినిమాకి ఆయన, ఆయన కథ. కష్టపడ్డ సింహం ఆయన. అదృష్టమైన సింహాన్ని నేను. తప్పకుండా ఈ సినిమాని ఫ్రెండ్స్‌తో ఫ్యామిలీతో కలిసి చూడండి' అని అన్నారు. ప్రొడ్యూసర్ భాను కిరణ్ మాట్లాడుతూ.. 'ఈ సినిమాని మా డైరెక్టర్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా తీశాడు. సినిమా చాలా బాగా వచ్చింది' అని పేర్కొన్నారు. డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'త్వరలోనే ఈ సినిమా రిలీజ్ అవుతుంది. అందరిని ఎంటర్‌టైన్ చేస్తుంది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ అసుర పాల్గొన్నారు.

# విజయ్ సినిమాకు మరో షాక్..

## రిలీజ్ మరింత లేటుగా..

రాజకీయాలపై పూర్తిగా దృష్టి పెట్టేందుకు తమిళ స్టార్ హీరో విజయ్ సినిమాలకు గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. అయితే చివరిగా ఆయన నటించిన చిత్రం 'జన నాయగన్'. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరిలో విడుదల కావాల్సింది. కానీ, అనుకోని అడ్డంకులు ఏర్పడి సినిమా విడుదల ఆగిపోయింది. ప్రస్తుతం ఈ సినిమా విడుదల కేసు కోర్టులో ఉంది. ఈ సినిమాను రివైజింగ్ కమిటీ వీక్షించాలి. కానీ, కమిటీలో ఒక సభ్యుడు అనారోగ్యం కారణంగా సినిమా స్క్రీనింగ్ చివరి నిమిషంలో వాయిదా పడింది. దీంతో సినిమా రిలీజ్ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. అన్ని సమస్యలు తీరితే సినిమాను ఫిబ్రవరిలో రిలీజ్ చేద్దామని భావించారు. కానీ, అది జరగలేదు. ఆ తర్వాత ఏప్రిల్‌లో సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేశారు. ఇంకా రివ్యూ కమిటీ వీక్షించి రిపోర్ట్ ఇస్తే.. సినిమా విడుదలకు మార్గం సుగమం అవుతుంది. కానీ, అది ఇంకా ఆలస్యం అయ్యేలా ఉంది. దీంతో ఏప్రిల్‌లో కూడా సినిమా రిలీజ్ అయ్యేలా కనిపించడం లేదు. మరోవైపు విజయ్ పుట్టిన రోజు నాడు దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచన ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. జూన్ 22న విజయ్ పుట్టినరోజు కావడంతో జూన్ 18న దీన్ని రిలీజ్ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.




Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com